ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-9-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 218 పేజీలు: 12 వెల: 6.50

ప్రత్యామ్నాయ వ్యూహాలతో భారత్ రెడీ

ట్రంప్, జిన్‌పింగ్‌ల భేటీకి రంగం సిద్ధం

9



## 'సీడాప్'తో 50 వేల విదేశీ ఉద్యోగాలు

### తొలిబ్యాచ్‌లో 171 మందికి శిక్షణ

### 40 జర్మనీ సంస్థలకు మంది ఎంపిక

### విదేశీ భాషలపై శిక్షణ ఇస్తున్నామన్న మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు 7,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ రాష్ట్ర ఉద్యోగ కల్పన, వ్యవస్థాపకాభివృద్ధి సంస్థ (సీడాప్) ద్వారా 50 వేల మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు విద్య,ఐటీ శ్రూఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. సీడాప్,ఇండో యూరో సింక్రనైజేషన్ అండ్ జర్మన్ హెల్త్ కేర్ సంయుక్త భాగస్వామ్యంతో అమలు చేస్తున్న అంతర్జాతీయ ఉపాధి కల్పన పథకం కింద 14 మంది నర్సింగ్,ఆరోగ్య సంరక్షణ నిపుణులకు జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తూ కాల్ లెటర్స్ అందాయి. కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులను శనివారం ఉండవల్లి లోని నివాసంలో మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తొలి బ్యాచ్‌లో సీడాప్ ద్వారా 171 మందికి శిక్షణ ఇవ్వగా ఇప్పటికే వివిధ విభాగాల్లో 40 మంది ఎంపికయ్యారు. మరో 14 మంది త్వరలోనే జర్మనీ వెళ్తున్నారు. మిగతా వారికీ ఉద్యోగాలు లభిస్తాయి. అంతర్జాతీయ అవకాశాలను మన విద్యార్థులు అందిపుచ్చుకునే విధంగా సీడాప్-ఓంక్యాప్ ద్వారా విదేశీ భాషలపై శిక్షణ ఇస్తున్నాం. చదువుతో పాటు విదేశీ భాషల్లో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. జర్మనీలో కొలువులు పొందిన ఒక్కొక్కరు మరో పదిమంది ఉద్యోగాలు సాధించేలా మార్గదర్శకం చేయాలి. ఈ నెలలో నైపుణ్య పోర్టల్‌ను ప్రారంభించబోతున్నాం. సమాజాభివృద్ధిలో >>2



## అంతర్జాతీయ బ్రాండ్ సృష్టించండి

### యువ పారిశ్రామిక వేత్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు

### రాష్ట్రంలో వివిధ రంగాల్లో అపూర్వ అవకాశాలు

### అతిపెద్ద కారిడార్‌గా అమరావతి, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై

### ఎపిలో గ్రీన్ ఎనర్జి కారిడార్: సిఎం

**విజయవాడ సెప్టెంబరు7 ,ప్రభాతవార్త ప్రతినిధి:** పరిశ్రమల ద్వారా సంపద సృష్టించి సమాజానికి సేవలందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువ పారిశ్రామిక వేత్తలకు పిలుపు నిచ్చారు. భారత్ లోని ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని సీఎం స్పష్టం చేశారు. అగ్రి ప్రాసెసింగ్, పర్యాటకం, డిఫెన్సు, స్పేస్, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్ ఇలా వేర్వేరు రంగాల్లో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. విశాఖ చెన్నై మధ్య నాలుగు లేన్ల రైల్వే లైన్ ప్రాజెక్టుతో ఈ ప్రాంత పరిస్థితి పూర్తిగా మారుతుందని అన్నారు. సమీప భవిష్యత్తులో అమరావతి హైదరాబాద్ బెంగుళూరు చెన్నై అతిపెద్ద కారిడార్ గా మారుతుందని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీలో గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్ మిషన్ కారిడార్ ఏర్పాటు కానుందని, అలాగే విశాఖలో గూగుల్ సంస్థ అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని సీఎం తెలిపారు. వివిధ రంగాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు వీలుగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్టు తెలిపారు.తన క్యాంపు కార్యాలయంలో గత రాత్రిపోయిన తరువాత ఎంట్రప్రెన్యూర్స్ ఆర్గనైజేషన్ కు చెందిన యువ పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ప్రతీ జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో క్రీడలకు సంబందించిన మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే పరిశ్రమలకు >>2



మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో పే ఫోన్ దగ్గర విద్యార్థి

## గురుకులాల్లో పే ఫోన్లు

### కార్పొరేట్ సంస్థల తరహాలో టెలిఫోన్ బాక్సులు

### విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం

### నేడు పెనుకొండలో ప్రారంభించనున్న మంత్రి సవిత

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** "హలో... అమ్మా... నాన్నా... బాగున్నారా..? నేను మీ చిన్నాను" అంటూ బీసీ బిడ్డలు తమ తల్లిదండ్రులకు ఫోన్లో రోజూ పలుకరించే అవకాశం అందుబాటులోకి తీసుకుని వస్తున్నామని బీసీ సంక్షేమశాఖా మంత్రి ఎస్.సవిత తెలిపారు. కళ్లెదుటే ఉండాల్సిన బిడ్డ ఎక్కడో దూరంగా గురుకులంలో ఉంటూ తింటున్నాడో.. లేదో..? బెంగతో మదనపడే తల్లిదండ్రులకు రోజూ తమ బిడ్డ పలుకరింపు వినే సదావకాశం కూటమి ప్రభుత్వం కల్పించింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సౌకర్యార్థం మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల్లో పే ఫోన్ పేరుతో టెలీఫోన్ బాక్స్‌లు ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 110 గురుకుల పాఠశాలల్లో పే ఫోన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో గురుకుల పాఠశాలలో ఆరు చొప్పున పే ఫోన్లు



ఏర్పాటు చేయబోతోంది. ఈ ఫోన్లను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత సోమవారం పెనుకొండ నియోజక వర్గం రొద్దం ఎంజేపీ స్కూల్లో ప్రారంభించబోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 110 గురుకుల పాఠశాలల్లో 40 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కుటుంబానికి, తల్లిదండ్రులకు దూరంగా ఉండడంతో విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతుంటారు. నెలకో, రెండు నెలలకో తల్లీదండ్రి వస్తే వారితో కాసేపు మాట్లాడడం, వారు వెళ్లిపోయాక దిగాలు పడిపోవడం విద్యార్థులకు పరిపాటిగా మారిపోయింది. విద్యార్థుల మానసిక వేదనను గుర్తించిన ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో పే ఫోన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ఫోన్ల ద్వారా తమ తల్లిదండ్రులు, బంధువులతో రోజూ మాట్లాడుకునే అవకాశం కలుగుతుంది. తరుచూ తల్లిదండ్రులతో మాట్లాడుతుండడం వల్ల విద్యార్థులకు ఇంటిపై ఉన్న >>2



## 13న మరో అల్పపీడనం

### 4 రోజుల్లో మళ్లీ వానలు

**విజయవాడ, సెప్టెంబరు7, ప్రభాతవార్త ప్రతినిధి:** బంగాళాఖాతంలో ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఇది పశ్చిమవాయ వ్య దిశగా ఏపీ, ఒడిశా, తెలంగాణ వైపు కదిలే అవకాశముందనిన్నారు, దీని ప్రభావంతో ఈ నెలాఖరు వరకు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురవొచ్చని పేర్కొంది. మరోవైపు రాబోయే 4 రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడొచ్చని అమరావతి వాతావరణ విభాగం తెలిపింది. శుక్రవారం అనకాపల్లి, >>2



## మాతా, శిశు వైద్యసేవలకు ఊతం

### అందుబాటులోకి రానున్న 1,000 పడకలు


### గుంటూరు జిజిహెచ్‌లో 500, కాకినాడ జిజిహెచ్‌లో 500

### రూ.128 కోట్ల వ్యయంతో రెండు నూతన ఎంసిహెచ్ బ్లాకులు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వాస్పత్రుల్లో మాతా, శిశు వైద్య సేవలను విస్తరింపజేసి గర్భిణులు, నవజాత శిశువుల మరణాలను తగ్గించే కూటమి ప్రభుత్వ ప్రయత్నాల్లో ఒక పెద్ద అడుగు ముందుకు పడనుంది. గుంటూరు, కాకినాడ సర్వజన ఆస్పత్రు(జిజిహెచ్ )ల్లో రెండు నూతన ఎంసిహెచ్ (మదర్ అండ్ ఛైల్డ్ కేర్) బ్లాకుల ద్వారా సేవలను పెంచడానికి ప్రభుత్వం సిద్ధమైంది.త్వరలో అందుబాటులోకి రానున్న ఈ రెండు బ్లాకుల్లో వైద్యసేవలందించడానికి అవసరమయ్యే వైద్య పరికరాలను, ఇతర అవసరమైన వస్తువులను రూ.51.33 కోట్లతో కొనుగోలు చేయడానికి వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు.

**రెండు నూతన ఎంసిహెచ్ బ్లాకులు.**

గుంటూరు జిజిహెచ్ లో పూర్వ విద్యార్థుల (బిలీదితివితి) ఆర్థిక సహకారంతో రూ.86 కోట్లతో నిర్మించబడుతున్న నూతన ఎంసిహెచ్ బ్లాకు త్వరలో పూర్తి కానున్నది. దీనిలో 500 పడకల ద్వారా మాతా, శిశు వైద్యసేవలల్ని విస్తృతం చేయనున్నారు. ఇదే రీతిన, కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల (శిలీదితివితి) సహకారంతో రూ.46కోట్లతో నిర్మాణంలో వున్న మరో ఎంసిహెచ్ బ్లాకు కూడా త్వరలో పూర్తి కానున్నది. దీనిలో కూడా మరో 500 పడకలతో సేవలందించేదుకు వీలుంది .ఈ రెండు ఎంసిహెచ్ బ్లాకు ల ద్వారా సేవలందించేందుకు అవసరమైన వైద్య పరికరాలు, అనుబంధ సామగ్రిని రూ.51.33 కోట్లతో కొనుగోలు చేయడానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ అనుమతించారు. మొత్తం 332 రకాలకు చెందిన 5,687 పరికరాలు మరియు సామగ్రిని కొనుగోలు చేస్తారు. గుంటూరు జిజిహెచ్‌లో 37 రకాలకు చెందిన 1,187 పరికరాలను రు.23.51 కోట్లతో అందజేస్తారు. కాకినాడ జిజిహెచ్ లో 295 రకాలకు చెందిన 4,500 పరికరాలను రు.27.82 కోట్లతో ఏర్పాటు చేస్తారు.ఈ కొత్త బ్లాకుల కోసం పడకలు, బెడ్లు, ఐసియు బెడ్లు, పేషెంట్ మోనిటర్లు, వెంటిలేటర్లు, డీఫిబ్రిలేటర్లు, ఇసిజి మెషీన్లు, మొబైల్ ఎక్స్‌రే యూనిట్లు, మొబైల్ ఆల్ట్రా సౌండ్ మెషీన్లు, నిబులైజర్లు, డెలివరీ సెట్లు, ఆక్సీ మీటర్లు, ఫోటో థెరపీ యూనిట్లు, సర్జికల్ ఛైర్లు వంటి పలు రకాల వైద్య పరికరాలను భారీ స్థాయిలో కొనుగోలు చేయనున్నారు. ఈ రెండు ఆస్పత్రుల్లో ఎంసిహెచ్ బ్లకుల నిర్మాణానికి ముందుకొచ్చిన >>2




## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి

### దూసుకొచ్చిన 800 డ్రోన్లు, క్షిపణులు

### చిన్నారి సహా ముగ్గురి మృతి

**కీవ్, సెప్టెంబరు 7:** ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి పెద్ద ఎత్తున దాడులుచేసింది. ఒకేసారి 800కి పైగాడ్రోన్లు,క్షిపణులుప్రయోగించింది. వార్‌ప్రారంభించాక ఈస్థాయిలో గగనతల దాడులుచేయడం ఇదే తొలిసారి. అలాగే తొలిసారి ఒక ప్రభుత్వ కార్యాలయం లక్ష్యంగాచేసుకుని రష్యా దాడులు చేసింది. ఉక్రెయిన్‌ప్రతినిధి యూరీ ఇన్హాత్ ఈ దాడులను ధృవపరిచారు. ప్రత్యర్థి రష్యా 13 క్షిపణులు కూడా ప్రయోగించిందని, 747 డ్రోన్లు, నాలుగు క్షిపణులను నేల కూల్చామని తెలిపారు.54 డ్రోన్లు, తొమ్మిది క్షిపణులు కీవ్ సహా దేశంలోని 37 ప్రాంతాలను తాకినట్లు ఆయన చెప్పారు. ఈ దాడుల్లో ఒక చిన్నారిసహా ముగ్గురు మృతిచెందారు. పదుల సంఖ్యలో పౌరులు గాయపడ్డారు. రష్యా దాడుల్లో >>2



ఆదివారం హైదరాబాద్‌లో కనిపించిన చంద్రగ్రహణం దృశ్యాలు

## కనువిందు చేసిన సంపూర్ణ చంద్రగ్రహణం

### భారత్‌సహా అనేక దేశాల్లో కనిపించిన వైనం

### దేశవ్యాప్తంగా మధ్యాహ్నం నుంచి మూతపడిన ఆలయాలు

### గ్రహణ సమయంలో ఎర్రగా కనిపించిన చంద్రుడు

**హైదరాబాద్, సెప్టెంబర్ 7: ప్రభాతవార్త:** ఖగోళ అద్భుతంగా పిలువబడే సంపూర్ణ చంద్ర గ్రహణం ఆదివారం రాత్రి భారత్ సహా అనేక దేశాలలో క నువిందు చేసింది. ఆయా దేశాల కాలమానం ప్రకారం ఈ గ్రహణ వేళలు వుంటాయని అంతరిక్ష పరిశోధనా శాస్త్రవేత్తలు ఇప్పటికే ప్రకటించడం తె లిసిందే. భారత్‌లో రాత్రి 8.58 గంటలకు గ్రహణ ప్రారంభ సమయం కాగా పాక్షిక గ్రహణం మాత్రం 9.57 గంటలకు మొదలయ్యింది. చంద్రుడు పూర్తిగా గ్రహణ పరిధిలోకి వెళ్లిన సమయం రాత్రి 11 గంటలు. ఇక చంద్రుడు రాత్రి >>2

## 'సెట్'ల కౌన్సెలింగ్‌కు షెడ్యూలు విడుదల

### నేటి నుంచి ప్రక్రియ మొదలు

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లాసెట్,పీజీ లాసెట్,ఎడ్‌సెట్,పీఈసెట్,కింద ప్రవేశాలకు సంబంధించిన కౌన్సిలింగ్‌లకు ఉన్నత విద్యా మండలి షెడ్యూలు విడుదల చేసింది. వీటికి రెండు విడతల కౌన్సిలింగ్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొంది. న్యాయ విద్యకు సంబంధించిన ఏపీ లాసెట్,పీజీ లాసెట్ ప్రవేశాల కౌన్సిలింగ్ ఈ నెల 8 నుంచి ప్రారంభించనున్నట్లు ఉన్నత విద్యా మండలి కార్యదర్శి టీవీ కృష్ణమూర్తి శనివారం తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 8-11 వరకు,ధృవపత్రాల పరిశీలనకు 9-12 వరకు,వెబ్ ఐచ్ఛికాల నమోదుకు 12-14 వరకు, ఐచ్ఛికాల మార్పునకు 15న అవకాశం కల్పించినట్లు చెప్పారు. 17న సీట్ల కేటాయింపు,19న కళాశాలల్లో చేరేందుకు అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. బీఇడీలలో ప్రవేశాలకు సంబంధించిన ఎడ్‌సెట్ కౌన్సిలింగ్ ఈ నెల 9 నుంచి ప్రారంభం కానుంది. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల9-12 వరకు,ధృవ పత్రాల పరిశీనకు 10-13వరకు, వెబ్ ఐచ్ఛికాల నమోదుకు 13-15వరకు, ఐచ్ఛి >>2





## మహిళల వరల్డ్ కప్‌కు విశాఖ ఆతిథ్యం

### ప్రారంభోత్సవానికి మంత్రి లోకేష్‌కు ఆహ్వానం

### వైజాగ్ స్టేడియంలో ఐదు మ్యాచ్‌లు: ఎసిఎ కార్యదర్శి సానా సతీష్ బాబు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో తొలిసారిగా మహిళల వరల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వబోతోంది. ఆదివారం వైజాగ్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఉమెన్స్ వరల్డ్ కప్ ట్రోఫీ ప్రదర్శన కార్యక్రమంలో ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మహిళల వరల్డ్ కప్‌లో ఐదు మ్యాచ్‌లను వైజాగ్‌లో నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నాం" అన్నారు. విశాఖలో తొలిసారి జరుగుతున్న ఈ మ్యాచ్ చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన "బ్రేకింగ్ బౌండరీస్ విత్ నారా లోకేష్" కార్యక్రమం రాష్ట్ర క్రీడా అభివృద్ధి పట్ల చూపుతున్న నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 10 సంవత్సరాల క్రీడా రోడ్‌మ్యాప్లో క్రీడా కోటాను 3 శాతంకు విస్తరించడం, క్రీడాకారులకు విద్యా-ఉపాధి అవకాశాలు కల్పించడం ముఖ్యాంశాలుగా ఉన్నాయని ఆయన తెలియజేశారు. అక్టోబర్లో జరగనున్న వరల్డ్ కప్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆహ్వానించామని తెలిపారు. మిథాలీ రాజ్ మెంటార్‌గా, రాబోయే సెంటర్స్ ఆఫ్ఎక్సలెన్స్ తో కలసి గ్రామీణ, పాఠశాలస్థాయి ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు సిద్ధమవుతాయని అన్నారు. మహిళల వరల్డ్ కప్ కేవలం ఒక టోర్నమెంట్ మాత్రమే కాదు >>2



## ఈస్ట్ ఇండియా పెట్రోలియం కంపెనీపై పిడుగులు

### భారీగా చెలరేగిన మంటలు.. భయాందోళనలో స్థానికులు

### అదుపులో పరిస్థితి: ఎమ్మెల్యే గణబాబు

**గాజువాక, సెప్టెంబర్ 7,ప్రభాతవార్త:** నెవల్ డాక్ యార్డ్ సమీపంలో ఈస్ట్ ఇండియా పెట్రోలింగ్ కంపెనీలోని పెట్రోల్ ఫిల్టరింగ్ ట్యాంక్‌పై పిడుగు పడి భారీ స్థాయిలో మంటలు ఎగిసిపడ్డాయి. ఒక ప్రక్క భారీ వర్షం...మరో ప్రక్క అగ్ని ప్రమాదం దింతో ఒక్కసారిగా సమీప పారిశ్రామికప్రాంతం లోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం 3గం సమయంలో ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సంస్థ తన ఉద్యోగులను బయటకు పంపించి అగ్నిమాపక శాఖ కు సమాచారం అందించింది. దింతో విశాఖ స్టీల్ ప్లాంట్ కు సంబందించిన ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక శకటాల సహాయంతో ఎగసిపడే మంటలను అదుపులోకి తీసుకొంచెందుకు తీవ్ర ప్రయత్నం చేసాయి. పిడుగు పడే సమయంలో ఫిల్టరింగ్ ట్యాంక్ సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దింతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా స్థానిక ఎమ్మెల్యే పి గణబాబు, అర్బర్ డివిజన్ ఏసీపీ కాళిదాసు, సిఐ గొలగాని అప్పారావు, పోలీసు సిబ్బంది సంఘటన ప్రదేశానికి చేరుకొని పరిస్థితితిని ఆరాతీసారు. ప్రజలు ఎవరు బయపడవలసిన >>2

08-09pg2exHMNWJQE 2_08-09pg2exHMNWJQE.qxd 9/8/2025 12:20 AM Page 1





ఆదివారం ముంబయిలోని జుహు బీచ్‌లో బీచ్ క్లీనప్ డ్రైవ్‌లో పాల్గొన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి భార్య అమృత దేవేంద్ర ఫడ్నవీస్

## అంతర్జాతీయ బ్రాండ్ సృష్టించండి

>> అవసరమైన నైపుణ్యం ఉన్న యువతను తయారు చేసేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 33 శాతం పచ్చదనాన్ని 50 శాతానికి పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆయా దేశాల పేర్లను సూచించేలా పార్కులతో సుందరీకరణ చేపడుతున్నట్టు వెల్లడించారు. యువ పారిశ్రామిక వేత్తలు కొత్త రంగాల్లోకి అడుగుపెట్టి సత్తా చాటాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రస్తుతం నడుపుతున్న సంస్థలను మరింత వృద్ధిలోకి తేవాలని.. ఆంధ్రా ప్రెన్యూర్స్ అనే పేరు నిలబెట్టాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రభుత్వం రూపొందిస్తున్న పాలసీలను వినియోగించుకుని అంతర్జాతీయ స్థాయికి తమ సంస్థలను తీసుకెళ్లాలని సీఎం అన్నారు.

## రెండో తరగతి విద్యార్థినిపై టీచర్ ప్రతాపం

### బెత్తం దెబ్బలకు తోడు 100 గుంజీలు

### బాలికనడవలేని స్థితికి చేరడంతో ఫిర్యాదులు

### టీచర్ తొలగింపు.. హెడ్మాస్టర్ సస్పెన్షన్

**ప్రతాప్‌గఢ్, సెప్టెంబరు 7:** రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల ఓ ఉపాధ్యాయుడు దారుణంగా ప్రవర్తించాడు. క్లాస్ జరుగుతున్న సమయంలో టాయిలెట్ వెళ్లేందుకు అనుమతి అడిగినందుకు కర్రతో కొట్టారు. అంతటితో అగకుండా 100 గుంజీలు తీయించారు. దీంతో ఆ బాలిక నడవలేని పరిస్థితికి వచ్చింది. దీనిపై అధికారులకు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. ఛత్తీస్‌ఘర్‌లోని సర్గుజా జిల్లా ప్రతాప్‌గఢ్ ప్రాంతంలోని డీఏవీ ముఖ్యమంత్రి పబ్లిక్ స్కూల్‌లో సెప్టెంబర్ 5న జరిగింది. రెండో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని టాయిలెట్‌కు వెళ్లేందుకు టీచర్‌ను అనుమతి అడిగింది. ఫోన్ చూస్తున్న టీచర్ నమ్రతా సింగ్, ఆ విద్యార్థిని కర్రతో కాళ్లపై కొట్టి, 100 గుంజీలు తీయించారు. దీంతో బాలిక నడవలేక పోయింది. బాలిక పరిస్థితి చూసిన తల్లిదండ్రులు ఆరా తీయగా, స్కూల్‌లో జరిగిన విషయమంతా చెప్పింది. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు స్కూల్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయం వెలుగులో వచ్చింది. టాయిలెట్‌కు వెళ్లేందుకు అనుమతి అడిన విద్యార్థిని నమ్రతా సింగ్ అనే ఉపాధ్యాయుడు కర్రతో కొట్టాడని, 100 గుంజీలు తీయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గుంజీలు తీసేటప్పుడు కూడా కొట్టారని చెప్పారు. దీంతో బాలిక కండరాలు గాయాల పాలై నిలబడలేని పరిస్థితికి చేరుకుందని ఆరోపించారు. దీనిపై మొదట ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశామని, అటువంటివి ఏం జరగలేదని చెప్పారని వాపోయారు. ఆ ఉపాధ్యాయుడిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని అందుకే పోలీసులును ఆశ్రయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసు ఫిర్యాదు ఆధారంగా జిల్లా విద్యాశాఖ అధికారి దినేష్ ఝా భిలాయ్ డీఏవీ పబ్లిక్ స్కూల్స్ ప్రాంతీయ డైరెక్టర్‌కు లేఖ రాశారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ లేఖ ఆధారంగా టీచర్ నమ్రతా సింగ్‌ను వెంటనే విధుల నుంచి తొలగించారు. అలాగే, ప్రధానోపాధ్యాయుడు రాజీవ్ సింగ్ నిర్లక్ష్యగా వ్యవహరించినందుకు ఆయనను కొన్ని రోజుల పాటు సస్పెండ్ చేశారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని దినేశ్ తెలిపారు.

## సంపూర్ణ చంద్రగ్రహణం

>> 11.41 గంటల సమయంల అత్యంత ఎర్రగా మారి, నారింజ రంగుతో కలిపి బ్లడ్ మూన్‌గా కనువిందు చేశాడు. సంపూర్ణ చంద్ర గ్రహణం అత్యధికంగా 82 నిమిషాల పాటు వుండడం గమనార్హం. ఇటీవల కా లంలో భారత్‌లో ఇంత సుధీర్ఘ సంపూర్ణ చంద్ర గ్రహణం సంభవించలేదని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. కాగా సంపూర్ణ చంద్ర గ్రహణం ముగింపు మొ దలైన సమయం అర్ధరాత్రి 12.22 గంటలు. గ్రహణం అర్ధరాత్రి 1.26 గంటలకు ముగిసినప్పటికీ పూర్తిగా ముగిసిన సమయం మాత్రి తెల్లవారుజా మున 2.25 గంటల సమయంలో కావడం గమనార్హం. దీని తరువాతే చంద్రుడు ఎప్పటిలాగే నిండు పున్నమిలా కనిపించాడు. సంపూర్ణ చంద్ర గ్ర హణం వ్యవధి మూడు గంటల 28 నిమిషాలు. సంపూర్ణ చంద్ర గ్రహణం వేళ భూమికి దగ్గరగా చంద్రుడు వుండడంతో సాధారణ పున్నమి రోజుల తో పోలిస్తే 30 శాతం ఎక్కువ ప్రకాశవంతంగా కనిపించాడు. ఇక సంపూర్ణ చంద్ర గ్రహణం దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే హిమాచల్ ప్రదేశ్, రాజస్తాన్, లడాఖ్, గుజరాత్, కూర్గ్ తదితర ప్రాంతాలలో స్పష్టంగా కనిపించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈ ప్రాంతాలలో వాతావరణ కాలుష్యం తక్కువగా వుండడం ఇందుకు కారణంగా అధికారులు తెలిపారు. ఢిల్లీ, ముంబాయి సహా మెట్రో నగరాలలో కాలుష్యం వల్ల చంద్ర గ్రహణం స్పష్టంగా కనిపించలే దని అధికారులు చెబుతున్నారు. తెలు గు రాష్ట్రాల్లో కొన్నిచోట్ల మినహా చాలా ప్రాంతాలలో చంద్ర గ్రహణాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు వీక్షించారు. ఇక దేశంలోని అనేకచోట్ల ఔత్సాహి కులు బైనాక్యులర్స్‌తో పాటు టెలిస్కోప్ సహాయంతో చంద్ర గ్రహణాన్ని వీక్షించారు. హైదరాబాద్‌లోని బిర్లా సెంటర్ సహా మరికొన్నిచోట్ల చంద్ర గ్రహణం వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 150కి పైగా దేశాలలో 85 శాతం మంది ప్రజలు చంద్ర గ్రహణాన్ని వీక్షించారు. ఈ ఏడాది రెండవది, ఆఖరు చంద్ర గ్రహణం ఇది కావడం గమనార్హం. ఇదిలావుండగా సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా దేశ వ్యాప్తంగా అన్ని దేవాలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచే మూసివేశారు. తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ద పుణ్యక్షేత్రం తిరుపతి, పద్మావతి, బెజవాడ కనకదుర్గ, శ్రీశైలం, యాదగిరిగుట్ట, బాసర, అన్నవరం, సింహాచలం, చిలుకూరు బా లాజి సహా అన్ని దేవాలయాలను మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల మధ్య దర్శనాలను ముగించి ప్రత్యేక పూజల తరువాత మూసివేశారు. సా ్వమివారు, అమ్మవార్ల దేవాలయాలకు కొన్నిచోట్ల తాళాలు వేశారు. శ్రీకాళహస్తి దేవాలయం మాత్రం రాహు, కేతువు కారణంగా తెరిచి వుంచారు. చ ంద్ర గ్రహణం కారణంగా దేశ వ్యాప్తంగా అనేకచోట్ల నదులు, సముద్రాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేకంగా పూజలు చేశారు. కాగా సంపూర్ణ చంద్ర గ్రహణ ప్రభావం కుంభ, మిథున, సింహ రాశుల వారిపై వుంటుందని ఆగమన పండితులు చెబుతున్నారు.

## విదేశీ ఉద్యోగాలు

>> మహిళా సాధికారత కీలక పాత్ర పోషి స్తుంది. మహిళలను కించపర్చే సినిమాలను సైతం విడుదల కాకుండా అడ్డుకోవాలన్నదే తమ అభిమతం' అని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను మంత్రి లోకేష్ సన్మానించారు. వారికి ట్యాబ్‌లు అందించారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసి,స్థానిక ఆసుపత్రుల్లో నెలకు రూ.15వేల నుంచి రూ.20 వేలకు పనిచేసే తమకు జర్మనీలో రూ.2.8లక్షల వేతనంతో ఉద్యోగం లభించడం కలగా ఉందని పేర్కొంటూ అభ్యర్థులు భావోద్వేగానికి గురయ్యారు. ఉద్యోగాలు సాధించిన 14 మందిలో 9 మంది నిరుపేద ఎస్సీ కుటుంబాలకు చెందిన వారు కాగా, ముగ్గురు బీసీలు ఉన్నారు. జర్మనీలో ఇవే ఉద్యోగాల కోసం కన్సల్టెన్సీలను శిక్షణ కోసం సంప్రదిస్తే రూ.8 లక్షల వరకు అడిగారని, అంత డబ్బు చెల్లించే ఆర్థిక స్థోమత తమకు లేదని పేర్కొన్నారు. సీడాప్ ద్వారా ఒక్క రూపాయి తీసుకోకుండా జర్మన్ భాషలో శిక్షణ ఇచ్చి,ఉద్యోగం వచ్చేలా చేశారని తెలిపారు. తమకలను సాకారం చేసిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లను జీవితంలో ఎప్పటికీ మర్చి పోలేమన్నార. ఈకార్యక్రమంలో సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి,సీఈఓ నారాయణస్వామి, నైపుణ్యా భివృద్ధిసంస్థఎండీ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

## 13న మరో అల్పపీడనం

>> విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత పెరిగింది. కాకినాడ, నరసాపురం, మచిలీపట్నం, గన్నవరం, బాపట్ల, కావలి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణో గ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోద య్యాయి. రాబోయే బుధ, గురువారాల్లో ఉత్తర కోస్తా, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు ఉంటాయని చెప్పింది. మధ్య ప్రదేశ్, రాజస్థాన్ పరిసరాల్లో తీవ్ర అల్పపీడ నం కొనసాగుతోంది. ఇది పశ్చిమవాయవ్య దిశగా రాజస్థాన్, గుజరాత్ వైపు కదులుతూ ఆదివారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. అనకాపల్లిలో సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురిసింది. కొండకోపాక జాతీయ రహదారి వద్ద ఈదురు గాలులకు చెట్టు విరిగి పడిపోయింది. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. అన కాపల్లి గ్రామీణ సీఐ అశోక్ కుమార్ సిబ్బం దితో వచ్చి చెట్టు తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. కోనసీమలోని పలు లంక గ్రామాల ప్రజలు వరదతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. 10 లంక గ్రామాల ప్రజలు గోదావరి నదీ పాయలను మరపడవల్లో దాటి రాక పోకలు సాగిస్తున్నారు.

## వారం - వర్జ్యం

08-09-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
కృ.పాడ్యమి రా.9.12
పూర్వాభాద్ర రా.8.02
వర్జ్యం : రా.8.33-10.30
దు.మ.12.31-మ.1.20,
2) మ.2.59-3.48
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

- **మేషం :** వాక్చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకుని పనులు పూర్తిచేస్తారు.
- **వృషభం:** దూర ప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. విద్యార్థులకు అనుకూలమైన కాలం.
- **మిథునం:** అనుకోని అవకాశాలు కలిసి వస్తాయి. విలువైన ఆభరణాలు కొనుగోలు చేస్తారు.
- **కర్కాటకం:** ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తి చేస్తారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.
- **సింహం:** ఊహించని రీతిలో అవకాశాలు దగ్గరకు వస్తాయి. సద్వినియోగం చేసు కోండి.
- **కన్య :** అందరిలోనూ ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుంది. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు.
- **తుల :** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.
- **వృశ్చికం:** రాజకీయ, పారిశ్రామిక వర్గాల వారికి అన్ని విధాలా ప్రోత్సాహం లభిస్తుంది.
- **ధనుస్సు:** స్థిరాస్తి వ్యవహారాలు లాభిస్తాయి. కోర్టు వివాదాలు పరిష్కరించుకుంటారు.
- **మకరం:** గృహోపకరమైన పరికరాలు ఇవ్వవలసిన ఋణాలు మొదలయిన విషయాన్ని మీకు అనుకూలంగా మలుపు తిరుగుతాయి.
- **కుంభం:** ఎవరినీ లెక్క చేయక మీ పనిని సక్రమంగా నిర్వహించి వృత్తి, ఉద్యోగాలలో లాభపడతారు.
- **మీనం :** సంతాన క్షేమం పురోభివృద్ధి మానసిక ప్రశాంతత కలిగిస్తుంది. వస్తులాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గురుకులాల్లో పే ఫోన్లు

>> బెంగపోవడంతో పాటు విద్యపై దృష్టి సారించడానికి అవకాశం కలుగుతుందనేది ప్రభుత్వ భావన.

**రోజుకు రెండు గంటల మాత్రమే అవకాశం..**

రాష్ట్రంలో ఉన్న 110 గురుకుల పాఠశాలల్లో ఆరు పే ఫోన్లు చొప్పున ఏర్పాటు చేయనున్నారు. తల్లిదండ్రులు, బంధువులతో ఫోన్ లో మాట్లాడానికి రోజుకు రెండు గంటల సమయం కేటాయించనున్నారు. ఉదయం తరగతులు ప్రారంభానికి ముందు ఒక గంట, సాయంత్రం మరో గంట ఫోన్లో మాట్లాడానికి అవకాశం కల్పిస్తారు. ఆయా పాఠశాలల సౌలభ్యాన్ని సమయం నిర్ణయించుకునే అవకాశం ప్రిన్సిపాళ్లకు ప్రభుత్వం కల్పించింది.

**స్మార్ట్ కార్డుతో ఫోన్ చేసుకునే వీలు.**

విద్యార్థులకు ప్రభుత్వం ఏటీఎం కార్డుల తరహాలో స్మార్ట్ కార్డులు అందజేస్తోంది. ఈ కార్డులకు రూ.10లు రీ ఛార్జి చేయాల్సి ఉంటుంది. ఒక్కో నిమిషానికి ఒక్కో రూపాయి వ్యయమవుతుంది. విద్యార్థులే తమ కార్డులకు రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థి ఎన్ని పర్యాయాలైన స్మార్ట్ కార్డుకు రీఛార్జి చేసుకోవొచ్చు. తల్లిదండ్రులు సూచించిన నాలుగు ఫోన్ నెంబర్లు మాత్రమే ఆ స్మార్ట్ కార్డులో పొందుపరుచుతారు. విద్యార్థులు ఆ ఫోన్ నెంబర్లకు మాత్రమే ఫోన్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. విద్యార్థుల సౌకర్యం కోసం ఏర్పాటు చేస్తున్న పే ఫోన్లు దుర్వినియోగం కాకుండా ఉండేలా సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు.

**కార్పొరేట్ విద్యా సంస్థల తరహాలో.**

కార్పొరేట్ విద్యా సంస్థల్లో పే ఫోన్ల సౌకర్యం ఉంటుంది. ఇపుడీ అవకాశం ఎంజేపీ స్కూళ్లో చదువుకునే బీసీ విద్యార్థులకు వచ్చింది. ప్రభుత్వ పరిధిలోఉన్న మిగిలిన గురుకుల సంక్షేమ పాఠశాల్లో ఈ తరహా టెలిఫోన్ బాక్సులు ఇంకా ఏర్పాటు చేయలేదు. గురుకుల పాఠశాలల్లో చదివేదే అత్యధిక మంది పేద విద్యార్థులే. తమ బిడ్డలను చూసుకోవడం సుదూర ప్రాంతాల్లో ఉండే పేద తల్లిదండ్రులకు ఆర్థిక భారంతో కూడుకున్నది. పే ఫోన్ల ఏర్పాటుతో తమ బిడ్డలతో రోజూ మాట్లాడుకునే అవకాశం తల్లిదండ్రులకు, బంధువులకు, సంరక్షలకు కులుగుతుంది.

**ప్రభుత్వంపై భారం లేదు.**

110 గురుకుల పాఠశాల్లో ఏర్పాటు చేసే పే ఫోన్ల వల్ల ప్రభుత్వంపై ఎటువంటి భారమూ పడడం లేదు. ఎం.ఆర్.కె.ఆర్.ఐటీ సొల్యూషన్‌సంస్థ ఈఫోన్ల ఏర్పాటుకు ముందు కొచ్చింది. విద్యార్థులు చేసుకునే రీ ఛార్జే ఆ సంస్థకు ఆదాయంగా వస్తుంది. కార్పొరేట్ విద్యా సంస్థల్లోనూ ఇదే తరహాలో టెలిఫోన్ బాక్సులు ఏర్పాటు చేస్తుంటారు.

**పే ఫోన్లతో విద్యార్థులకు మేలు..**

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీ విద్యార్థుల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా బీసీ హాస్టళ్ల, గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వం పెట్టిన డైట్, కాస్మోటిక్ ఛార్జీల బకాయిలను అధికారంలోకి రాగానే చెల్లించాం. హాస్టళ్ల మరమ్మతులకు, వసతుల కల్పనకు నిధులు మంజూరు చేశాం. పౌష్టికాహారం అందజేయడంలో మెనూను సక్రమంగా అమలు చేయిస్తున్నాం. విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నాం. ఇంటిలో ఎందరు పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం నిధులు అందజేశాం. రూ.2,250ల విలువ కలిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు అందజేశాం. గురుకుల పాఠశాలల్లో కంప్యూటర్ లేబ్ లు, ఆర్వో ప్లాంట్లు, ఇన్వర్టర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఎంజేపీ స్కూళ్లో చదువుకునే విద్యార్థులకు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే లక్ష్యం. 110 ఎంజేపీ స్కూళ్లో పే ఫోన్లు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎంతో మేలు కలుగుతుంది. తమ వారితో రోజూ మాట్లాడుకునే అవకాశం కలుగుంది. దీనివల్ల విద్యార్థుల్లో మానసిక ధృడత్వం పెరిగి విద్యపై మరింత దృష్టి పెట్టే అవకావం కలుగుతుంది.

## ఎర్రసముద్రగర్భంలో ఇంటర్నెట్‌కేబుల్ కట్

### భారత్ సహా పశ్చిమ, తూర్పు ఆసియాదేశాల్లో నెట్ సేవలకు అంతరాయం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** ఎర్ర సముద్రంలో సముద్రగర్భ కేబుల్ తెగిపోవడం వల్ల భారతదేశం, పశ్చిమ తూర్పు సహా ఆసియాలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం ఇంటర్నెట్ సదుపాయం అంతరాయం ఏర్పడింది. అయితే ఈ సంఘటనకు కారణమేమిటో వెంటనే స్పష్టంగా తెలియలేదు. ఎర్ర సముద్రంలో నీటి అడుగున ఆప్టిక్ కేబుల్స్ తెగిపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీని కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఇంటర్నెట్ సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఇది మైక్రోసాఫ్ట్ అజూర్‌పై కూడా పెద్ద ప్రభావాన్ని చూపింది. ఎర్ర సముద్రంలో వేసిన కేబుల్ ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ యాక్సెస్ లో కీలక పాత్ర పోషిస్తోంది. యూరప్‌ఆసియా మధ్య నడిచే ఇంటర్నెట్‌లో ఎక్కువ భాగం ఈ వైర్లకు అనుసంధానించబడి ఉంటుంది. ఈ సమయంలో ప్రపంచ ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో 17% అంతరాయం కలిగించడానికి ఇదే కారణం. దెబ్బతిన్న కేబుల్స్‌లో సీకామ్, టిజిఎన్-ఇఎ, ఎఎఇ-1, ఇఐజి వంటి ప్రధాన వ్యవస్థలు ఉన్నాయి. ఇవి ఖండాల మధ్య డేటా ప్రవాహంలో ఎక్కువ భాగాన్ని అంతరాయం కలిగించాయని నిపుణులు చెబుతున్నారు. ఇంటర్నెట్ కేబుల్ విచ్ఛిన్నం మైక్రోసాఫ్ట్ వారి అజూర్‌పై పెద్ద ప్రభావాన్ని చూపింది. మైక్రోసాఫ్ట్ అజూర్ వినియోగదారులు ట్రాఫిక్‌లో, ముఖ్యంగా ఆసియాయూరప్ మధ్య సమస్యలను ఎదుర్కోవచ్చని తెలిపింది. కంపెనీ ప్రకారం, ఈ వైర్లను రిపేర్ చేయడానికి సమయం పట్టవచ్చు. కాబట్టి ప్రస్తుతం ఇతర మార్గాల ద్వారా డేటాను పంపుతున్నారు. వినియోగదారులపై ఈ సమస్య ప్రభావాన్ని తగ్గించడానికి టెక్నికల్ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. అయితే, కేబుల్స్ ఎలా తెగిపోయాయో అధికారులు ఇంకా కనుగొనలేకపోయారు. ఎర్ర సముద్రంలో జరిగిన మునుపటి సంఘటనలు తరచుగా వాణిజ్య నౌకలు వేసిన యాంకర్లు కారణంగా జరుగుతాయని చెబుతున్నారు. కానీ కొన్ని సందర్భాల్లో ఉద్దేశపూర్వక విధ్వంసం సరికి ఉండవచ్చని అంటున్నారు. ఈ ప్రాంతంలో కొనసాగుతున్న వివాదం కారణంగా, ముఖ్యమైన డిజిటల్ మౌలిక సదుపాయాలను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుని, ప్రపంచ కనెక్టివిటీని ప్రభావితం చేస్తాయని నిపుణులు అనుమానిస్తున్నారు. దీంతో పాటు, యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రంలోని ఇంటర్నెట్ కేబుల్‌లను దెబ్బతీసే అవకాశం ఉందని ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. గాజా యుద్ధాన్ని ముగించడానికి ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తీసుకురావడానికి ఈ చర్య తీసుకున్నారని వారు అంటున్నారు. అయితే, హౌతీ తిరుగుబాటుదారులు దీని గురించి ఏమీ స్పందించలేదు. ఇంటర్నెట్ యాక్సెస్‌ను పర్యవేక్షించే కంపెనీ నెట్‌బ్లాక్స్, ఎర్ర సముద్రం కింద ఏర్పాటు చేసిన అనేక కేబుల్‌లలో సమస్యల కారణంగా, అనేక దేశాలలో ఇంటర్నెట్ కనెక్షన్ నెమ్మదిగా మారిందని తెలిపింది. ఇందులో భారతదేశంపాకిస్తాన్ కూడా ఉన్నాయి. సౌదీ అరేబియాలోని జెడ్డా సమీపంలోని ఎస్ఎండబ్ల్యు4, ఐఎంఇడబ్ల్యుఇ కేబుల్ వ్యవస్థలో లోపం దీనికి కారణమని కంపెనీ తెలిపింది.





న్యూఢిల్లీలోని శాస్త్రీ పార్క్ మెట్రో స్టేషన్ సమీపంలో ఆదివారం ఆశ్రయం పొందిన ముంపుబాధిత ప్రజలు

## కౌసర్ క్రికెట్ గ్రౌండ్‌లో బాంబుదాడి.. ఒకరు మృతి

**కరాచి, సెప్టెంబరు 7:** పాకిస్థా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులోని ఓ క్రీడా మైదానంపై జరిగిన ఉగ్రదాడి తీవ్ర సంచలనం సృష్టించింది. బజౌర్ జిల్లాలోని ఖార్ తెహ్సిల్‌లో ఉన్న కౌసర్ క్రికెట్ గ్రౌండులో జరుగుతున్న ఒక క్రికెట్ మ్యాచ్‌పై ఉగ్రవాదులు బాంబు దాడికి పాల్పడ్డారు. ఈ దారుణమైన ఘటనలో ఒకరు మరణించగా పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన జరిగిన వెంటనే మైదానంలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం గుర్తించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స కొనసాగుతోంది. భద్రతా బలగాలు, స్థానిక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కౌసర్ క్రికెట్ గ్రౌండులో క్రీడాకారులు మ్యాచ్ ఆడుతున్నారు. దీన్ని చూసేందుకు అనేక మంది క్రికెట్ గ్రౌండ్‌కు చేరుకుని వీక్షిస్తున్నారు. ఈ సమయంలోనే ఒక్కసారిగా పేలుడు సంభవించింది. పెద్ద ఎత్తున శబ్దం రావడంతో అక్కడనున్న వాళ్లంతా ఉలిక్కిపడ్డారు. అయితే ఇది ఐఈడీ ద్వారా జరిగిన లక్షిత దాడి అని బజౌర్ జిల్లా పోలీస్ అధికారి వాకస్ రఫీక్ ధృవీకరించారు.

## ఈస్ట్ ఇండియా పెట్రోలియం కంపెనీపై పిడుగులు

>> అవసరంలేదని,వదంతులు నమ్మొద్దని,పరిస్థితి అదుపులోనే ఉందని ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని గణబాబు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కరణాలు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## మహిళల వరల్డ్ కప్‌కు విశాఖ ఆతిథ్యం

>> - ఇది ఆంధ్రప్రదేశ్ క్రీడా పునరుజ్జీవనానికి సంకేతం అన్నారు . విశాఖ ఈవెంట్ ద్వారా క్రీడా పర్యాటకం, ఉపాధి, మహిళా క్రీడాకారుల అభివృద్ధి కొత్త దారులు తెరుస్తుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ జాయింట్ సెక్రటరీ విజయకుమార్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గిరీష్ దొంగిరి తదితరులు పాల్గొన్నారు.

## మాతా, శిశు వైద్యసేవలకు ఊతం

>> గుంటూరు మెడికల్ కాలేజీ అలమ్నై ఆఫ్ నార్త్ అమెరికా (బిలీదితివితి), కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ అలమ్నై ఆఫ్ నార్త్ అమెరికా (ఖిలీదితివితి)లను మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ఈ బ్లాకుల నిర్మాణాలకు కృషి చేసిన ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు, సిబ్బందిని మంత్రి ప్రశంసించారు.

## 'సెట్'ల కౌన్సెలింగ్‌కు షెడ్యూలు విడుదల

>> కాల మార్పునకు 16న అవకాశం కల్పించారు. 18న సీట్ల కేటాయింపు,19,20 తేదీల్లో కళాశాలల్లో చేరేందుకు అవకాశం ఇచ్చారు.వ్యాయామ విద్య కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పీఈసెట్ కౌన్సిలింగ్ ఈ నెల 10 నుంచి జరుగనుంది. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 10-13వరకు,ధృవపత్రాల పరిశీలనకు 11-14 వరకు,వెబ్ ఐచ్ఛికాల నమోదుకు 14-16 వరకు,ఐచ్ఛికాల మార్పుకు 17న అవకాశం ఇచ్చారు. 19న సీట్ల కేటాయింపు 22,23 తేదీల్లో కళాశాలల్లో చేరేందుకు అవకాశం కల్పించారు.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి

>> క్యీవ్‌లోని మంత్రుల భవనం పాక్షికంగా ధ్వంసం అయింది. ఇందులో ఉక్రెయిన్ మంత్రుల నివాసాలు, కార్యాలయాలున్నాయి. శతృదేశం దాడిలో తొలిసారి ప్రభుత్వభవనం దెబ్బతిన్నట్లు ఉక్రెయిన్‌ప్రధాని యూలియా స్విరెడెన్కో తెలిపారు. భవనం మళ్లీ నిర్మించుకోవచ్చు. కానీ ప్రాణాలు తిరిగి తీసుకురాలేమని ఆవేదన వ్యక్తంచేసారు. ప్రపంచదేశాలు మాస్కోపై ఆంక్షలు విధించాలని పిలుపునిచ్చారు. అధ్యక్షుడు జెలెన్స్కీ ఈ దాడులను తీవ్రంగా కండించారు. రాజకీయ కక్షతోనే క్రెమ్లిన్ ఇలా దాడులుచేస్తోందని, దృఢసంకల్పంతోనే అడ్డుకోవచ్చని వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌కూడా రష్యాకు చెందిన డ్రుజ్బా చమురుపైప్‌లైన్‌పై ప్రతీకార దాడులుచేసింది.

## కొత్త మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం లేదు: మంత్రి దుర్గేష్

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై చేస్తున్నవి అసత్య ఆరోపణలు అని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్. అన్నారు.ఆయన తన కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో పీపీపీ విధానం ద్వారా నిర్మాణాల్లో వేగం పెరుగుతుంది. నిర్మాణం పూర్తైన అనంతరం కాలేజీలపై నియంత్రణ, యాజమాన్య హక్కు రాష్ట్ర ప్రభుత్వానికే..తద్వారా వైద్య విద్య ఎక్కువ మందికి అందుబాటులోకి వస్తుంది.పీపీపీ విధానంలో నిర్మిస్తున్న కొత్త మెడికల్ కాలేజీలతో పాటు ప్రతి మెడికల్ కాలేజీలో కనీసం 150 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా పెరిగే అవకాశం.వాస్తవాలను పక్కన పెట్టి రూ.8,500 కోట్ల విలువైన కాలేజీలను రూ.5,000 కోట్లకు బినామీలకు లీజుకు ఇస్తున్నారని వక్రీకరణ చేస్తున్నారు.వైద్య విద్య, ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయం.ఆర్థిక సమస్యలతో మూలనపడ్డ కాలేజ్ లను మళ్లీ పిపిపి విధానంలో పట్టాలు ఎక్కించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.సుదీర్ఘ కసరత్తు చేసి కేబినెట్ లో సమగ్రంగా చర్చించి తీసుకున్న నిర్ణయాన్ని వైసీపీ తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పు దోవ పట్టించడం సరైన విధానం కాదుసెల్ఫ్ ఫైనాన్స్ విధానం అని మెడికల్ సీట్ల ఫీజును రూ.12 లక్షలు చేసి అమ్మకానికి పెట్టే విధానాన్ని తెచ్చిన గత ప్రభుత్వం నేడు పిపిపి విధానాన్ని తప్పు పట్టడం విచిత్రంగా ఉందితాము 17 మెడికల్ కాలేజీలు కడితే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ పరం చేస్తుందని జగన్ చేస్తున్నది విష ప్రచారమన్నారు అన్ని కాలేజ్ లకు కలిపి రూ.8,500 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉండగా వైసీపీ హయాంలో కేవలం 17 శాతం మాత్రమే ఖర్చు పెట్టారు.గత ప్రభుత్వ హయాంలో 5 కాలేజీలు నిర్మించినట్లు చెప్పుకొంటున్న కాలేజీల్లోనూ కనీసం సిబ్బందిని కూడా నియమించని వైనం. అందుబాటు లో లేని హాస్టళ్లు, అడ్మినిస్ట్రేషన్ విధానం. వాటిలో క్లాసులు కూడా ప్రారంభం కాలేదు. మరి మిగతా వాటి పరిస్థితి ఏంటి?:మంత్రి కందుల దుర్గేష్ ప్రశ్నించారుఅర్థాంతరంగా ఆగిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు:మంత్రి కందుల దుర్గేష్.. 2023- 24 విద్యా సంవత్సరంలో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో అరకొర వసతులతోనే కళాశాలలు ప్రారంభం.కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25లో పాడేరులో మెడికల్ కళాశాల ప్రారంభం అవుతుంది.మార్కాపురం, ఆదోని, మదనపల్లె, పులివెందుల, నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, బాపట్ల, పెనుకొండ కళాశాలల నిర్మాణాన్ని కూడా వేగంగా పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయమన్నారు..నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా కాలేజీలను అప్‌గ్రేడ్ చేసి, ఏడాదిలో కనీసం ఒక్కో కాలేజ్ లో 100 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాలను ప్రారంభించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది:మంత్రి కందుల దుర్గేష్.పీపీపీ విధానంలో మెడికల్ కాలేజ్ లు పూర్తి చేసి సీట్లు అందుబాటులోకి తెస్తుంటే ప్రైవేట్ పరం అంటూ గగ్గోలు చేస్తున్న గత పాలకులకు విద్యార్థుల భవిష్యత్ పట్టదా?:మంత్రి కందుల దుర్గేష్. ప్రశ్నించారు.వైద్య విద్య పేద విద్యార్థులకు దూరం అవుతుందన్న ఆరోపణ పూర్తిగా అవాస్తవమన్నారు.



8-9Pg3exHMNWJQECVRS 3RD_8-9Pg3exHMNWJQECVRS.qxd 9/8/2025 12:33 AM Page 1



# తిరుమల సమాచారం

## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10లక్షల విరాళం



**తిరుమల,సెప్టెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో భక్తులకు రుచిగా శుచిగా అన్నప్రసాదాలు వడ్డిస్తున్న వెంగమాంబ అన్నప్రసాద ట్రస్ట్‌కు దాత 10లక్షల రూపాయలు విరాళమిచ్చారు. ఆదివారం ఉదయం తిరుపతికి చెందిన తిరుమలతిరుపతి హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండి నాగరాజునాయుడు విరాళాన్ని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు.

## శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు జడ్జి నరసింహ



**తిరుమల,సెప్టెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం నైవేద్యవిరామసమయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహా కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. కుటుంబంతో కలసి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి దర్శనం బాగా జరిగిందని, తిరుమలలో ఏర్పాట్లు బావున్నాయని తెలిపారు.

## 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### 15న విఐపి దర్శనాల సిఫార్సులకు బ్రేక్

**తిరుమల,సెప్టెంబరు 7 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామికి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు గాను ఈనెల 16వతేదీ మంగళవారం ఆలయంలో ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు పరమ పవిత్రంగా, ఒక యజ్ఞంలా నిర్వహిస్తారు. ఆలయంలోపల ఆనందనిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహద్వారం వరకు ఆలయంలోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం పూజాసామాగ్రి తదితర వస్తువులను సుగందద్రవ్యాలు నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర వాటితో కలగలిపిన నీటితో శుద్ధిచేస్తారు. ఆ సమయంలో స్వామివారి మూలవిరాట్టును శ్వేత వస్త్రంతో పూర్తిగా కప్పి



ఉంచుతారు. ఏడాదిలో నాలుగుదఫాలుగా కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం చేపడతారు. ప్రతి ఏడాది స్వామివారి బ్రహ్మోత్సవాలు, ఉగాది ఆస్థానం, వైకుంఠ ఏకాదశి,ఆణివార ఆస్థానం ముందు మంగళవారాలు ఆలయ శుద్ధి జరుగుతుంది. మంగళవారం అష్టదళపాదపద్మారాధన సేవరద్దుచేశారు. 16వతేదీ విఐపి బ్రేక్ దర్శనాలు రద్దయ్యాయి.

## 22నుంచి తాతయ్యగుంట గంగమ్మకు నవరాత్రి మహోత్సవాలు



**తిరుపతి,సెప్టెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమజిల్లాల్లోనే ఎంతో ప్రాశస్త్యం కలిగిన, తిరుపతి నగరగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఈనెల 22వతేదీ నుండి నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. ఈ తొమ్మిదిరోజులు ఒక్కోరోజు ఒక్కో అలంకారంలో గంగమ్మ భక్తులకు దర్శనమిస్తారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గంగమ్మ ఆలయంలో ఉభయదారులు భక్తులకు సేవలందిస్తారు. 22వతేదీ సోమవారం ఉదయం శుక్లపాడ్యమిరోజు మహాగణపతిపూజ, కలశస్థాపనతో ఆరంభమవుతాయి. 23వతేదీ మంగళవారం బాలత్రిపురసుందరీదేవి ఆలంకారంలో, 24వ తేదీ గాయత్రిదేవి అలంకారం, 25న అన్నపూర్ణాదేవి ఆలంకారం, 26న మహాలక్ష్మీదేవిగా, 27న లలితాత్రిపురసుందరిదేవిగా, 28న వారాహిదేవిగా, 29న సరస్వతిదేవి అలంకారంలో, సెప్టెంబర్ 30న దుర్గాదేవిగా, అక్టోబర్ 1వతేదీ మహిషాసురమర్ధినీదేవి అలంకారంలో, 2వతేదీ రాజరాజేశ్వరిదేవి అలంకారంలో గంగమ్మ భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయంలో ఆ తొమ్మిదిరోజులు ప్రతిరోజూ ఉదయం 7గంటలకు అభిషేకం, 8గంటలకు హోమం, 9గంటలకు సహస్రనామార్చన, సాయంత్రం 6.30గంటలకు ఊంజల్‌సేవ ఉంటుంది. భక్తులు దేవీనవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని ఆలయ ఇఒ జయకుమార్ కోరారు.

## ప్రపంచ తెలుగు మహా సభలకు తమిళనాడు గవర్నర్ రవికి ఆహ్వానం

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్, ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో 3,4,5 జనవరి 2026 న నందమూరి తారక రామారావు వేదికపై గుంటూరు, అమరావతిలో నిర్వహించనున్న 3 వ ప్రపంచ తెలుగు మహాసభలకు తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి ని కలిసి ఆహ్వానించినట్లు పరిషత్ అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. తమిళనాడులోని హోసూరు, కోయంబత్తూర్, మదురై, చెన్నై , తంజావూర్, సేలం, తిరుత్తణి , కంచి, చిదంబరం పలు ప్రాంతాలనుండి తెలుగు మహా సభలకు తెలు గుప్రజలు హాజరు కానున్నారని గవర్నర్ ఆర్.ఎన్.రవికి డా.గజల్ శ్రీనివాస్ విన్నవించారు.

జనవరి 3 వ తేదిన ఉదయం 10గం టలకు జరిగే మహాసభల ప్రారంభోత్సవ సభకు విశిష్ఠ అతిథిగా వచ్చి తెలుగు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించేందుకు తమిళనాడు గవర్నర్ సుముఖత చూపారని డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు.

## ఫిజియో థెరపిస్టులకు మంత్రి సత్యకుమార్ శుభాకాంక్షలు

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** ఫిజియో థెరపిస్టులకు కూటమి ప్రభుత్వం శుభాకాంక్షలు తెలియజేసింది. ప్రతి ఏటా సెప్టెంబర్ 8న ప్రపంచ ఫిజియో థెరపీ డేను జరుపుకుంటున్నారు. అన్ని జబ్బులూ మందులతో నయంకావు. కొన్ని జబ్బులకు ఔషధాలతో పాటు థెరపీ కూడా అవసరం. 1996 నుంచి ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ 8న అవగాహనా కార్యక్రమాల్ని నిర్వ హిస్తున్నారు.ఈ ఏడాది (2025) వృద్ధాప్యంఆరోగ్యం నినాదంతో కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. వృద్ధులకు ఫిజియో థెరపిస్టులందించే సేవలందించే సవలు ఎంతో ముఖ్యమైనవి. బలహీనపడిన కండరాలను బలోపేతం చేయడంలో వీరి సేవలు ఎంతో అవసరం. ఆర్థరైటిస్, వెన్నుపూస సమస్యలను, శరీరం అదుపు తప్పకుండా చేయడంలోనూ వీరందించే సేవల వల్ల మంచి ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధిలో కూడా వీరి సేవలు ప్రశంసనీయమన్నారు.

## ఇస్కో కిసాన్ సెజ్‌కు 2,776 ఎకరాలు

### పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాచర్లపాడులో కేటాయింపు, మరిన్ని పరిశ్రమలకూ భూములు

**విజయవాడ,సెప్టెంబరు 7,ప్రభాతవార్త ప్రతినిధి:** ఇస్కో కిసాన్ సెజ్ లిమిటెడ్ సంస్థకు భారీ పారిశ్రామికవాడ ఏర్పాటు చేసేందుకు వీలుగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రాచర్లపాడులో 2,776.23 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంస్థ ఇక్కడ రూ.870 కోట్ల పెట్టుబడులు పెట్టనుండగా,70 వేల మందికి ఉపాధి లభించనుంది. పలు సంస్థలకు భూములు కేటాయించేలా రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ) ఆమోదం తెలపడంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.స్కైరూట్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ,ఇంటిగ్రేటెడ్ రాకెట్ తయారీ,అసెంబ్లింగ్ టెస్టింగ్,స్టోరేజ్ ఫెసిలిటీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు వీలుగా తిరుపతి జిల్లాలో రౌతుసురమాల,బీఎస్‌పురం,కొత్తపాలెం గామల పరిధిలో 300 ఎకరాలు కేటాయించారు. ఇక్కడ స్కైరూట్ ఏరోస్పేస్ రూ.400 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 300 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి.శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలంలో ఆర్టిలరీ కమ్యూనికేషన్ షెల్,టీఎన్‌టీ ఫిల్లింగ్,మల్టీమోడల్ హ్యాండ్ గ్రెనేడ్ తయారీ యూనిట్ కోసం హెచ్ఎఫ్‌సిఎల్ సంస్థకు వెయ్యి ఎకరాలు కేటాయించారు. ఇక్కడ ఆ సంస్థ రూ.1040 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.

870 మందికి ఉపాధి లభించనుంది.జె.కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థకు ప్రైవేటు ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం విశాఖ జిల్లా పెందుర్తి మండలం గుర్రంపాలెంలో 63.67 ఎకరాలు కేటాయించారు.

ఈ సంస్థ రూ.237.71 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఇందులో 5 వేల మందికి ఉపాధి దక్కనుంది.అనకాపలి జిల్లా నక్కపలిల మండలం లోని నల్లమట్టిపాలెంలో ప్రైవేటు ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు వీలుగా వరాహ ఆక్వా ఫామ్స్‌కు 93 ఎకరాలు కేటాయించారు.అసోసియేషన్ ఆఫ్ లేడీ అంత్రపెన్యూర్స్ ఆఫ్ ఇండియాకు వైఎస్ ఎంఎస్ఎంఈ ఇంటర్నేషనల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు చిత్తూరు జిల్లా కుప్పం మండలం పాలర్లపల్లెలో 13.70 ఎకరాలు కేటాయించారు.

# చంద్రగ్రహణం ముందే శ్రీవారి ఆలయం తలుపులు మూత

### మధ్యాహ్నమే భక్తులు నిలుపుదల

### తిరిగి తెల్లవారు జామున పునఃప్రారంభం



తిరుమల శ్రీవారి ఆలయం తలుపులు, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం మూత

**తిరుమల,సెప్టెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** సంపూర్ణచంద్రగ్రహణం సంభవించడానికి కొన్ని గంటల ముందు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ తలుపులను ఆలయ అధికారులు, అర్చకులు,సన్నిధిగొల్ల మూసివేశారు. మధ్యాహ్నం వరకు క్యూలైన్లలో ఉన్న భక్తులందరినీ త్వరగా ఆలయంలోనికి అనుమతించి వెంకన్న దర్శనం చేయించారు. శనివారం సాయంత్రం నుండి వెలుపల క్యూలైన్లలో ఎవరినీ అనుమతించలేదు. ఆదివారం మధ్యాహ్నం 3.30గంటలకు బంగారువాకిలి తలుపులు, వెండివాకిలి, మహద్వారం తలుపులను మూసివేసి అర్చకులు వరుసగా తాళాలు వేశారు. ఆదివారం సాయంత్రం 3.30గంటలకు మూతబడిన తలుపులు తిరిగి నేటి వేకువజామున 3గంటలకు తెరిచేలా చర్యలు తీసుకుంటారు. ఈ సందర్భంగా ఆలయంలో పూర్తిగా అన్ని దర్శనాలను ముందుగానే రద్దుచేశారు. ప్రతిరోజులాగే సోమవారం వేకువజామున 3గంటలకు ఆలయశుద్ధి, పుణ్యాహవచనం నిర్వహించిన అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామికి సుప్రభాతం, తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు. కాగావేకువజామున 2గంటలకు భక్తులను వైకుంఠమ్ క్యూలైన్లలోనికి అనుమతించనున్నారు. ఆ తరువాత ఉదయం 6గంటల నుండి భక్తులకు స్వామివారి దర్శనం పునఃప్రారంభంకానుంది. గ్రహణం కారణంగా ఆదివారం 12గంటలు పాటు తిరుమలేశుని ఆలయాన్ని మూసివేయడం పరిపాటి. ఆలయ తలుపులు మూసివేసిన కార్యక్రమాన్ని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పర్యవేక్షించారు.గ్రహణం ప్రభావంతో వైకుంఠమ్ క్యూ కాంప్లెక్స్‌లను మధ్యాహ్నం 12గంటలకే మూసివేశారు. అన్నప్రసాద భవనాన్ని మూసి వేయడంతో వెలుపల ఉన్నభక్తులకు 50వేల పులిహోరప్యాకెట్లను సిద్ధంచేసి సాయంత్రం అందించారు. 3గంటల వరకు 27,525 మంది భక్తులకు శ్రీవారిదర్శనం కల్పించారు. ఆలయంలోపల ఉపఆలయాలు,లడ్డూ వితరణశాలను మూసివేశారు. **తిరుచానూరు అమ్మవారి ఆలయం మూత:** చంద్రగ్రహణం కారణంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయాన్ని ఆలయ అధికారులు, అర్చకులు మూసివేశారు. మధ్యాహ్నం 2.15గంటలకే ఆలయ తలుపులు మూసివేసి సోమవారం ఉదయం 4గంటలకు తెరుస్తారు. ఉదయం 8గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్ తెలిపారు. అలాగే టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం, అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీనివాసమంగాపురం కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయాల తలుపులను అధికారులు మూసివేశారు.

## బ్రహ్మోత్సవాల భద్రతకు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్‌లు, కమాండ్ కంట్రోల్ రూమ్‌లు

### అన్ని అత్యవసర విభాగాలతో సమన్వయంగా సేవలు: ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



**తిరుమల,సెప్టెంబరు 7ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు రెండు వారాల్లో మొదలు కానున్నాయని, అశేషంగా తరలివచ్చే భక్తుల భద్రతకు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు, కమాండ్ కంట్రోల్ రూమ్‌లు మరిన్ని ఏర్పాటు చేసుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. అన్ని అత్యవసర విభాగాలతో కలసి సమన్వయంగా ఆ తొమ్మిదిరోజులు అవసరమైనసేవలందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తుల భద్రత, రద్దీనియంత్రణ, అత్యవసర సమయంలో భక్తులను కాపాడటం, వైద్యసేవలందించేందుకు మార్గాలు వంటి అంశాలపై ఆదివారం పోలీసు భవనంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 24వతేదీ నుండి మొదలుకానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సంసిద్ధంకావాలన్నారు. గత సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీ నియంత్రణ, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, గరుడసేవరోజు అనుసరించిన వ్యూహంతో చిన్నపాటి పొరబాట్లు, అవాంఛనీయ ఘటనలు లేకుండా చూడగలిగారన్నారు. ఈ సారి అదే వ్యూహంతో మరింత పటిష్టంగా ప్రణాళికాబద్ధంగా పోలీసు అధికారులు సిబ్బంది పనిచేయాలన్నారు. సమన్వయంతో విధులు నిర్వహించి భక్తులకు మెరుగైన సేవలందించాలని ఎస్పీ సూచించారు. తిరుమలలో స్థానికులు నివాసముంటే బాలాజీ నగర్‌తోబాటు పాపవినాశనం ప్రాంతంలో తరచూ నాకాబందీ తరహాలో తనిఖీలు చేయాలన్నారు.

ట్యాక్సీ డ్రైవర్లు, జీపుడ్రైవర్లు భక్తులకు మర్యాదపూర్వక సేవలందించేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వారితో త్వరలోనే అవగాహన సదస్సు నిర్వహించాలన్నారు. తిరుమలలో భక్తులకు సేవాభావంతో సేవలందించాలని, అవసరమైన సమాచారం అందించేలా తర్ఫీదుఅవ్వాలన్నారు. కొండపై ఇన్నర్‌రింగురోడ్డు, ఔటర్‌రింగురోడ్డులపై బ్రహ్మోత్సవాల సమయంలో డ్రోన్‌తో నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ రద్దీ సమయంలో వాహనదారులకు సూచనలు చేయాలన్నారు. అవసరమైన మేరకు అదనపు ట్రాఫిక్ ప్రాంతాలు గుర్తించి సమస్య లేకుండా చూడాలని తిరుమల డిఎస్పీ విజయశేఖర్‌కు ఎస్పీ సూచించారు. ఆలయం పరిసరాల్లో పటిష్ట భద్రత, నిఘా ఉంచాలన్నారు. నేరాల నియంత్రణకు పాస్‌లైన్, డివైస్‌లైవ్, స్కానర్స్‌ను ఫింగర్‌ప్రింట్స్‌ను ఉపయోగించాలని ఆదేశించారు. ప్రతి సెక్టార్ సిసికెమెరాలతోబాటు ఈ సారి సోలార్ సిసి కెమెరాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు.

రద్దీ సమయాల్లో అత్యవసర సేవలకు రోప్‌పార్టీ సిబ్బంది సిద్ధంగా ఉండేలా చూడాలన్నారు. చిన్నపిల్లలు తప్పిపోకుండా వారికి జియోట్యాగింగ్ వేయాలన్నారు. టిటిడి విజిలెన్స్‌తో కలసి పోలీసులు సమన్వయంగా పనిచేసి విజయవంతం చేయాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి. రామకృష్ణ ,నాగభూషణం, డిఎస్పీ వెంకటనారాయణ, భక్తవత్సలం, శ్యామ్‌సుందర్, రామకృష్ణమాచారి, సిఐలు పాల్గొన్నారు.

## హిందూమత విధ్వంసానికి వైసిపి కుట్ర

### నందిగామ ఘటనపై బిజెపి నేతల మండిపాటు

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా నందిగామలో వినాయకుడి మందిరం సమీపంలో వైసీపీ నాయకులు ఇటీవల మాంసాహార భోజనాలు ఏర్పాటు చేయడంపై భాజపా నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా దమనకాండను ఖండిద్దామని పిలుపునిచ్చారు. ఈ మేరకు భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్,కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురంధేశ్వరి ఎక్స్‌లో స్పందించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రామతీర్థం,అంతర్వేదిలలో చోటు చేసుకున్న ఘటనలను ప్రస్తావించారు. పల్లెల్లోమత మార్పిళ్ళతో హైందవ మత ధ్వంస రచనను ప్రోత్సహించిన దుర్మార్గులు గణేశుడి మండపాల్లో మాంసాహారాన్ని పంపిణీ చేసిన సనాతన వ్యతిరేకులు అంటూ వైసీపీ నేతల పనితీరునే ఖండించారు.హిందువుల మనోభావాలు దెబ్బతీసిన నందిగామ ఘటనకు భాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసకోవాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని అనకాపల్లి ఎంపీ సిఎం రమేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. గణపతి మండపం పరిసరాల్లో మాంసాహార భోజనం వడ్డించి హిందువుల మనోభావాలను వైకాపా దెబ్బతీసింది.ఇవన్నీ హిందూ సాంప్రతాయాలు, ఆచారాలు, విశ్వాలసాలపై వైకాపా చేస్తున్న నిరంతర దాడులకు నిదర్శనం అని ధ్వజమెత్తారునందిగామలో హిందువుల మనోభావాలను దెబ్బతీసి వైకాపా చర్య దారుణమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఎక్స్‌లో పేర్కొన్నారు. రామతీర్థంలో శ్రీరామ విగ్రహ ధ్వసం అంతర్వేదిలో రథ దహనం,వినాయక చవితి ఉత్సవాలపై ఆంక్షలు వైకాపా హిందూ వ్యతిరేక ధోరణికి నిదర్శనాలన్నారు. నందిగామ ఘటనకు భాధ్యతలైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి పునరావృతం కారుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.ఎన్టీఆర్ జిల్లా నందిగామలో వినాయకుడి పందిరి సమీపంలో వైకాపా నాయకులు మాంసాహార భోజనాలు ఏర్పాటు చేయడం హిందువుల మనోభావాలన్ని దెబ్బ తీయడమేనని మంత్రి నారా లోకేష్ మండిపడ్డారు. ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. జగన్ హిందూ వ్యతిరేకి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మత సామరస్యాన్ని,మన సంస్కృతి,సాంప్రదాయాల్ని అవమానించే ఇలాంటి చర్యల్ని సహించబోమని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## ఎపిలో సంవిత్ పాఠశాల ప్రారంభించండి

### నిర్మలానందనాథ స్వామిని కోరిన మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** కర్ణాటక రాష్ట్రం మండ్య జిల్లాలో మంత్రి నారా లోకేశ్ పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠాన్ని ఆయన సందర్శించారు. క్షేత్రంలోని శ్రీకాల భైరవస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహకులతో మాట్లాడి మఠం ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. ఈ క్షేత్రానికి 1,800 ఏళ్ల చరిత్ర ఉందని తెలిపారు. ఈ మేరకు మఠం 72వ పీఠాధిపతి జగద్గురు నిర్మలానందనాథ స్వామి ఆశీర్వాదం పొందినట్లు లోకేశ్ స్పష్టం చేశారు. మఠం ఆధ్వర్యంలో పాఠశాలలు, మెడికల్ కాలేజీ, ఆసుపత్రి, యూనివర్సిటీలను నిర్వహించడం గొప్ప విషయమని మంత్రి లోకేశ్ కితాబిచ్చారు. పాఠశాలల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. పేద విద్యార్థులకు ఎలాంటి ఖర్చు లేకుండా 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ అన్ని వసతులతో కూడిన విద్యను అందిస్తున్నట్లు మఠం నిర్వాహకులు ఆయనకు చెప్పుకొచ్చారు. ఇంటర్ పూర్తయిన తరువాత ఏ రాష్ట్రంలో డిగ్రీ చదవాలనుకున్నా మఠం ఆర్థిక సహాయం అందిస్తుందని వారు వివరించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోనూ పేద విద్యార్థులకు ఉపయోగపడేలా సంవిత్ పాఠశాల ప్రారంభించాలని కోరినట్లు లోకేశ్ తెలిపారు. తన వినతికి పీఠాధిపతి జగద్గురు నిర్మలానందనాథ స్వామి అంగీకారం తెలిపినట్లు లోకేశ్ వెల్లడించారు.



నిర్మలానందనాథ స్వామి ఆశీర్వాదం అందుకుంటున్న నారా లోకేష్

## సాంస్కృతిక వికాసంపై నిరంతర దృష్టి అవసరం

### రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగిన విజయవాడ ఉత్సవ్ కార్యక్రమం

### ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య



విజయవాడ ఉత్సవ్ వేదికపై నుంచి ప్రసంగిస్తున్న సౌమ్య

**విజయవాడ, సెప్టెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి మనిషి తన వారసత్వ మూలాలు, జీవన పరిణామ క్రమం,సాంస్కృతిక వికాసంపై నిరంతరం దృష్టి పెట్టాలని శాసనసభలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు.మన గురించిన అవగాహన సామాజిక ఎదుగుదలకు దోహదం చేస్తుందన్నారు విజయవాడలోని పోరంకి మురళి రిసార్ట్స్‌లో ఆదివారం నాడు నిర్వహించిన విజయవాడ ఉత్సవ్ కార్యక్రమం రాజకీయ,సామాజిక ప్రముఖుల సమక్షంలో అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య,ఉమ్మడి కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్.ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురాం.విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), జిల్లా శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు,శ్రీ రాం తాతయ్య తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విజయవాడ ఉత్సవ్ కార్యక్రమం స్థానిక సంస్కృతి, సాంప్రదాయాలను ప్రదర్శించడంతో పాటు, ప్రజలను ఒకచోట చేర్చి సామాజిక సామరస్యాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానిక కళాకారుల ప్రదర్శనలు, సాహిత్య చర్చలు మరియు వివిధ సామాజిక కార్యకలాపాలు జరిగాయి. తంగిరాల సౌమ్య గారు తమ ప్రసంగంలో విజయవాడ యొక్క సాంస్కృతిక వైవిధ్యాన్ని కొనియాడారు.విజయవాడ ఎప్పుడూ సాంస్కృతిక, రాజకీయ కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఇటువంటి ఉత్సవాలు మన సంప్రదాయాలను రక్షించడంతో పాటు, యువతకు మన సంస్కృతిని పరిచయం చేసే అవకాశం కల్పిస్తాయిఅని ఆమె అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను కూడా తంగిరాల సౌమ్య గారు ప్రస్తావించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ప్రముఖ వ్యాపారవేత్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. పోరంకి మురళి రిసార్ట్స్‌లోని అందమైన వాతావరణం, ఉత్సవ నిర్వహణలో చూపిన శ్రద్ధ కార్యక్రమానికి మరింత వన్నె తెచ్చాయి.ఈ ఉత్సవం విజయవాడ నగరం యొక్క సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శించడంతో పాటు, రాజకీయ నాయకులు,ప్రజల మధ్య సమన్వయాన్ని పెంపొందించే వేదికగా నిలిచింది.

## ఉచిత బస్సుతో మహిళల సంతోషం

### కూటమి ప్రభుత్వం వచ్చిన 14 నెలల్లోనే 90 శాతం హామీలు నెరవేర్చాం: టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వెల్లడి

**అనంతపురం, సెప్టెంబరు 7 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫ్రీ బస్సు పథకాన్ని అమలు చేసిన తర్వాత మహిళా మణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే 90శాతం హామీలు నెరవేర్చామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. కడపలో జరిగిన మహానాడుకు మించి అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సభ సూపర్‌హిట్ అవుతుందని ఆయన వెల్లడించారు. ఈ నెల 10వ తేదిన అనంతపుఉరంలో జరిగే సూపర్ సిక్స్ విజయోత్సవ సభను పురస్కరించుకుని జిఎంఆర్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న సభకు సంబంధించి ఏర్పాట్లను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఇతర ఎమ్మెల్యేలు, ఎంపిలతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకట ప్రసాద్, ఎంఎస్.రాజు, బండారు శ్రావణిశ్రీ, కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, గుంటూరు మేయర్ కోవెల మూడి రవీంద్ర, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, సత్యసాయి జిల్లా అధ్యక్షులు అంజినప్ప, ఏడిసిసి బ్యాంకు అధ్యక్షులు ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి జిల్లా నేతలు నరసానాయుడు, రామలింగారెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి, టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. టిడిపి, బిజెపి, జనసేనలు కలిసి కట్టుగా ఎన్నికలకు ముందు ప్రచారం చేశామని, ప్రజలకు నిర్దిష్టమైన హామీలు ఇచ్చామన్నారు. అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోపే 100 శాతం హామీలు నెరవేర్చడం అన్నది గతంలో ఎప్పుడు చూడలేదన్నారు. ముఖ్యంగా తల్లికి వందనం, ఆర్టీసి బస్సుల్లో ఉచితప్రయాణంపై ప్రతి మహిళ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. అందుకే అనంతపురం భారీ బహిరంగ సభ ద్వారా ప్రజలకు తాము ఇచ్చిన హామీలు ఏ విధంగా అమలు చేశామన్నది చెప్పబోతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, మంత్రి నారాలోకేష్‌తోపాటు రాష్ట్రం లోని అందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, కూటమి పార్టీ నాయకు లందరూ హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రతి ఇంటా సంతోషం కనిపిస్తోందని, ప్రజలు కూడా స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



అనంతపురంలో బహిరంగ సభ జరిగే ప్రాంతంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యేలు ఇతర నాయకులు

**WARORA-KURNOOL TRANSMISSION LIMITED**
Warangal New S/s, Zaffergadh Mandal, Jangaon, Telangana- 506 252.
(Tel: +911204247182), CIN: U40300GJ2015PLC156122
**NOTICE INVITING TENDER**
Warora-Kurnool Transmission Limited invites bids against enquiry no. **MDF/OPGW/25-26/0925** for the following package: **"Appointment of an agent to monetize dark fiber in the Optical Ground Wire infrastructure under a unified initiative"**
The bid documents including pre-bid meeting details, Addendum/ Corrigendum (if any) will be made available to interested bidders via e-mail- tenders@zrc-in.com. The last date for submission of queries via the above-mentioned e-mail is 12.09.2025, 11.00 Hrs. The due date for submission is 30.09.2025, 11.00 Hrs.

వార్త

జన్మనిచ్చిన తల్లిదండ్రులను పూజనీయులుగా చూడలేనివారు దైవారాధన చేయడం శుద్ధ దండగ.

-సెక్కర్

# ఆశలు అడియాసలాయెనే!

'అనుకున్నదొకటి, అయినదొకటి కాగా శ్వేత సౌదాధిపతి డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు తల పట్టుకుని కూర్చున్నారు. అగ్రదేశాల మధ్య ఆవేశకావేశాలు చల్లారుతున్నాయనుకున్న తరుణంలో ట్రంప్ వారితో సఖ్యతకోసం తాపత్రయపడకుండా మరోసారి సాటి అగ్రదేశాలతో గిల్లికజ్జాలకే ప్రయత్నిస్తుండటం విశేషం. పదేపదే మూడు యుద్ధాలను ఆపానని గొప్పగా చెప్పుకునే ట్రంప్ భారత్, రష్యాలపై అదనపు సుంకాలంటూ అదలించినా బెదిరించినా ఏదేశాధినేతా కాస్తయిన జంకలేదు. గతంలో ఏడు యుద్ధాలను ఆపినట్లు చెప్పిన నోటితోటే ఆయన మాట మార్చి అంకె తగ్గించి మూడుకు సరిపెట్టుకున్నారు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం రాజీ కుదిరితే మాత్రం నాలుగు అనేవారే. వైట్‌హౌస్‌లో జరిగిన టాప్ టెక్ కంపెనీల సిఇఒల విందు సమావేశంలో ఆయన మాటలు విడ్డూరంగా తోచాయి. పరిష్కరించలేరని ఎంతో మంది అన్నా తాను పరిష్కరించగలిగానని గొప్పగా చెప్పుకున్నారు. ఈ మధ్య ఆయన మాటలు వింటుంటే అగ్రరాజ్యాధిపతి మాట్లాడాల్సిన మాటలేనా? ఇవి అన్నధోరణి వినిపిస్తోంది. ఇదోరకం వాచాలత. రష్యాతో భారత్‌మైత్రిని 'కటీఫ్' చేస్తే ఉక్రెయిన్ యుద్ధం ఆగుతుందని నమ్మకం కాలబోలు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమయ్యాక పుతిన్‌ను బెదిరించి లాభం లేదనుకున్నారో ఏమో! ఆ విషయాన్ని తేలికగా చెప్పేసారు. ఏ మాత్రం లౌక్యం లేకుండా ట్రంప్ చెప్పడాన్ని చూస్తే ఆశ్చర్యమేస్తుంది. భారత్ ఎలానూ లొంగేట్టు లేదు. అయినా ఓ ప్రయత్నం చేశారు. అధిక సుంకాలు వడ్డిస్తానని హెచ్చరించారు. కానీ భారత్ దిగి రాలేదు. తాజాగా చైనాకు కూడా వల విసిరారు. బెదిరించారు. చైనా వాణిజ్యాన్ని దెబ్బకొట్టేందుకు చేయగలిగినదంతా చేశారు. అమెరికాకు చెందిన యాపిల్, గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్ సిఇఒలతో సమావేశమై ఇతర దేశాల్లో పెట్టుబడులు పెట్టడం ఆపాలని కోరారు. 'విదేశాల్లో పెట్టుబడులు పెట్టడం ఇక చాలు. స్వదేశానికి వచ్చేయండంటూ' ఆయా కంపెనీలు అమెరికాలో పెట్టే పెట్టుబడుల సమాచారాన్ని పెట్టుబడి పెట్టగల సామర్థ్యాన్ని తెలుసుకుని మరీ సంతృప్తి పడ్డారు. ఇతర దేశాల్లో పెట్టుబడులు కుదరదంటూ వారి ప్రయత్నాలను భగ్నం చేశారు. ఇంత జరిగినా భారత్,రష్యాలు చైనా చెంతకే చేరాయని ట్రంప్ ఇట్లే గ్రహించారు. తన వ్యూహానికి దేశాలు పడలేదని అర్థం చేసుకోడానికి ఎంతో కాలం పట్టలేదు. భారత్, రష్యాలను చైనాకి దగ్గర చేసేందుకు ఉపయోగపడిన తన వ్యూహాత్మక తప్పిదాన్ని గుర్తుకు తెచ్చుకుని బాధపడ్డారు. ఈ విషయాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్' ద్వారా వెల్లడించారు. ఇటీవల టియాంజిన్‌లో షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్రమోడీ,రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు భేటీకావడం ట్రంప్‌కు అసలు నచ్చినట్లు లేదు. ట్రంప్ ప్రభుత్వం ఆగ్రహంతో ఉంది. అదే విషయాన్ని ట్రంప్ తన అక్కసును సొంత వేదిక ద్వారా బయట పెట్టారు.ఆయా దేశాలకు తామెంతో సేవ చేసినట్లు స్నేహహస్తమందించినట్లు చెప్పుకుంటూ ఆందోళన వెలిబుచ్చారు. చైనా విజయం కోసం పెద్ద సంఖ్యలో అమెరికన్లు మరణించారని, వారి పరాక్రమాన్ని, త్యాగాలను గుర్తుచుకోవాల్సిన అగత్యం చైనాకు ఉందని గుర్తుచేయడాన్ని బట్టి చైనా భారత్ రష్యాలతో కలిసి సాగడం ఇష్టంలేదన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. అమెరికాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నందుకు పుతిన్, జిన్‌పింగ్‌కు శుభాకాంక్షలు తెలియచేస్తున్నట్లు ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. మోడీ, జిన్‌పింగ్, పుతిన్‌లు కలిసి ఉన్న ఫొటోను షేర్ చేస్తూ చేసిన వ్యంగ్యప్రస్తావనను బట్టి ట్రంప్ తన పాచిక పారలేదని ఆందోళన పడుతున్నట్లుంది. ఇదిలా ఉండగా ఆది నుంచి రష్యాచమురు కొనుగోలుపైభారత్‌ను పదేపదే హెచ్చరించిన అమెరికా పాలకులు తమ పట్టు వదిలి కిందకు రాలేదు. యుద్ధావేశాలు మరింతగా పెరిగాయి.తప్పితే ఏమాత్రం ఎవరూ దిగివచ్చే పరిస్థితి లేదు. వారి మధ్య ఎవరూ ఒడంబడికలు ప్రతిపాదించే స్థాయిలో లేరు. తీరా ట్రంప్ వ్యాఖ్యలు వింటేనే ఏ దేశమూ అంగీకరించేందుకు సిద్ధంగా లేదు.ట్రంప్ వందిమాగధులు కూడా సాటి అగ్రదేశాల పట్ల ముఖ్యంగా భారత్, రష్యాల పట్ల ఏ మాత్రం గౌరవప్రదంగా ప్రవర్తించే తీరులో లేరు. భారత్ పాలకులు వాషింగ్టన్‌ను ఎక్కువకాలం ధిక్కరించలేరని అమెరికా వాణిజ్యమంత్రి హవార్డ్ బట్నిక్ అంటున్నారు. కెనడా దేశం గతంలో అమెరికాతో గొడవపడి టారిఫ్‌లను ఎదుర్కొన్నా దిగిరాక తప్పలేదని అదే తరహాలో భారత్ తనవైఖరిని మార్చుకొనక తప్పదన్నారు.అంతే కాదు కేవలం ఒకటి, రెండు నెలల్లో భారత్ అమెరికాతో రాజీకి వస్తుందని, వారు క్షమాపణలు కోరతారన్న ఆశాభావంతో ఉన్నారు. 50శాతం సుంకాల నుంచితప్పించుకోడానికి భారత్‌కు ఒక అవకాశమిస్తున్నామంటూ అహంకారపూరితంగా అమెరికా పాలకులు గేలిచేస్తున్నారు. అగ్రదేశాలతో అమెరికా సంబంధాలను తన అహంభావానికి బలిపెడ్తూనే మరోపక్క మౌంట్ రష్మోర్‌లో అమెరికా జాతి నిర్మాణంలో దిగ్గజాలైన మాజీ అధ్యక్షులు జార్జ్‌వాషింగ్టన్, థామస్ జెఫర్సన్,థియోడర్ రూజ్‌వెల్ట్, అబ్రహాంలింకన్‌ల సరసన తన శిల్పంకూడా ఉండాలన్న ట్రంప్ ఆకాంక్షలకు చోటులభించే అవకాశం కనపడటం లేదు. ఆ పర్వతంపై మరో ముఖాన్ని చెక్కడం ఆచరణ సాధ్యంకాదని శిల్పులు తేల్చేశారు.ఆసియా దేశాలతో అమెరికన్‌ల ఆశలు, ఆకాంక్షలు తీర్చుకోవాలంటే ట్రంప్‌వైఖరిలో మార్పు అత్యవసరం.

జ్ఞానం వంశపారంపర్య హక్కు కాదు, ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవల్సిందే.



స్వామి వివేకానంద

మీరు చేయబోయే పని ఆధారంగా పేరు ప్రఖ్యాతులు పొందలేరు. చేసిన పని ద్వారా మాత్రమే.



హెన్రీఫోర్డ్

## ప్రజావాక్కు



### ఉన్నత వర్గాల వారికే ఉద్యోగాలా..

నిజానికి మ్యాథమెటిక్స్ ఎప్పుడూ ఇంగ్లీష్ మీడియంలోనే ఉన్నది. మాతృభాషలో అర్థం అవడానికి వీలుగా కొన్ని పదాలను కలుపుతూ ఉంటారు. ఇంగ్లీష్ టీచర్లు కూడా లెసన్స్ ఇంగ్లీష్ టు ఇంగ్లీష్‌లో చెప్పకుండా మాతృభాషలో ట్రెడిషనల్ టీచింగ్ ట్రాన్స్‌లేషన్ మెథడ్‌లోనే విద్యార్థినీ విద్యార్థులకు చేరువ కావడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ప్లస్,మైనస్,ఈజీ ఈక్వల్ టు,ఎస్క్వేర్, బి స్క్వేర్ మొదలగు పదాల్ని తెలుగులో ఎవరూ చెప్పలేరు.అవి ఇంగ్లీషులోనే చెబుతారు. ఫిజిక్స్ కూడా తెలుగు పదాలతో చెప్పలేరు సాధ్యమైనంతవరకు ఇంగ్లీష్‌పదాలతో ఇంగ్లీష్ మీడియంలోనే చెబుతారు. నవోదయ, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో మ్యాథమెటిక్స్ సైన్స్ ఇంగ్లీష్ మీడియంలో చెబుతూ సోషల్ స్టడీస్ మాతృభాషలో చెబుతారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ఖచ్చితంగా ఇంగ్లీష్ మీడియంలోనే ఉండాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### పెరుగుతున్న పబ్లిక్ న్యూసెన్స్‌లు

పండుగ రోజుల్లో దీపావళి టపాసుల వినియోగం నానాటికి పెరిగిపోతూ ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి కూడా ముప్పుగా తయారైంది. ఊరేగింపులకూ, శుభకార్యాలకు,అశుభ కార్యాలకుసైతం సాంప్రదాయక వాయిద్యాల స్థానంలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో భారీ శబ్దాలతో టపాసులు, బాంబులు పేలుస్తుంటే వాటి వలన వ్యాధిగ్రస్తులు, ముఖ్యంగా గుండె జబ్బులున్న వారికి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇప్పుడు కొందరి వలన మరొక కొత్త జాడ్యం మొదలైంది.

- టి. సాంబశివరావు, గుంటూరు

### స్వదేశీ ఉత్పత్తులను పెంచాలి

భారత్ నేడు అయిదు వేలకోట్ల డాలర్లవిలువ చేసే కంప్యూటర్లు, మొబైల్‌ఫోన్లు, టెలీకమ్యూనికేషన్ వ్యవస్థలను దిగుమతి చేసుకుంటోంది. ప్రతీఏడాది ఈ దిగుమతులలో 1శాతం వృద్ధిరేటు వుంటుందని పరిశ్రమ అంచనా వేస్తోంది. దీనికి బదులుగా మన దేశంలోనే ఎలక్ట్రానిక్స్ రంగంలోవిస్తారంగా పరిశోధనలను ప్రోత్సహించి కనీసం వచ్చే అయిదేళ్ల నాటికైనా ఈ ఎలక్ట్రానిక్స్ పరికరాలను స్వదేశంలోనే ఉత్పత్తి చేయగలిగే విధంగా ప్రభుత్వం తగిన ప్రణాళికలను అమలు చేయాలి.

--సి.హెచ్. ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### అభివృద్ధికి దూరం చేయడం తగదు

రాష్ట్రంలో ఏప్రభుత్వం అధికారంలోఉన్నా ప్రజలందరిని సమానంగా చూడమని రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, గ్రామపంచాయతీ అధికారులను హెచ్చరించాలి. పక్షపాత ధోరణితో గ్రామాల్లో రాజకీయ కక్ష్యలు,కార్పణ్యాలు ఎక్కువవుతున్నాయి. మనుషులంటే సరేసరి.ఆ రాజకీయ కక్ష్యలు,కార్పణ్యాలు గతప్రభుత్వం నాటిన చెట్లు, మొక్కలపై కూడా చూపిస్తున్నారు. గ్రామంలో ఎవరు ఎవరికి ఓటు వేసినా, వేయకపోయినా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తన,మన అనే భేదంలేకుండా మనకు ఓటు వేయమని వారిని ఏ ప్రభుత్వ పథకాలు ఇచ్చి వారిని ఆ ప్రభుత్వం పై మంచి అభిప్రాయం తీసుకురావాలని ఆలోచించాలి.

- పద్మపుత్ర మల్లికార్జున్, గద్వాల్ జిల్లా

### వృక్షో రక్షతి రక్షితః

శబ్ద,వాయుకాలుష్యంతో మానవుడు కకావికలం అవుతున్నాడు. ఇక పశుపక్ష్యాదుల సంగతి సరేసరి. ప్రకృతి అసమతుల్యత వైపుపయనిస్తూ ఆపదలతో విలయతాండవం చేస్తున్నా నరుడు మేలుకోలేదన్నవిషయం ఆందోళనకరం.ఇది ముమ్మాటికి మానవ తప్పిదం. మనం ఎంత భయంకర వాతావరణంలో ఉన్నామనేది ఏదో ఒకచోట పుడమి తల్లి కన్నెర్ర కారణంగా తుఫాన్, సునామి రక్కసి విరుచుకుపడడమే ఇందుకు నిదర్శనం. అటవి సంపద, చెరువులు,భూగర్భజలాలు, ఇంకుడు గుంతలను పరిక్షించుకోవాలి. అభివృద్ధినెపంతో ఇష్టానుసారంగా పరిసరాలకు హాని తలపెట్టేపనులు ఇకనుంచి అయినా మానుకోవాలి. ప్రపంచ దేశాలకే పెను సవాళ్లుగా ఎదురవుతున్న గ్లోబల్ వార్మింగ్‌కై సమష్టి కృషితో ప్రయత్నించాలి.

- కె.రామారావు , నల్గొండ

### వాహనాల లైటింగ్ తగ్గించాలి

ఒకప్పుడు స్వదేశీ అంబాసిడర్, మారుతి వంటి కార్లు,బస్సులు, ద్విచక్ర వాహనాల వంటి మోటారు వాహనాలు పరిమిత వేగంతో పయనించటమేగాక వాటి హెడ్‌లైట్లపై సగం నల్ల రంగు వేయడటమో నల్ల స్టిక్కర్లు అంటించట మో జరిగేది. ఫలితంగా కాంతి అన్ని వైపులా ప్రసరించ కుండా ఎదుటి వాహనాలు స్పష్టంగా కనిపించేవి. కనుక ఇకనైనా వాహన తయారీ కంపెనీలు ఎదుటి వాహనాల కు ఇబ్బంది లేని విధంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలి. దానిని వెంటనే అమలులో పెట్టాలి.

-డి. వెంకటరెడ్డి, ప.గోజిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# అక్షరజ్ఞానం అందరి హక్కు

**ఏ దేశమైనా స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే 80 అక్షరాస్యత కలిగి ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్షరాస్యత సాధనలో చిత్తశుద్ధిగా వ్యవ హరించాలి. నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేసి, ఫలితాలు రాబట్టాలి. నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి. అందరికీ విద్యచేరువ కావాలంటే ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయాలి. బాలికా విద్యను ప్రోత్స హించాలి. రాష్ట్రంలోని ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో నైతిక విలువల బోధనకు కేరళ తరహా వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేయాలి. సాంకేతికతను అందుపుచ్చుకొనేలాగా ఉపాధ్యాయులకు శిక్షణ అందించాలి. అక్షరాస్యత మరింతగా పురోగమించాలంటే మౌలిక వసతులను విస్తృతం చేయాలి. బాలిక విద్య విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలి. అక్షరంతోనే అభివృద్ధి, అక్షరజ్ఞానం అందరి హక్కు. సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి.**

డా. షేక్. జాన్ పాషా

నేటి బాలలే రేపటి పౌరులు. దేశ భవిష్యత్తు నిర్దేశకులూ వారే. జనాభాలో 27 శాతానికి పైగా ఉన్న 14 ఏళ్లలోపు బాలలకు విద్యాబుద్ధులు చెప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. విద్య హక్కు చట్టంతోపాటు సమగ్ర శిక్షఅభియాన్, బేటీ బచావో, బేటి పడావో, మధ్యాహ్న భోజనం, పీఎం శ్రీ స్కూల్స్ , ఖేలో ఇండియా విద్యా కేంద్రాలు, ప్రయాస్ యోజన, ఇ.ఎం.ఆర్.ఎస్ స్కూల్స్, నవోదయ పాఠశాలలు, ఇన్స్పైర్ మనక్ పోటీలు వంటి కార్యక్రమాలను అమలు చేస్తోంది. చదువులకు దూరంగా ప్రాథమిక స్థాయిలో ప్రతి వంద మంది విద్యార్థుల్లో 29మంది మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. వీరిలో ఎక్కువమంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే. ప్రపంచ సగటు అక్షరాస్యత 86.3 శాతం, భారత దేశంలో అది 74 శాతమేనని యునెస్కో నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా మహిళల్లో అక్షరాస్యత మనదేశంలో తీసికట్టుగా ఉంది. ప్రతి ఏడాది సెప్టెంబర్ 8వ తేదీని అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ. 1966వ సంవత్సరం నవంబర్ 17వ తేదీన యునెస్కో సభ్య దేశాల విద్యాశాఖ మంత్రుల మహాసభ అనంతరం 1967వ సంవత్సరం నుండి మానవ హక్కుల గురించి ప్రపంచానికి గుర్తు చేయడం, మరింత అక్షరాస్యత స్థిరమైన సమాజంవైపు అక్షరాస్యత ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి, అక్షరాస్యతను వ్యక్తులకు, సంఘాలకు అందించడం. ఇది పిల్లల విద్య పైననే కాకుండా వయోజన విద్య మీద కూడా కేంద్రీకరిస్తుందనే ముఖ్యోద్దేశంతో ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఈ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అందరికీ నాణ్యమైన, సమానమైన,సమ్మిళిత విద్యను అందించడానికి అక్షరాస్యత అభ్యాసాల ప్రాథమిక ప్రాముఖ్యతను పునరాలోచించడానికి యునెస్కో 1990 సంవత్సరాన్ని 'అక్షరాస్యత సంవత్సరం'గా ప్రకటించి, 2003-2012 దశాబ్దాన్ని 'అక్షరాస్యత దశాబ్దంగా' ప్రకటించింది.'లిటరసీ ఫర్ ఆల్, వాయిస్ ఆఫ్ ఆల్, లర్నింగ్ ఫర్ ఆల్' అనే అంశాల్ని ఈ దశాబ్ది లక్ష్యంగా నిర్దేశించింది. అక్షరాస్యత అనేది ఐక్యరాజ్యసమితి సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ కోసం ఐక్యరాజ్యసమితి 2030 ఎజెండాలో కీలకమైన అంశంగా పరిగణించబడింది. 7 సం.ల వయసు పైబడిన వారు ఏదో ఒక భాషలో చదవడం,రాయడం వస్తే వారిని అక్షరాస్యులుగా పరిగణిస్తారు. మహాత్మా జ్యోతిబా పూలే గారు చెప్పినట్లు 'మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒక్కటే' అని, నోబెల్ బహుమతి గ్రహీత,నిరంతరం అక్షరాస్యత గూర్చి మాట్లాడే మలాల యూసఫ్ జాయ్ చెప్పినట్లు'ఒక పుస్తకం, ఒక పెన్ను, ఒక పిల్ల(వాడు), ఒక ఉపాధ్యాయుడు ఈ ప్రపంచాన్ని మార్చగలరు' అంటే అక్షర జ్ఞానం కలిగిన ప్రతివ్యక్తికి సమాజాన్ని మార్చగలిగే శక్తిఉంటుందని అర్థమవుతుంది. అలాగే ప్రపంచ దేశాల అక్షరాస్యత రేటును గమనిస్తే 100 అక్షరాస్యత సాధించిన ఫిన్లాండ్, లగ్జంబర్గ్, నార్వే,ఉక్రేన్, ఉజ్బెకిస్తాన్, నార్త్ కొరియా దేశాలు అభివృద్ధి చెందిన దేశాలుగా, మెరుగైన జీవన ప్రమాణం కలిగిన దేశాలుగా మన గలుగుతున్నాయి. అదేవిధంగా మన భారతదేశ అక్షరాస్యత రేటును పరిశీలిస్తే 1951లో 18.3శాతం,2001లో64.8 శాతం, 2011లో 74 శాతంగా నమోదయ్యాయి. అత్యధిక అక్షరాస్యత సాధించిన రాష్ట్రాల్లో మిజోరాం (98.2)మొదటి స్థానం వహించగా లక్షదీప్, త్రిపుర, కేరళ, గోవాలుతర్వాత స్థానాల్లో ఉన్నాయి. 2025 సం.ఇటీవల ప్రకటించిన విధంగా అందరికీ విద్యను అందించి 98.2శాతం అక్షరాస్యతను సాధించిన మొదటి భారతీయ రాష్ట్రం మిజోరాం.




నిర్దేశించుకున్న లక్ష్యం 95 శాతం అయినప్పటికినీ లక్ష్యాన్ని ఛేదించి సంపూర్ణ అక్షరాస్యత దిశగా పయనిస్తుంది. ప్రతి దశాబ్దానికి 10 శాతం అక్షరాస్యత పెరుగుతూ 100 శాతం అక్షరాస్యతను 2030 నాటికి సాధించేలాగా కేంద్ర ప్రభుత్వ అంచనాలుంటున్నాయి. భారతదేశ వ్యాప్తంగా డిజిటల్ అక్షరాస్యత రేటు 38 కుటుంబాలకే పరిమితం కాగా, కేరళ రాష్ట్రం సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత సాధించడం పట్ల యావత్ భారతదేశం ఆ దిశగా అడుగులు వేయబోతుంది. ముఖ్యంగా కేరళ రాష్ట్రం 14 సంవత్సరాలు పైబడినవారిని డిజిటల్ అక్షరాస్యులుగా మార్చడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని దాదాపు 83 లక్షల కుటుంబాల్లోని 1.5 కోట్ల మంది ప్రజలను సర్వే చేసి, సర్వేలో 21.88 లక్షల మంది డిజిటల్ నిరక్షరాస్యులుగా గుర్తించారు. వారిలో 21.87 లక్షల మందికి డిజిటల్ శిక్షణ ఇచ్చి, శిక్షణ పొందిన వారిలో 99.98 శాతం మంది విజయవంతంగా పరీక్షలలో ఉత్తీర్ణులయ్యారు. 90 సంవత్సరాలు పైబడిన 15 వేల మందికి పైగా ఈ శిక్షణలో పాల్గొనడం హర్షించదగినగొప్పవిషయం. మనదేశంలో నిరక్షరాస్యులు 26శాతం మంది ఉన్నారు. ముఖ్యంగా పురుషుల కంటే మహిళల్లో నిరక్షరాస్యత, పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నది. ఈ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికై కేంద్ర ప్రభుత్వం 1988 సంవత్సరంలో జాతీయ అక్షరాస్యత మిషన్‌ను, 2009 సంవత్సరంలో ప్రత్యేకంగా మహిళ నిరక్షరాస్యత తగ్గించుటకై సాక్షర భారత్ (పఢ్ నా లిఖ్ నా అభియాన్) కార్యక్రమాన్ని, అంతేకాక 2022 సం.నుండి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిరక్షరాస్యులను,అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కేంద్రం 2027 లక్ష్యంగా'ఉల్లాస్' అనే కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఉంది. 'సబ్ కా వికాస్' ఇతివృత్తంతో కేంద్ర ఆర్థిక మంత్రి 2025-26 కేంద్ర బడ్జెట్ను ప్రవేశపెట్టారు. మొత్తం బడ్జెట్ 50,65,345 కోట్లు కాగా దీనిలో విద్యారంగానికి 1,28,650 కోట్లు (2.54 ) కేటాయించి విద్యారంగ అభివృద్ధికై గేమ్ చెంజర్‌గా ఈ బడ్జెట్ నిలిచిందిగా చెప్పవచ్చు.ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వ పెద్దలు ఎన్నికల మేనిఫెస్టోలో విద్యకు 15శాతం బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి,2023-24 మొత్తం బడ్జెట్ 2,90,396 కోట్ల రూపాయలుగా ఉంటే, దీనిలో విద్యారంగానికి కేవలం 6.7 శాతం మాత్రమే(19,093 కోట్ల రూపాయలు) కేటాయింపు జరిగింది. 2024-25 సం.పు మొత్తం బడ్జెట్ 2,91,159 కోట్ల రూపాయలుగా ఉంటే, దీనిలో విద్యారంగానికి కేవలం 7.31 శాతం (రూ.21,292 కోట్లు) మాత్రమే కేటాయింపు జరిగింది. ప్రస్తుత (2025-26) సంవత్సరపు మొత్తం బడ్జెట్లో (3,04,965 కోట్లు) విద్యారంగానికి 7.57 శాతం (23,108కోట్లు) మాత్రమే కేటాయించడం జరిగింది. 15 సంవత్సరాల వయస్సుపై పడిన నిరక్షరాస్యులైన వయోజనుల కొరకు న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం ద్వారాఉల్లాస్ అనే ప్రాయోజిత కార్యక్రమాన్ని రాష్ట్ర విద్యాశాఖ పర్యవేక్షణలో స్వచ్ఛంద సేవకుల సహకారంతో చేపట్టింది.రాష్ట్రంలోని మొత్తం అక్షరాస్యులు 206.97 లక్షలు. వీరిలో పురుష అక్షరాస్యులు 117.02లక్షలు,మహిళా అక్షరాస్యులు 89.05 లక్షలు అనగా ఇంకను 143.97 లక్షల జనాభా (33.46 ) నిరక్షరాస్యులుగానే ఉన్నారు.వీరిలో 12.45 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దుటకై ఇటీవల టాస్, అడల్ట్ ఎడ్యుకేషన్, మెప్మా విభాగాల సహకారంతో,ఎస్సీ ఈఆర్టీ ద్వారా పుస్తకాల రూపకల్పన చేయబడి మంచిర్యాల జిల్లాలోని ఒక గ్రామాన్ని పైలట్‌ప్రాజెక్టుగా ఎంపిక చేసి కార్యరూపం దాల్చబోతోంది.భారతదేశ సామాజిక,ఆర్థిక పురోగతికి అక్షరాస్యత కీలకంగా మారింది.ఏ దేశమైనా స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే 80 అక్షరాస్యత కలిగి ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్షరాస్యత సాధనలో చిత్తశుద్ధిగా వ్యవహరించాలి. నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేసి, ఫలితాలు రాబట్టాలి. నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి. అందరికీ విద్యచేరువ కావాలంటే ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయాలి. బాలికా విద్యను ప్రోత్సహించాలి. రాష్ట్రంలోని ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో నైతిక విలువల బోధనకు కేరళ తరహా వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేయాలి. సాంకేతికతను అందుపుచ్చుకొనేలాగా ఉపాధ్యాయులకు శిక్షణ అందించాలి. అక్షరాస్యత మరింతగా పురోగమించాలంటే మౌలిక వసతులను విస్తృతం చేయాలి. బాలిక విద్య విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలి. అక్షరంతోనే అభివృద్ధి, అక్షరజ్ఞానం అందరి హక్కు. సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి. •

# శాంతి చర్చలు హుళక్కేనా?

కనుమ ఎల్లారెడ్డి

రష్యా, ఉక్రెన్ యుద్ధం రోజు రోజుకు ఉధృతమవుతూనే ఉంది. శాంతి చర్చలు ఏమి ఫలవంతం కావడం లేదు. రెండు దేశాలు పట్టు వీడటం లేదు. ఈ దిశలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న కృషి ఒక కొలిక్కి రావడం లేదు. యుద్ధం ఆగాలి అనే అతని ఆశయం గొప్పది. అయితే రష్యా మాత్రం కీవ్ పై ఆధిపత్య ధోరణే ప్రదర్శిస్తోంది. తాజాగా ఉక్రైన్‌పై 598 డ్రోన్లతో, 31 క్షిపణులతో భీకర దాడి చేసింది. ఈ దాడిలో ఉక్రైన్ బీతిల్లింది. ఈ దాడిని చూసి ఉక్రైన్ తీవ్ర నిరసన తెలియచేసింది. శాంతి చర్చలకు రష్యా ఆటంకాలు కల్పిస్తోందని జెలెన్స్కి ఆరోపించారు. రష్యా చేసిన ఈ దాడిలో అందమైన భవనాలు కూలిపోయాయి ముఖ్యంగా ఉక్రైన్‌లోని పెద్ద నగరంఅంద విహీనంగా మారింది. మేము ఈ దాడిని చూస్తూ ఊరుకోలేదు. రష్యా డ్రోన్‌లను కూల్చివేశాం అని ఉక్రైన్ పేర్కొంది. రష్యాను దెబ్బ తీయాలనే జెలెన్ స్కి భావిస్తూ ఉన్నాడు. శాంతి చర్చల గడువు కూడా రష్యా అతిక్రమించింది. శాంతి ప్రయత్నాలు అన్నీ విఫలం అయ్యాయి అని ఉక్రైన్ పేర్కొంది. ఉక్రైన్ కూడా డ్రోన్లతో దాడి చేస్తోంది, అయితే ఉక్రైన్ దాడిని రష్యా ధీటుగా ఎదుర్కొంది. కాని ఉక్రైన్ మాత్రం రష్యా లోని క్రాస్ నోదార్ లోని అఫిప్స్కి చమురు శుద్ధి కేంద్రం పై డ్రోన్ దాడి చేసి నష్టం కలిగించిదని భోగట్టా. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్ సంక్షోభానికి పశ్చిమ దేశాలు, నాటో కూటమి పూర్తి బాధ్యతవహించాలని సంచలన ఆరోపణలు చేశారు. చైనాలోని తింజియన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో ప్రసంగిస్తూ ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చే ప్రయత్నాలే ప్రస్తుత యుద్ధానికి కారణమని ఆయన స్పష్టం చేశారు. పుతిన్ తన ప్రసంగంలో ఉక్రెయిన్ సంక్షోభం రష్యాఆక్రమణ వల్లకాదని, 2014లో పశ్చిమ దేశాల మద్దతుతో కీవ్‌లో జరిగిన మైదాన్ తిరుగుబాటు ఫలితమని పేర్కొన్నారు. ఈ తిరుగుబాటు రష్యా అనుకూల అధ్యక్షుడు విక్టర్ యాంకోవిచ్‌ను అధికారం నుంచి తొలగించి నాటో అనుకూల రాజకీయ నాయకత్వాన్ని స్థాపించడానికి దారితీసిందని ఆయన ఆరోపించారు. ఉక్రెయిన్‌ను నాటోలు చేర్చే పశ్చిమ దేశాల ప్రయత్నాలు రష్యా భద్రతకు సిద్ధంగా ముప్పు కలిగిస్తున్నాయని ఒకదేశం భద్రత కోసం మరొక దేశాన్ని బలిచేయడం సమర్థనీయం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. పుతిన్ ఉక్రెయిన్ సంక్షోభం పరిష్కారానికి చైనా, భారత్‌లు చేస్తున్న ప్రయత్నాలు అభినందించారు. అలాస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన సమావేశంలో ఏర్పడిన అవగాహనలు శాంతి మార్గాన్ని సుగమం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశ వివరాలను చైనా అధ్యక్షుడు షి జిన్ పింగ్‌తో సహా ఇతర నాయకులతో పంచుకున్నట్లు తెలిపారు. ఇలా ఈ దేశాలు యుద్ధలపైనే దృష్టి కేంద్రికరించాయి కాని దేశ సంక్షేమం, అభివృద్ధి పూర్తిగా విస్మరించాయి. వాస్తవంగా రెండు దేశాలలోని సైనికులు పూర్తి గా నిరసించి పోయారు. ఈ యుద్ధం 2022,ఫిబ్రవరి 24 న మొదలయింది. ఇంత వరకు ఫలితం శూన్యం. ఎవరిది పై చేయి అనేది అర్థం కాకుండా ఉంది. తరచి చూస్తే ఉక్రైన్‌కు భారీ నష్టం కలిగిందని అనుకోవచ్చు. వివిధ దేశాధినేతలు శాంతికి నడుం బిగించినా అవి ఫలించలేదు. శాంతి సంస్థ అయిన ఐక్యరాజ్య సమితి సైతం చేతులేత్తేసింది. దాని బాధ్యతను అగ్రరాజ్యం తీసుకున్నా దాని మాటలు రష్యా,ఉక్రైన్ దేశాలు అమలు పరచడం లేదు. శాంతి చర్చలు ఇలా ఫలితం ఇవ్వకుండా పోవడం అగ్రదేశాధినేత ప్రయత్నాలకు గండి పడటం శోచనీయం. భారత్‌ను సందర్శించాలని మోదీ, జెలెన్స్కిని కోరడం, భారత్ యుద్ధం ఆపుతుందని సాంకేతాలు విలు వడుచున్నాయి. ఉక్రైన్ ఊహించినట్లుగా భారత ప్రధాని మోదీ అటు రష్యా పక్షం కాదు, ఇటు ఉక్రైన్ పక్షం కాదు. యుద్ధం ఆగాలి అనే తపన మోదీకి ఉంది. అందుకే పలు మార్లు ఇది యుద్ధాలా యుగంకాదు అని చెప్పడం గమనార్హం. జెలెన్ స్కి, మోడీ మాటవింటే యుద్ధం ఆగుతుందేమో చూడాలి. ఏది ఏమైనా జెకెన్ స్కి భారత్‌కు వస్తే చర్చలు ఫలించవచ్చని కోరుకుందాం. ఉక్రైన్ అటు అగ్రదేశం మాటలు, ఇటు భారత్ మాటలు వింటే కొంత ప్రగతి కనపడుతుంది. లేకపోతే ఎన్ని శాంతి చర్చలు జరిగినా నిష్ప్రయోజనమే అవుతాయి. •

# వీధి వ్యాపారుల సమస్యలను పరిష్కరించేదెవరు?

డి జె మోహన రావు

భారతదేశ వీధులు కేవలం ప్రయాణ మార్గాలు మాత్రమే కాదు, అవి చిన్న వ్యాపారాలకు, ఆశలకు,కలలకు నిలయాలు. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న ఈ కాలంలో, వీధి వ్యాపారులు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారు. వీరు కేవలం జీవనోపాధి కోసం మాత్రమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థను నడిపించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. వీధులు, మార్కెట్లు, బస్‌స్టాప్‌లు, రైల్వే స్టేషన్ల వద్ద ఆహార పదార్థాలు,దుస్తులు, గృహోపకరణాలు, పండ్లు, కూరగాయలు, చేతివృత్తుల వస్తువులు వంటివి విక్రయిస్తూ వీరు సామాన్య ప్రజల దైనందిన అవసరాలను తీరుస్తున్నారు. వీరు దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక కీలక భాగం. దేశఆర్థిక వ్యవస్థకు అనేక విధాలుగాసహాయం చేస్తున్నారు. భారతదేశంలో అతిపెద్ద అసంఘటిత రంగాలలో లక్షలాది మందికి స్వయం ఉపాధి కల్పిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస వచ్చిన వారికి, నిరుద్యోగులకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారికి ఇది ఒక ప్రధాన ఉపాధి మార్గం. ఈ రంగం సుమారు1.5 కోట్లకు పైగా ప్రజలకు జీవనోపాధి కల్పిస్తున్నట్లు అంచనా. చిన్న మొత్తాల్లో తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నప్పటికీ, వారు ఆర్థిక వ్యవస్థకు భారీగా దోహదం చేస్తున్నారు.మొత్తం వార్షిక టర్నోవర్ వేల కోట్ల రూపాయలలో ఉంటుంది. వీరు అందించే తక్కువ ధరల వస్తువులు, సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటాయి.ఫలితంగా వినియోగం పెరుగుతుంది. ఇది ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పడుతుంది. వీరిలో ఎక్కువ మంది మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు ఉన్నారు. వీరు తమ వ్యాపారాల ద్వారా స్వతంత్రంగా జీవించగలుగుతున్నారు. దీనివల్ల సామాజిక సమానత్వం, ఆర్థిక సాధికారత సాధ్యమవుతుంది. వీధి వ్యాపారులు భారత జీడీపీకి ఎంత దోహదపడుతున్నారు అనేదానికి ఖచ్చితమైన గణాంకాలు లేనప్పటికీ అనేక అధ్యయనాలు దీనికి సంబంధించిన అంచనాలను తెలియజేస్తున్నాయి. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా అంచనా ప్రకారం, వీధి వ్యాపారులు దేశ జిడిపిలో 4 నుంచి 5 వరకుభాగస్వామ్యం వహిస్తున్నారు. ఈ గణాంకాలు ఈ రంగం ప్రాముఖ్యతను స్పష్టంగా చూపిస్తున్నాయి. అయితే వీరు తమ కార్యకలాపాలను నిర్వహించేటప్పుడు కొన్ని కఠినమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వీధి వ్యాపారులకు చట్టపరమైన గుర్తింపు, భద్రత లేకపోవడం ప్రధాన సమస్య. పోలీసులు, మునిసిపల్ అధికారులు తరచుగా వారిని తొలగిస్తుంటారు. వారు



ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వారి సామాగ్రిని జప్తు చేయడం, జరిమానాలు విధించడం వంటి చర్యలు తీసుకుంటారు. ఇది వారి జీవనోపాధిపై తీవ్రప్రభావం చూపుతుంది. వీధి వ్యాపారులకు వ్యాపారం కోసం నిధులు అవసరం. అయితే వారికి అవసరమైన రుణాలు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి లభించవు. దీంతో వారు అధిక వడ్డీకి అప్పులు తీసుకోవాల్సి వస్తుంది. ఇదివారిని ఆర్థికంగా మరింత బలహీనపరుస్తుంది. వీరికి నీటి సౌకర్యం, టాయిలెట్లు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు చాలా చోట్ల అందుబాటులో లేవు. ముఖ్యంగా మహిళా వ్యాపారులకు ఇది పెద్ద సమస్య. ఇది వారి ఆరోగ్యానికి, భద్రతకుముప్పు కలిగిస్తుంది. సమాజంలో వీధి వ్యాపారులను తక్కువగా చూడడం అనేది ఒక ప్రధాన సామాజిక సమస్య. ఈ కారణంగా వారు అనేక అవమానాలను ఎదుర్కోవలసి వస్తుంది. రాజకీయ, సామాజిక ఒత్తిళ్ల వారి వ్యాపారానికి ఆటంకం కలిగిస్తుంటాయి. సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని చర్యలు తీసుకుంటున్నాయి. దీనిలో ప్రధానమైనది వీధి వ్యాపారుల (జీవనోపాధి పరిరక్షణ, వీధి వ్యాపారం నియంత్రణ) చట్టం2014. ఈ చట్టం వీధి వ్యాపారులకు చట్టబద్ధమైన గుర్తింపు, రక్షణ కల్పిస్తుంది. ఈ చట్టం కొన్ని ముఖ్యమైన ప్రణాళికలను అమలు చేస్తుంది. ఈ చట్టం ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వాలు వీధి వ్యాపారులకు సర్వే చేసి, గుర్తింపు కార్డులు జారీ చేయాలి. ఈ కార్డుల వల్ల వారికి ఒక నిర్దిష్ట ప్రదేశంలో వ్యాపారం చేసుకునే హక్కు లభిస్తుంది. పట్టణాల్లో టౌన్ వెండింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలు వీధి వ్యాపారుల సమస్యలను పరిష్కరించడానికి, వారికి వ్యాపారం చేసుకోవడానికి అనువైన స్థలాలను కేటాయించడానికి కృషి చేస్తాయి. వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి పథకాన్ని అమలు చేస్తుంది. దీని కింద వీధి వ్యాపారులు బ్యాకుల నుండి ఎటువంటి పూచీకత్తు లేకుండానే రుణాలు లభిస్తాయి. వీధి వ్యాపారులు కేవలం వ్యాపారులు మాత్రమే కాదు, వారు మన సంస్కృతి, జీవన శైలిలో అంతర్భాగం. భారత ఆర్థిక వ్యవస్థకు వారి దోహదం గణనీయమైనది. అయితే, వారికి భద్రత, ఆర్థిక సహకారం,గౌరవం అందించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు, పథకాలు సరైన మార్గంలో సాగుతున్నాయి. అయితే వీటిని మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. రాష్ట్రప్రభుత్వాలు,స్థానిక సంస్థలు ఈ చట్టాలను, పథకాలను వీధివ్యాపారులకు చేరువయ్యేలా కృషి చేయాలి. ఈ రంగాన్ని సంఘటితం చేసి, వారికి మరింత తోడ్పాటును అందించగలిగితే, దేశ ఆర్థిక వ్యవస్థ మరింత వేగంగా, సమగ్రంగా వృద్ధి చెందుతుంది. దీనితో అట్టడుగు వర్గాల ప్రజల జీవితాలు మెరుగుపడతాయి. ఇది నిజమైన అభివృద్ధికి దారి తీస్తుంది. •

# వైభవోపేతంగా లక్ష్మీనరసింహుని పవిత్రోత్సవాలు





**సింగరాయకొండ, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

మండలంలో దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన పాత సింగరాయకొండ శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మూడో రోజు ఆదివారం పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్ల మూలవిరాట్లకు పూలతో ప్రత్యేక అలంకరణతో విశేష పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పంచామృత స్నాపనం నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణగా పవిత్ర సమర్పణ చేశారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

### నేడు ముగింపు కార్యక్రమాలు..


పవిత్రోత్సవాల చివరి రోజు భాగంగా ఉదయం ఉక్త హోమం, పరమాత్మికహోమం, స్నాపనతిరుమంజనం, నీరాజనం నిర్వహించనున్నారు. సాయంత్రం మహాపూర్ణాహుతి, యాత్రాదానం, సద్మా ప్రదక్షిణం, బింబవాహనం, నివేదన, అక్షితారోపణం, ఆశీర్వచనంతో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి.

### భక్తులకు దర్శనం నిలిపివేత..

చంద్రగ్రహణం కారణంగా ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం నుండి సోమవారం ఉదయం వరకు మూసివేస్తారు. అనంతరం సంప్రోక్షణ అనంతరం యథావిధిగా భక్తులకు దర్శనం కల్పిస్తారని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అర్చకులు ఉదయగిరి వెంకటశేషలక్ష్మీ నరసింహస్వామి, విక్కిరాల లక్ష్మీనరసింహాచార్యులు, ఉదయగిరిసుదర్శనాచార్యులు, ఆలయఅధికారులు, భక్తులుపాల్గొన్నారు. చంద్రగ్రహణం కారణంగా ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం నుండి సోమవారం ఉదయం వరకు మూసివేస్తారు. అనంతరం సంప్రోక్షణ జరిగాక యథావిధిగా భక్తులకు దర్శనాన్ని కల్పిస్తారని అర్చకులు తెలిపారు.

# రెండేళ్ల చిన్నారిపై వీధి కుక్కల దాడి..

## - అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



**హనుమంతునిపాడు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

మండల పరిధిలో వీధి కుక్కల స్వైర విహారం భయాందోళనలు కలిగిస్తోంది. ఎక్కడపడితే అక్కడ ప్రజలపై దాడులు చేయడమే కాకుండా చిన్నారుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తోంది. తాజాగా దాసరిపల్లి గ్రామంలో జరిగిన ఘటన ఆందోళన కలిగిస్తోంది. గత నెల 16న గ్రామానికి చెందిన రెండేళ్ల చిన్నారి ఉస్తేల చిన్నమ్మిపై వీధి కుక్కలు విచక్షణారహితంగా దాడి చేశాయి. చిన్నారి మొహంపై తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఒంగోలు సంఘమిత్ర ఆసుపత్రికి తరలించి, ఒకటిన్నర లక్ష రూపాయలు ఖర్చు చేసి శస్త్ర చికిత్స చేయించారు. ఈ ఘటన తర్వాత గ్రామ ప్రజలు వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని పంచాయతీ అధికారులకు వినతిపత్రం ఇచ్చినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 20 రోజులు గడిచినా పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో వీధి కుక్కల బెడదను నిర్మూలించకపోతే మరింత పెద్ద ప్రమాదాలు తప్పవు అని పలు గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# ప్రకాశం



తెలుగు వారి దినపత్రిక

వార్త

# గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య



**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలు ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం గురువారం తెలియని వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన చోటు చేసుకుంది. ఆర్టీసీ అధికారుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు. నిత్యం జనాలు తిరిగే ప్రాంతంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడంపై ప్రయాణికులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

# రెవెన్యూలో అవినీతి ఊడలు

- ప్రతి పనికి ఓ రేటు
- లంచం ఇస్తేనే దరఖాస్తులకు మోక్షం
- వీఆర్వోలు, సర్వేయర్లే కీలక పాత్ర
- వసూళ్లు చేసిన సొమ్ములో కింది నుంచి పై వరకు వాటాలు
- ప్రభుత్వాలు మారిన తీరు మారని రెవెన్యూ శాఖ
- ప్రక్షాళనకు దృష్టి సారించని పాలకులు

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రభుత్వాలు ఎన్ని వచ్చినా, పాలకులు ఎంత మంది మారినా రెవెన్యూ శాఖలో అవినీతికి మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. ఏ పని జరగాలన్నా ఆయా ఉద్యోగుల స్థాయిని సంబంధిత పనిని బట్టిలంచం డిమాండ్ చేయడం అనవాయితీగా మారింది. అవినీతి నిరోధకశాఖ దాడుల్లో పట్టుబడుతున్న కేసులు నమోదవుతున్న లంచాలు తీసుకోవడానికి మాత్రం వెనుకాడటం లేదు. ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి డబ్బులు దండుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తం మీద రెవెన్యూ శాఖ అవినీతి ఊడలు బలంగా నాటుకుపోయాయి. జిల్లాలోని అనేక మండల కార్యాలయాల్లో అవినీతి పెట్రేగిపోతుంది. గతంలో మద్దిపాడులో ఎమ్మార్వోగా పని చేసిన అధికారిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సంతనూతలపాడు మండలానికి చెందిన అధికారులు కూడా ఇష్టరీతిన అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ అధికారినే మరలా మద్దిపాడు మండలానికి బదిలీ చేయడం గమనార్హం. రెవెన్యూ శాఖలో అవినీతిపై జిల్లాలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఇదే చర్చనీయాంశమైంది. గత వైసీపీ ప్రభుత్వంలో మామూళ్లు కొంత మేర ఉండేవి. ప్రస్తుతం అది కూటమి పాలనలో అవినీతి రెండింతలుగా మారింది. పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ, భూ బదలాయింపు భూ రికార్డులు తప్పులు సవరణ, వారంతపు ఆస్తి బదలాయింపు(మ్యుటేషన్), వివిధ ధృవపత్రాలు జారీ ఇలా రెవెన్యూపరంగా ఏ పని చేయాలన్నా డబ్బులు ఇవ్వాల్సిందే. మ్యుటేషన్, పాస్ పుస్తకాలు జారీ కోసం ఎకరాకు రూ.10 నుంచి రూ.15వేలు వరకు తక్కువ కాకుండాడిమాండ్ చేస్తున్నారు. భూమి విలువ ఎంత ఎక్కువఉంటే లంచంరేటు అంత ఎక్కువ పెరుగుతుంది. వెబ్ల్యాండ్ లాగిన్‌కు తహసీల్దార్ల ఆదీనంలో ఉన్నప్పటికి క్షేత్రస్థాయిల్లో భూముల రికార్డుల్లో మార్పులు, చేర్పుల్లో వీఆర్వోలు, సర్వేయర్లే కీలక పాత్ర పోషిస్తూ సొమ్ము వసూళ్లు చేస్తుంటారు. భూముల విషయంలో తహసీల్దార్లకు అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ కోసం వీఆర్వోలు, సర్వేయర్లను పంపుతుంటారు. ఈ క్రమంలో ఆయా దరఖాస్తులతో వీఆర్వోలు, సర్వేయర్లు బేరాలు కుదుర్చుకుని పనులు చక్కబెడుతుంటారు. లంచంగా అందుకున్న సొమ్ములో కింది నుంచి పైస్థాయి వరకు హోదానుబట్టి వారికి ముట్టచెప్తుంటారు. భూములకు సంబంధించి రెండు వర్గాల మధ్య ఏర్పడిన వివాదాల్లో వీఆర్వోలు, సర్వేయర్లు జోక్యం చేసుకుంటారు. అవి ప్రభుత్వ భూములు అయితే వీరు తెరవెనుక ఉండి ఫిర్యాదులు చేయిస్తారు. అనంతరం అక్కడ వాలిపోయి ప్రభుత్వ భూమి అంటూ యాగి చేసి ఇరు వర్గాల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. జాతీయ రహదారి పక్కన ఉన్న మద్దిపాడు, టంగుటూరు, సింగరాయకొండ, కర్నూలు రోడ్డు పక్కన ఉన్న నూతలపాడు, చీమకుర్తి, పొదిలి తదితర మండలాలు ఉన్నాయి. ఇవి కాకుండా కనిగిరి, పామూరు, దర్శి, మార్కాపురం, గిద్దలూరు, కొండపి మండలాల్లో వివాదాలు ఎక్కువ ఉన్న ప్రభుత్వ భూముల విషయంలో వీఆర్వోలు, సర్వేయర్లు తల దూరుస్తున్నారు. ల్యాండ్ పూలింగ్ తరువాత ఆయా బినామి పేర్లకు కోట్ల రూపాయలు పరిహారం చెల్లించే విధంగా పావులు కదుపుతున్నారు. రెవెన్యూశాఖపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నప్పటికి ఉన్నతాధికారులు స్పందించకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తుంది.

# 9న 'అన్నదాతకు అండగా' కార్యక్రమం జయప్రదం చేయండి



**ఒంగోలు, ప్రభాతవార్త**

రాష్ట్రంలో యూరియా కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై ఈనెల 9న ఆర్డీఓ కు వినతిపత్రం అందజేత కార్యక్రమం జరుగుతుందని దీనిని జయప్రదం చేయాలని జిల్లా పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, సంతనూతలపాడు అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ మేరుగ నాగార్జున, ఒంగోలు అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ చుండూరి రవిలు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని స్థానికపార్టీ కార్యాలయం లో ఇందకు సంబంధించి వారు విలేకర్లసమావేశం నిర్వహించి మాట్లాడారు. తొలుత అన్నదాతకు అండగాపోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలో యూరియా కోసం, ఎరువుల కోసం రైతులు గత కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందని, ఆ సమస్యలను రైతులతో కలిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 9న రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీఓలకు వినతిపత్రాలిచ్చే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు సంక్షోభంలో ఉంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబుకుగానీ, వ్యవసాయ మంత్రిగా అచ్చెన్నాయుడుకు గానీ ఏ మాత్రం చీమకుట్టినట్లయినా లేదు. రైతులు క్యూలో నిలబడితే దాన్ని బఫే భోజనంతో పోల్చిన అచ్చెన్నాయుడు అసలు మంత్రి పదవిలో కొనసాగేందుకు అర్హుడేనా..? రైతులు ఇబ్బందులు ఉంటే ఆయనకు భోజనం గుర్తుకు రావడం దౌర్భాగ్యం. చేసిన తప్పిదాలకు లెంపలేసుకుని రైతులకు క్షమాపణలు చెప్పాల్సింది పోయి. కష్టాలు వారి పట్ల మానవత్వం చూపించాల్సింది పోయి. ఇంకా అవమానపరచడం దారుణం. రాష్ట్రానికి వచ్చిన ఎరువుల్లో అధిక భాగం ప్రైవేటుకు మళ్లించడం వల్లే ఈ సమస్య వచ్చిందని అచ్చెన్నాయుడే స్వయంగా చెప్పాడు. సహజంగా రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను 50 శాతం ప్రభుత్వం ఆధీనంలోని మార్క్‌ఫెడ్ కు 50 శాతం ప్రైవేటుకు కేటాయిస్తారు. ఈ ఎరువులను మార్కెడ్‌యార్డు ద్వారా పీఏసీఎస్‌లు, ఎఫ్‌పీఓల ద్వారా పంపిణీ చేస్తారు. ప్రైవేటుకు కేటాయించిన ఎరువులను ప్రైవేటు దుకాణాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తారు. పద్ధతి ప్రకారం ఇలా జరుగుతుంది. మరి అలా కాకుండా మార్క్‌ఫెడ్‌కు ఇవ్వాల్సిన 50 శాతం ఎరువులను తగ్గించి, ప్రైవేటుకు కేటాయించడం అత్యంత దుర్మార్గం అన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. యూరియా సహా ఎరువుల కొరత లేకుండా చూడాలి. రైతుల చెంతకే వాటిని చేర్చాలి. బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలి. ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. సహా పంటలకు గిట్టుబాటు ధర అందించాలి. ఉచిత పంటల భీమాను పునరుద్ధరించి అందరికి వర్తింపచేయాలి. వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల రైతులకు వెంటనే ఇన్‌ఫుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు కటారి శంకర్, రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వర్లు, బొట్ల సుబ్బారావు, నగరకంటి శ్రీనివాస్, బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, పాలడుగు రాజీవ్, బంగారు బాబు, దుంపాయలమందరెడ్డి, దుంపాచెంచిరెడ్డి, నాటారు జనార్ధన్‌రెడ్డి, మలిశెట్టి దేవా, వేముల శ్రీకాంత్, రొండా అంజిరెడ్డి, పోలవరపు శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అనర్ధదాయకం..

**ఒంగోలు, ప్రభాతవార్త**

సామాన్యులకు ఎంతో కొంత ఊరటగానున్న ఆరోగ్యశ్రీ పథక సేవలను రాష్ట్రంలో పది కొత్త వైద్యకళాశాలలను బీపీపీపీ పేరిటి ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించడం అనర్ధదాయకం. ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్ పథకాలను కలిసి హైబ్రిడ్ మోడ్‌లో యూనివర్సెల్ హెల్త్ పాలసీని రూపొందించాలని ప్రభుత్వం చెప్తున్నా ఆచరణలో అది జనాన్ని వైద్యఆరోగ్య సేవలకు దూరం చేయడమే అవుతుంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు భీమా కంపెనీ ద్వారా కుటుంబానికి ఏడాదికిరూ.2.5లక్షల వరకు ఆపైన ఖర్చు అయితే ట్రస్టు ద్వారా రూ.25లక్షల ద్వారా కవరేజ్ ఉంటుంద న్నది ప్రచారానికి భాగానే ఉంటుంది. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న కుటుంబాలకు ఏడాదికి రూ.2నుంచి రూ.5లక్షల వరకు భీమా కవరేజ్‌ను అందిస్తామని ఇదంత కలిపి యూనివర్సెల్ హెల్త్ కవరేజ్ అని సర్కారు నమ్మబలుకుతుంది. రాష్ట్ర విభజన అనంతరం 2015-16లో ఏపీఎల్ కుటుంబాలకు హెల్త్ కవరేజ్ అని ప్రచారం చేసి ప్రీమియం కట్టించుకున్నారే గాని ప్రజలకు లబ్ధిచేకూరిన దాఖలాలు లేవు. తాజా పథకం ద్వారా 3257 రకాల వైద్య సేవలు అందిస్తారని, ప్రతి రోగికి ఒక క్యూఆర్ కోడ్ ఇచ్చి అమల తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని అమాత్యుల మాట నీటిమీద రాతగానే మిగిలిపోవచ్చు. రాష్ట్రంలో పది కొత్త వైద్యకళాశాలలను పీపీపీ పేరిట ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయించగా తొలి దశలో మార్కాపురం, ఆధోని, మదనపల్లె, పులివెందుల కళాశాలలో అమలు చేయనున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే వైద్య కళాశాలలు నైపుణ్యానికి, నాణ్యతకు సామాజిక న్యాయానికి పెద్ద పీట వేస్తాయి. ప్రైవేటు యాజమాన్యాలు మెరిట్ పక్కన పెట్టి సంపన్నులకే సీట్లు ఇస్తాయి. కనుక పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారు. వ్యాపార దృక్పధం ముందుకు వచ్చి పేదలకు అందుబాటులో లేకుండా పోతుంది. వైద్యఆరోగ్య రంగం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండడం సరైనదని అనేక దేశాల్లో నిరూపితమైందని యూకే, నెదర్లాండ్స్, ఇంకొన్ని స్కాండినేవియన్ దేశాల్లో ఆదర్శవంతమైన ఆరోగ్య వ్యవస్థ నడుస్తుంది. ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ప్రభుత్వ వైద్యం బలపడి ఉచితంగా అందిస్తేనే అది సాధ్యం అవుతుంది. ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలు వ్యాపారం చేస్తాయి గాని సేవ చేయవు. అనర్ధదాయకమైన ఈ నిర్ణయాలను ఉపసంహరించుకుని ప్రభుత్వ రంగంలోనే వైద్య, విద్య, ఆరోగ్యసేవలను కొనసాగించాలని సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో మెడికల్ కాలేజీలో ఉన్న రిజర్వేషన్ సీట్లలో సగం సీట్లను లక్షలకు అమ్ముకునే జీవో 107, 108ను రద్దు చేయాలి. వైద్యఆరోగ్యశాఖ సేవలను వారికి దూరం చేసి ఆదాని, అంబానీ వంటి కార్పొరేటర్లకు కాసులు కురిపించే విధానాలను ప్రభుత్వం విడనాడాలి. అటువంటి నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి. లేకపోతే రాష్ట్ర ప్రజలకు హానీ జరగడమే కాక ప్రభుత్వానికి కూడా రాజకీయంగా చేటు కలగవచ్చు.

# ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమం

## - సన్మానించిన శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి






**గిద్దలూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

మండల ఉత్తమఉపాధ్యాయులను సన్మానించిన శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి. గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని విట్టా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో గురు పూజోత్సవ కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి2 పోలా నాగభూషణ్‌రెడ్డి అధ్యక్షతన, మండల విద్యాశాఖ అధికారి1 అశ్వినీ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డి హాజరయ్యారు. మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలల్లో పని చేయుచున్న 25 మంది మండల ఉత్తమ ఉపాధ్యాయులను, జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా ఎంపికైన సిద్దేశ్వరశర్మను, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా గత సంవత్సరం ఎంపికైన డాక్టర్ మొర్రి. పిచ్చయ్యను మెమొంటోతో, ప్రశంసా పత్రంతో, దుశ్శాలువతో, పూలమాలతో ఘన సన్మానం చేశారు. శాసనసభ్యులు అశోక రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని, విద్యార్థులను ఉత్తమపౌరులుగా చేసే బాధ్యత ఉపాధ్యాయులు మీద ఉందని, విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలను, సామాజిక స్పృహను కలిగించే విధంగా విద్యాబోధన చేయాలని తెలిపారు. గురు శిష్యుల సంబంధం పవిత్రమైందని, సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఉన్నతమైందని ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ మొర్రి. పిచ్చయ్య మండలఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి మెమొంటోలను, ప్రశంసా పత్రాలను, దుశ్శాలువలను పూలమాలను సమకూర్చడం జరిగినది. అనేక సాంస్కృతి కార్యక్రమాలు విద్యార్థుల చేత నిర్వహించారు. ఉపాధ్యాయులకు ఆటల పోటీలు పెట్టి దాతల సహకారంతో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలయ్య, కంబం మార్కెట్ యార్డ్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్ రమణ, బిజెపి నాయకులు రమేష్, గిద్దలూరు సొసైటీబ్యాంక్ అధ్యక్షులు బాలీశ్వరయ్య, మండల పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, మండలంలోని ఉపాధ్యాయ యూనియన్ నాయకులు పిచ్చయ్య, నారాయణ, కబీర్, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేశారు.

# లయన్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ట్ 8 వ క్యాబినెట్

## ఇన్స్టాలేషన్ వేడుకలలో అతిధిగా శిద్దా







**ఒంగోలు - ప్రభాతవార్త**

ఒంగోలు పి.ఎ.జి.కన్వెన్షన్ హాల్‌లో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ట్ 8 వక్యాబినెట్ ఇన్స్టాలేషన్ వేడుకలలో అతిథిగా పాల్గొన్న ఎమ్.జె.ఎఫ్‌లయన్, మాజీ మంత్రి శ్రీ శిద్దా రాఘవరావు. ఈ కార్యక్రమంలో నూతన డిస్టిక్ట్ గవర్నర్‌లయన్ సి.హెచ్ హరి ప్రసాదరావు, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్, ఇన్స్టాలేషన్ ఆఫీసర్ లయన్ పర్వతనేని సుభాష్ బాబు, వైస్ డిస్టిక్ట్ గవర్నర్ రావిపూడి లక్ష్మి నారాయణ, డిస్టిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ నిమ్మగడ్డవెంకటేశ్వరరావు, డిస్టిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్ సోమేపల్లి వెంకటేశ్వర్లు మరియు లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం జిల్లా లయన్స్ క్లబ్ ప్రతినిధులు శ్రీ శిద్దా రాఘవరావు శాలువాతో సత్కరించారు.

# తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని మోసం

## - ఏడుగురు అరెస్టు - రూ.14లక్షలు నగదు, కారు, సెల్ ఫోన్ స్వాధీనం



**చీరాల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

చీరాల పట్టణంలో తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని అమాయకులను మోసం చేస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఏడుగురు అంతరాష్ట్ర నేరగాళ్ళను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.14లక్షలు నగదు, ఒక కారు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ప్రకాశం జిల్లా పెద్దదోర్నాలలో వీరిని అదుపులోకి తీసుకున్నట్లు చీరాల డీఎస్పీ తెలిపారు. కర్ణాటకు చెందిన బంగారు వ్యాపారి నాగరాజు ఫిర్యాదుతో ఈ ముఠాను పట్టుకున్నట్లు వెల్లడించారు.

6_6.qxd 9/8/2025 12:52 AM Page 1



# చిన్నికి పలువురు అభినందనలు



**అద్దంకి , సెప్టెంబరు 7 ప్రభాతవార్త**

అద్దంకి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,మున్సిపల్ మాజీ వైఎస్ చైర్మన్ చిన్నిలక్ష్మీశ్రీనివాస రావును, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పోరేషన్ డైరెక్టర్‌గా నియమించారు.ఈ నేపద్యంలో ఆయనను అద్దంకి పట్టణములోని వెంకట అనూష క్లాత్ ఎంపోరియం ప్రొప్రైటర్ అరవపల్లి మల్లికార్జునరావు, ఆర్యవైశ్యులు శుభాకాంక్షలు తెలిపి, తదితరులు దుశ్శాలువాతో సత్కరించి పూలమాలతో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా అద్దంకి పట్టణ మాజీ అధ్యక్షులు మోలాలి 1వార్డ్, 17వ వార్డు ముస్లిం సోదరులు 1వార్డ్ ఇంచార్జి రహీం, 1వార్డ్ మాజీ కౌన్సిలర్ కాసిం అంజయ్య, 17వార్డ్ ఇన్చార్జి కౌన్సిలర్ షేక్ సైదా వలి సలీంలు శుభాకాంక్షలు తెలియపరిచారు. చిన్ని శ్రీనివాసరావును దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.



# వరి సాగుకు యూరియా కొరత లేదు

## - తహశీల్దార్, వ్యవసాయ అధికారి సంయుక్త ప్రకటన

**జె. పంగులూరు , సెప్టెంబరు 7 ,ప్రభాతవార్త**

మండలంలోని వరి సాగు చేసే రైతులు యూరియా కొరత లేదని ఆందోళన చెందవలసిన పనిలేదని తహశీల్దార్ సింగారావు అన్నారు. మండలంలోని సాధారణ వరి సాగు 122 హెక్టార్లు సాగులోఉన్నదని, ఇప్పటివరకు 40 హెక్టార్లలో వరి నాట్లు వేయడం జరిగినదని మండల తాసిల్దార్ పి సింగారావు, మండల వ్యవసాయ అధికారి డి. సుబ్బారెడ్డి ఆదివారం సంయుక్తంగా తెలియజేశారు. ఇప్పటికీ ఇంకా వరి సాగు పూర్తిగా మొదలు కాలేదని తెలియజేస్తూ పంగులూరు మండలంలో ఆదివారం ఉదయానికి 94.455 ఎం. టి.ఎస్. యూరియా నిలువ స్టాకు ఉన్నదన్నారు.పృధ్వి ఎఫ్ఈఓ, అలవలపాడు 36.225 ఎం టిఎస్, శ్రీ వెంకటరమణ ట్రేడర్స్ 15.165 ఎంటిఎస్,సాయి శ్రీనివాస ట్రేడర్స్ 10.17 ఎంటిఎస్, మన గ్రోమోర్ సెంటర్ 13.005 ఎంటిఎస్,హనుమాన్ ట్రేడర్స్ 1.89 ఎంటిఎస్, పంగులూరు ఒకటి రైతు సేవ కేంద్రం 9.0 ఎంటిఎస్, చందలూరు రైతు సేవ కేంద్రం 9.0 ఎంటిఎస్, స్టాకు నిలవ ఉన్నదని రైతులకు అవసరమైనటువంటి యూరియా అందుబాటులో ఉన్నదని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరానికి అనుగుణంగా యూరియా సరఫరా చేయబడునని, పంట సాగు చేసిన రైతులు అవసరం మేరకే ఎరువులు తీసుకెళ్లమని తాసిల్దార్ పి.సింగారావు, వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు.

# మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా దూళిపాళ్ల

**బల్లికురవ, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**



బల్లికురవ మండల నూతన తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా దూళిపాళ్ల హనుమంతరావు పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు చిలకలూరిపేటలోని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కార్యాలయంలో ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల తెలుగుదేశం పార్టీ శ్రేణుల నుండి అభిప్రాయ సేకరణ జరిగింది. అధ్యక్షునిగా హనుమంతరావు పేరును సిఫార్సు చేశారు. పార్టీ అధిష్టానం ఆమోదమే మిగిలి ఉంది. గతంలో మండల తెలుగు యువత అధ్యక్షునిగా నక్కబొక్కలపాడు గ్రామ సర్పంచ్‌గా హనుమంతరావు పార్టీ పటిష్టత కోసం విశేషంగా కృషి చేశారు. పార్టీ సభ్యత్వాల నమోదు ప్రారంభమైన ప్రతిసారి క్రియాశీలక పాత్ర పోషిస్తుంటాడు. సుదీర్ఘంగా మండలంలో పార్టీ అభివృద్ధి కోసం తన వంతు విశేషంగా కృషి చేశారు. ప్రస్తుతం కొండేటి ఇజ్రాయిల్ పార్టీ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు.

## చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాలు మూత



**బల్లికురవ, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

మండలంలోని దేవాలయాలు ఆదివారం సాయంత్రం నుండి మూతపడ్డాయి. చంద్రగ్రహణం సందర్భంగా దేవాలయాలను మూసి వేస్తున్నట్లు ఆయా గ్రామాలలో ఆలయ అభివృద్ధి కమిటీలు తెలియజేశాయి.తిరిగి సోమవారం దేవాలయాలలో సంప్రోక్షణ కార్యక్రమాలు ముగిసిన అనంతరం దైవదర్శనాలు ప్రారంభమవుతాయని తెలియజేశారు.

# అంగన్వాడీ కార్యకర్తల పనిచేయని ఫోన్లు...

## - తలనొప్పిగా యాప్‌లు

### - రికార్డుల నిర్వహణ రద్దుజీవో వచ్చినా తప్పని భారం

### - పాతకాలం మొబైల్స్ కావడంతో యాప్‌లకు సపోర్టుచేయక పోవడం

**యర్రగొండపాలెం,సెప్టెంబర్ 7,ప్రభాతవార్త**

యాప్‌లమోత..రికార్డుల భారం..పనిచేయని మొబైల్స్‌తో విధుల నిర్వహణపై అంగన్వాడీలు బెంబేలెత్తిపోతున్నారు.తాజాగా నెలకొన్న పరిస్థితుల్లో ఉద్యోగమంటేనే భయపడే పరిస్థితి అంగన్వాడీల్లో నెలకొంది.జిల్లాలో కొన్నిచోట్ల మొబైల్ ఫోన్లను అధికారులకు పలువురు సరండర్ చేశారు.స్త్రీ,శిశు సంక్షేమంలో అంగన్వాడీల పాత్ర అత్యంత కీలకమైనది.గర్భిణులు,బాలింతలు,చిన్నారులకు పోషణ అందించడంతోపాటు,వారి సంక్షేమం విషయంలో అంగన్వాడీలది కీలకపాత్ర,చిన్నారులు,గర్భిణులు, బాలింతలకు బలవర్ధక ఆహారాన్ని అందించడంతోపాటు,చిన్నారులకు ప్రీ స్కూలు విద్యను కూడా వీరు అందించాలి.అయితే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాం కారణంగా వారికి పనిభారం పెరిగి మొత్తంగా వ్యవస్థ దెబ్బతింటోంది.అంగన్‌వాడీ కార్యకర్తలు విధిగా నాలుగు ఆన్‌లైన్ యాప్‌లను నిర్వహించాలి.కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోషణ ట్రాకర్లో ప్రతిరోజూ చిన్నారులు,గర్భిణులు,బాలింతల పోషణ వివరాలు నమోదు చేయాలి.రాష్ట్రప్రభుత్వనికి చెందిన బాలసంజీవని యాప్‌లో రాష్ట్రప్రభుత్వం పోషణ వివరాలు నమోదు చేయాలి.వీటితోపాటు నెలకు రెండుసార్లు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు,గర్భిణులు,బాలింతల ఫేషియల్ రికగ్నిషన్ హాజరు నమోదు చేయాలి.అయితే సరుకులన్నీ ఒకేసారి రాకపోవడంతో వాటిని వేరు వేరు సమాయాల్లో యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి వస్తోంది.దీనికితోడు ఎప్పుడో పాతకాలం నుంచి వాడుతున్న మొబైల్స్ పనిచేయకపోవడం,యాప్‌లకు సపోర్టు చేయకపోవడం వంటి కారణంగా యాప్‌ల నిర్వహణ పెద్ద తలనొప్పిగా మారింది.ఆ కారణంగా లబ్దిదారులు ఒకటికి పదిసార్లు అంగన్వాడీల చుట్టూ తిరగాల్సి వస్తోంది.కొంత మంది లబ్దిదారుల ఆగ్రహానికి అంగన్వాడీలు గురవుతున్నారు.అంగన్‌వాడీ ఉద్యోగులపై రికార్డుల మోత అంతా ఇంతా కాదు.కూటమి ప్రభుత్వం వచ్చాక వారి విన్నపాన్ని మన్నించి రికార్డుల భారాన్ని తొలగిస్తూ జీవో జారీ చేసింది ఆ జీవో ప్రకారం ఎవరూ ఫిజికల్ రికార్డులు నిర్వహించాల్సిన పనిలేదు.కానీ ఆరు రికార్డులు నిర్వహించాలని అధికారులు హుకుం జారీచేశారు.తక్షణమే యాప్‌ల నిర్వహణకుతగిన ఫోన్లు ఇచ్చి, రికార్డుల నిర్వహణను నిలిపివేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.పనిభారం తగ్గించి న్యాయమైన వేతనాలు ఇవ్వాలనికోరుతున్నారు.చివరకులబ్దిదారులఆగ్రహావేశాలతో ఉద్యోగులుఒత్తిడికి గురవుతున్నారు.

# నిరుపేదలకు దుప్పట్లు అందజేత



**మార్టూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

గ్రాండ్ పేరెంట్స్ దినోత్సవం సందర్భంగా మన మార్టూరు గ్రామంలోని గవర్నమెంట్ కాలేజీ వద్ద 11 ఫ్యామిలీ మెంబర్స్ టెంపరరీ గుడిసెలు వేసుకొని ఉంటున్న నిరుపేదలకు.. ఒక కుటుంబానికి రెండు దుప్పట్లు చొప్పున ఆదివారం పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కోశాధికారి గోనుగంట్ల రవికుమార్,అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మచౌదరి,మాజీ అధ్యక్షులుమద్దుమాల కోటేశ్వరరావు,తాళ్లూరి సాంబశివరావు,కొర్రపాటి కాజారావు, చెన్నుపాటి బసవరాములు, జాష్టి సాంబశివరావు, రొటీరియన్స్ కన్నెగంటి శ్రీనివాసరావు, చల్లగుండ్ల శ్రీనివాసరావు,చింతల సుబ్బారావు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# అభివృద్ధి, సంక్షేమం సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

## - రాప్తాడులో ఎమ్మెల్యే ఏలూరి విస్తృత పర్యటన



**మార్టూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

అభివృద్ధి, సంక్షేమం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని, ఏడాది పాలనలోనే ఇచ్చిన హామీలను అమలు చేసి చూపారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విస్తృత పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కనివిని ఎరుగని రీతిలో ఏడాదిలోనే ఇచ్చిన హామీలను అమలు చేసి సంక్షేమ సారధిగా చరిత్రలో నిలిచారన్నారు.ఈ నెల 10న జరగబోయే సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, రాంప్రసాద్‌రెడ్డి,మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యలతో కలిసి పర్యటించారు. పర్యటనలో భాగంగా పరిటాలరవీంద్ర స్వగ్రామం వెంకటాపురం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే ఏలూరి పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పరిటాల నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతమ్మ, యువ నాయకుడు పరిటాల శ్రీరామ్‌లు ఎమ్మెల్యే ఏలూరికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.శాలువాతోసత్కరించారు.తొలుత ఎమ్మెల్యేపల్లె సింధూర అనంతపురం నివాసంలో అల్పాహారం స్వీకరించిన ఆయన,తరువాత మంత్రులతోకలిసి వెంకటాపురంలో విస్తృతంగా పర్యటించారు.

## ఉచిత కంప్యూటర్ కోర్స్ శిక్షణకు దరఖాస్తులు దాఖలు చేసుకోవాలి

**సంతనూతలపాడు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక వద్ద గల జిల్లా మహిళా కేంద్రంలో జరిగే ఉచిత కంప్యూటర్ కోర్స్ శిక్షణ తరగతులకు మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జే.రవితేజ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తయిన మహిళలకు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని 15 నుండి 45 సంవత్సరాల లోపు గల మహిళలు దీనిని సద్వినియోగపరుచుకోవాలని జిల్లా అధికారి రవితేజ యాదవ్ వెల్లడించారు. మరిన్ని వివరాల కొరకు 9963005209 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## విద్యార్థి దశ నుండే పోరాటాలను నడిపిన మహోన్నత వ్యక్తి ఏచూరి




**సంతనూతలపాడు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

విద్యార్థి దశ నుండే పోరాటాలను నడిపి సమాజాన్ని ముందుకు తీసుకెళ్లిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు అన్నారు. సీపీఎం దిగ్గజం కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రధమ వర్ధంతి కార్యక్రమం సంతనూతలపాడు సుందరయ్య భవన్‌లో ఆదివారం జరిగింది. ముందుగా ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం నాయకులు కోదాటి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు, నాయకులు షేక్ మస్తాన్, ఎన్‌వీ నరసింహం, అన్నవరపు శేషారావు, షేక్ నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## మదర్ థెరీసా సేవారత్న జాతీయ అవార్డ్ గ్రహిత నర్రెడ్డి వెంకటరెడ్డి



**యర్రగొండపాలెం,సెప్టెంబర్7,ప్రభాతవార్త**

ప్రముఖ స్వచ్ఛందసేవా సంస్థ సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు,సామాజిక యాక్టివిస్ట్,జాతీయ మానవ హక్కుల కమిషన్ కార్యకర్త నర్రెడ్డి వెంకటరెడ్డికి ప్రతిష్టాత్మక మదర్ థెరీసా సేవారత్న జాతీయ అవార్డ్ 2025 లభించింది.ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో చేసిన సేవలకు సమాజ సేవలు చేసిన సందర్భంగా తనను గుర్తించి ఈ అవార్డు రావడం చాల సంతోషకరం అన్నారు.టీచర్స్‌డే వేడుకల సందర్భంగా కళాభారతి సిటీ కల్చర్ సెంటర్ హైదరాబాద్‌లో ఈ అవార్డ్‌ను అందుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.

## 9న అన్నదాత పోరు కార్యక్రమంను జయప్రదం చేయండి

**జరుగుమల్లి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై నిరసనగా ఈనెల 9న జరుగుమల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే అన్నదాత పోరు కార్యక్రమం జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పిన్నిక శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో మాజీ మంత్రి, వైసీపీ పీఏసీ సభ్యులు, కొండపి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ సూచనల మేరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కావున జరుగుమల్లి మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# శ్రీలక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో

## గిరి ప్రదక్షణ కార్యక్రమం



**అద్దంకి , సెప్టెంబరు 7,ప్రభాతవార్త**

సింగరకొండ శ్రీ లక్ష్మీ న్రసింహస్వామి వారిదేవస్థానం లో పౌర్ణమి రోజు సందర్భంగా గిరి ప్రదక్షణ కార్యక్రమం లో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అదివారం చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు స్వామివారి ముఖ ద్వారం ముయ్యడం జరిగింది.

## ఉపాధ్యాయులకు చేసే సన్మానాలు సత్కారాలు వారి మనోబలాన్ని పెంచుతాయి

### - గురుపూజోత్సవ సన్మాన కార్యక్రమంలో పలువురు వక్తలు అభినందనలు



**పెద్దదోర్నాల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మంచ్ ఫెర్ ఆడిటోరియంలో ఆదివారం మండల విద్యాశాఖ అధికారి బి.మస్తాన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇది కేవలం కార్యక్రమం కాదు. అది సమాజం గురువుల పట్ల కలిగిన గౌరవానికి ప్రతిబింబం. ఇటువంటి సన్మానాలు ఉపాధ్యాయుల మనోబలాన్ని పెంచుతాయి. భవిష్యత్తు తరాల నిర్మాణానికి మరింత ఉత్సాహాన్ని కలిగిస్తాయి గురువులను గౌరవించే సంస్కృతి మన సమాజం యొక్క గొప్ప తనానికి నిదర్శనం. ఈ సన్మానాలు ఉపాధ్యాయుల కష్టానికి సామాజిక గుర్తింపు. ఈ గుర్తింపు ప్రతి గురువుకు ప్రేరణగా మారుతుంది. ఉపాధ్యాయుల సేవలను గౌరవించడం సమాజం యొక్క ప్రాధమిక కర్తవ్యం. ఎందుకంటే ఒక గ్రామం, ఒక పట్టణం, ఒక దేశ భవిష్యత్తు వారి చేతుల్లోనే నిర్మితమవుతుంది. చరిత్రలో ఎల్లప్పుడూ గురువులకు ప్రత్యేక స్థానం లభించి ఉంది. జ్ఞానాన్ని బోధించడమే కాక, జీవన విలువలను నేర్పడం, విద్యార్థులను మంచివారిగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల ధర్మం. సన్మానించిన ఉపాధ్యాయులందరూ తమ కృషితో, అంకితభావంతో ఆ బాధ్యతలను నెరవేరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు, ఉపాధ్యాయుల పాత్ర ను ప్రశంసించడం ఒక మంచి పరిణామం. విద్యావేత్తలతో రాజకీయ నాయకులు కలిసి వేదికపై ఉండడం విద్యారంగా అభివృద్ధికి సమాజంలో ప్రతి వర్గం కలిసి కృషి చేయాలనే సందేశాన్ని అందిస్తుంది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి బి.మస్తాన్ నాయక్, టీడీపీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు షేక్ మాబు, టీఎన్‌టీయుసీ రాష్ట్ర కార్యదర్శి బట్టు సుధాకర్‌రెడ్డి, టీడీపీ లీగల్ సెల్ న్యాయవాది వల్లభనేని కాశయ్య, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడి లక్ష్మయ్య, టీడీపీ నాయకులు కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, ఈదర మల్లయ్య, జనసేన మండల కన్వీనర్ కేతి వెంకట మోహన్ మురళి, గోల్మార్ ఎర్ర వెంకటరెడ్డి, వైకాపా నాయకులు చింతలచెరువు మల్లిఖార్జునరెడ్డి తదితరులు మాట్లాడుతూ విద్యారంగాన్ని ఉన్నత స్థాయికి చేర్చడంలో ఉపాధ్యాయుల కృషి ఎన్నటికి మరువలేనిది. ప్రతి విద్యార్థి విజయంలో ఒక ఉపాధ్యాయుడి చెమట చెక్క, కృషి ప్రేమగా, దాగి ఉంటుందని ఉపాధ్యాయులను అభినందించారు. గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు సమాజంలో ఉన్న ప్రాధాన్యాన్ని చాటిచెప్పే విధంగా దోర్నాల మండల పరిధిలోని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. ఉత్తమ అవార్డు గ్రహీతలైన ఉపాధ్యాయులు కూచిపూడి వెంకయ్య(ఎస్‌జీటీ దోర్నాల క్లస్టర్, దాసరి సుధాకర్(ఎస్జీటీ ఐటీడీఏ), గూడూరి సువర్ణ(ఎస్‌జీటీ రామచంద్ర కోట క్లస్టర్), కేవీ నారాయణమ్మ(ఎస్‌జీటీ పెద్దబొమ్మలాపురం) క్లస్టర్), బండ్లమూడి శ్రీనివాసులు ఎస్‌జీటీ ఏపీ మోడల్ స్కూల్ క్లస్టర్), షేక్ మహమ్మద్ హనీఫ్(సీఆర్‌ఎంటీ బొమ్మలాపురం క్లస్టర్), మండల విద్యాశాఖాధికారి బి.మస్తాన్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు రాజకీయ నాయకులు విద్యావేత్తలు తల్లిదండ్రులు బందువుల సమక్షంలో ఘన సన్మాన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు.



# కార్మికుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం

**నాగులుప్పలపాడు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా అవలంభిస్తున్న విధానాలను తిప్పి కొట్టాలంటే కార్మికులందరూ ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, బంకా సుబ్బారావులు తెలిపారు. ఆదివారం మండలంలోని ఉప్పుగుండూరులో సీఐటీయు మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉండే విధంగా నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికులు తమ సమస్యలపై ప్రశ్నించే తత్వం కోల్పోవడంతో పాటు యూనియన్ పెట్టుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోతుందన్నారు. కార్మికులు గతంలో బ్రిటీషన పాలకులకు వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న 8గంటల పనివిధానాన్ని తిరిగి ఈ ప్రభుత్వాలు 12 గంటలు పని చేసే విధంగా చట్టాలను సరి చేయడానికి పూనుకుందని విమర్శించారు. తద్వారా ఉద్యోగ భద్రత కోల్పోవడంతో పాటు నయా బానిసలుగా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్, కో కన్వీనర్‌లుగా జి.బసవపున్నయ్య, నలతోటి రామారావులతో పాటు మరో ఎనిమిది మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా, మండల అధ్యక్షులు జే.జయంతిబాబు, శ్రీకాంత్, మండలంలోని వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు పాల్గొన్నారు.



# డీవైఎఫ్ఐ దర్శి మండల కమిటీ ఎన్నిక


## - అధ్యక్షులుగా షేక్ పీరా సాహెబ్ - కార్యదర్శిగా ఆర్ జెస్సీపాల్




**దర్శి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ దర్శి మండల మహాసభ ఆదివారం సుందరయ్య భవన్లో ఆర్.జెస్సీపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాజీ డీవైఎఫ్ఐ నాయకులు సందు వెంకటేశ్వరరావు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్యలు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగం విచ్చలవిడిగా పెరిగి పోతుందని ప్రభుత్వాలు నిరుద్యోగానికి పట్టించుకోవడం లేదని రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి రాష్ట్ర కేంద్ర శాఖలలో ఖాళీగా ఉన్న ఎనిమిది లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలని కాపాడాలని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పినట్లు ఇంటికో ఉద్యోగం నల్లధనాన్ని వెలికి తీయాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పించాలని, దొనకొండని పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం డీవైఎఫ్ఐ దర్శి మండల ఎన్నికని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా షేక్ పీరా సాహెబ్, కార్యదర్శిగా ఆర్ జెస్సీపాల్, ఉపాధ్యక్షులుగా బిజ్జం శ్రీనివాసులురెడ్డి, కే.కళ్యాణ్, పి.లోకేష్, సహాయ కార్యదర్శులుగా కంట వెంకట్రావు,బి.రామాంజినాయక్, టి.రాకేష్,రోషన్, డి.గోపి, కమిటీ సభ్యులుగా ఎల్.శ్రీనివాసులురెడ్డి, షేక్ సుభానిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఈ నూతన కమిటీ నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసంఖాళీ పోస్టుల భర్తీకోసం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు.



# టీసీఎస్‌లో ట్రైనీ మేనేజర్‌గా సెయింట్ ఆన్స్ విద్యార్థి



**వేటపాలెం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
వేటపాలెం స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలోని ఎంబీఏ విద్యార్థి టీసీఎస్ కంపెనీలో ట్రైనీ మేనేజర్గా ఉద్యోగాన్ని సాధించినట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఇటీవల టీసీఎస్ కంపెనీ వారు నిర్వహించిన ఉద్యోగ నియామకాలలో ఎంబీఏ విభాగ విద్యార్థి ఎస్.బాల వందన ట్రైనీ మేనేజర్గా ఉద్యోగాన్ని సాధించినట్లు ఎంబీఏ విభాగాధిపతి ఆర్.ఇమ్మానియేల్ తెలిపారు. టీసీఎస్ కంపెనీలో ఎంపికైన విద్యార్థి ఎస్.బాల వందనకు సంవత్సరానికి రూ.5.80 లక్షల వేతనంతో పాటు ఇతర అలవెన్సులను అందజేస్తారని కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి ఎస్.పూర్ణచంద్రరావు తెలిపారు. సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్బాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## వేటపాలెం రైల్వే బ్రిడ్జి వద్ద

# గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**వేటపాలెం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
రామన్నపేట గ్రామ పరిధిలోని కొత్త కాలువ రైల్వే బ్రిడ్జి సమీపంలో ఆదివారం ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఆదివారం ఉదయం రైల్వే బ్రిడ్జి సమీపంలో మృతదేహం పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే సమాచారాన్ని పోలీసులకు అందించారు. సమాచారం అందిన వెంటనే ఎస్సై జనార్దన్, వారి సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# పేకాట స్థావరంపై మెరుపు దాడి



**వేటపాలెం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
వేటపాలెం మండలంలో గల రామన్నపేటలో పేకాట ఆడుతున్న పేకాట రాయుళ్లపై వేటపాలెం ఎస్సై జనార్దన్, వారి సిబ్బంది ఆదివారం మెరుపు దాడి నిర్వహించారు. పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వారి వద్ద నుండి రూ.2,580 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలియజేశారు. గ్రామాలలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లయితే తెలియజేయాలని అసాంఘిక కార్యక్రమాలు జరిగితే ఉపేక్షించేది లేదని ఎస్సై హెచ్చరించారు.

# చంద్రగ్రహణం సందర్భంగా వల్లూరమ్మ ఆలయం మూసివేత



**టంగుటూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
టంగుటూరు మండలం వల్లూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లూరమ్మ దేవస్థానం ఆదివారం నాడు చంద్ర గ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 2 గంటలకు దేవాలయం తలుపులు మూసి వేయడం జరిగింది. మరుసటి రోజు 8వ తేదీ ఉదయం సంప్రోక్షణ అనంతరం యధా ప్రకారం అమ్మవారి దర్శనం ఉంటుందని, కావున భక్తులు గమనించాలని కార్యనిర్వాహణాధికారి బి.రమేష్ తెలియజేశారు.

# ఎన్డీఆర్ఎఫ్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు



**చీరాల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో కురిసిన వర్షాల కారణంగా వరదల్లో చిక్కుకున్న ప్రజల్ని ఎంతో ధైర్య సాహసాలతో ప్రజల్ని కాపాడినటువంటి ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు ఆ బృంద కమాండెంట్ ప్రసన్న కుమార్ నేతృత్వంలో నిర్వహించారు. ప్రజలు, ప్రభుత్వాలు సకాలంలో ప్రజల ప్రాణాలను కాపాడినటువంటి బృందాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్కి పట్టభద్రుల సంఘం అధ్వర్యంలో ప్రత్యేకమైనటువంటి ధన్యవాదాలు తెలియజేశారు. వారు ఎంతో చాకచక్యంతో ఆంధ్రప్రదేశ్లో కూడా గత సంవత్సరం జరిగినటువంటి అకాల వర్షాలు, బుడమేరు విపత్తు నుండి అనేక మందిని కాపాడిన ప్రసన్నకుమార్ నేతృత్వంలో నేడు తెలంగాణలో ప్రజల్ని కాపాడినటువంటి బృందం ఎన్డీఆర్ఎఫ్ బృందానికు ప్రత్యేక ధన్యవాదాలు ప్రజలు, ప్రభుత్వాలు తెలియజేస్తున్నాయి. ఆధునిక, సాంకేతిక వ్యవస్థను మన తెలుగు రాష్ట్రాలకు తీసుకువచ్చి ప్రజల్ని విపత్తుల నుండి కాపాడుతున్నటువంటి శ్రీ ప్రసన్న కుమార్కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ వారు వేటపాలెం మండలం పందిళ్ళపల్లి వాసి అయి ఉండడం అదే విధంగా పట్టభద్రుల సంఘం ఏర్పాటుకు కృషి చేసినటువంటి ప్రసన్న కుమార్ అయి ఉండడం సంతోషంగా ఉంది. వారు మన తెలుగు రాష్ట్రాలకు, కర్ణాటక రాష్ట్రాలకు ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్గా ఉండటం మనందరికి గర్వకారణం అని సంఘం అధ్యక్షులు పత్తి వెంకట సుబ్బారావు అన్నారు.

# నామినేటెడ్ పదవుల్లో విశ్వబ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించాలి

## - జిల్లా అధ్యక్షులు చెన్నుపల్లి కోరుట



**దర్శి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
నామినేటెడ్ పదవుల్లో విశ్వబ్రాహ్మణులకు సముచిత స్థానంకల్పించాలని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసచారి అన్నారు. దర్శి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పలు అంశాలను తీర్మానించారు. సెప్టెంబర్ 17 విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు ధన్యవాదాలు తెలిపారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమను నియమించారు. కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలన్నారు. ప్రతి మండలంలో 50 మంది విశ్వబ్రాహ్మణ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు దొడ్డేటిపల్లి రామేశ్వరచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ దొడ్డుజు విశ్వనాథచారి, జిల్లా కార్యదర్శి నిమ్మకూరు మాల్యాద్రి, జిల్లా మహిళా సంఘం గౌరవ అధ్యక్షులు కోసూరు విజయలక్ష్మీ, రిటైర్డ్ తెలుగు లెక్చరర్ జిల్లా యువజన సంఘ ప్రధాన కార్యదర్శి కమ్మరి రాజు ఆచారి, జిల్లా మహిళా సంఘ ప్రధాన కార్యదర్శి పి.సుజాత, జిల్లా నెంబర్ ఏలూరి వీరబ్రహ్మాచారి, స్థానిక సంఘ నాయకులు తెనాలి నాగేశ్వరరావు, దేవస్థాన పురోహితులు వడ్డేంగుంట సుబ్బారావు, లక్ష్మీ పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి ఆశయాల సాధనకు అంకితమవుదాం

## - జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు



**ముండ్లమూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**
ఎర్రజెండా ముద్దుబిడ్డ ఏచూరి ఆశయాల సాధనకు అంకితం అవుదామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అన్నారు. మండలంలోని జమ్మలమడక గ్రామంలో జరిగిన సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభకు సీపీఎం సీనియర్ నాయకులు బోడపాటి హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ఏచూరి ఎర్రజెండాను సమున్నతంగా నిలబెట్టడంలో అసాధరణమైన పాత్ర పోషించారని అన్నారు. ఏచూరి స్ఫూర్తితో లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామ నాయకులు మేకల హనుమంతరావు, పొట్లూరి సుబ్బారావు, తుపాకుల కృష్ణ, బాపట్ల లక్ష్మీనారాయణ, సీహెచ్ అంజయ్య, టి.చెంచయ్య, ఎం.పున్నారావు, పి.జయమ్మ తదిదరులు పాల్గొన్నారు.

# సుందరాకాండ పుస్తక ఆవిష్కరణ

**ఒంగోలు కల్చరల్,సెప్టెంబర్ 7,ప్రభాతవార్త**
ఒంగోలు రంగారాయుడు చెరువు దగ్గర ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం ఉదయం సుబ్బారావు రచించిన రామాయణ రత్నమాల సుందరాకాండ పుస్తకాన్ని హర్షిని విద్యాసంస్థ అధినేత శ్రీ కె రవికుమార్ ఆవిష్కరించారు.సభాధ్యక్షులుగా గాడేపల్లి దివాకర దత్తు వ్యవహరించారు.జ్యోతి ప్రజ్వల కార్యక్రమాన్ని వేమూరి బుజ్జి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆదిపూడి గిరిజా శాండిల్య తొలి ప్రతి స్వీకర్త గ్రంథ స్వీకరించారు. గ్రంథ సమీక్ష సాహిత్యవేత శ్రీ పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి,ఆత్మీయ ప్రవచనంగా శ్రీగిరి దేవస్థానం ధర్మకర్త సి,వి, రామకృష్ణారావు విశిష్ట అతిథి ప్రముఖ కవి పండితులు ఉన్నం జ్యోతివాసు, ముఖ్యఅతిథి కొండ్రెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, మైనంపాటి సాయికుమార్ పాల్గొన్నారు. నారాయణ బాలసుబ్రమణ్యం, సి హెచ్ భాస్కర్ గ్రంథకర్త కీర్తిశేషులు శనగపల్లి సుబ్బారావు వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



# చంద్రగ్రహణంతో దేవాలయాలు మూసివేత







**ఒంగోలు కల్చరల్,సెప్టెంబర్ 7,ప్రభాతవార్త**
ఆదివారం రాత్రి సంభవించే రాహుగ్రస్త చంద్రగ్రహణం కారణంగా జిల్లా వ్యాప్తంగా దేవాలయాలన్నీ దేవాలయాలు అన్ని నిత్య పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్లకు మహా నైవేద్యం అనంతరం దేవాలయాలు మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం ఆలయాలను శుద్ధిచేసి పుణ్యాహవాచనం నిర్వహించి స్వామి అమ్మవార్లకు అభిషేక పూజాక్రతులను జరిపి అనంతరం భక్తులకు స్వామిఅమ్మవార్ల మూలవిరాట్ దర్శనభాగ్యం కల్పిస్తామని దేవస్థానం కార్య నిర్వాహణాధికారులు , ఆలయ నిర్వహకులు అర్చక స్వాములు తెలిపారు.

# ఉన్నత విద్యామండలి వీ-సి రేసులో ఏఎన్‌యు రెక్టార్..!

## - ఆచార్య ఉమా మహేశ్వరి రాజీనామాతో అవకాశం ?



**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు7, ప్రభాతవార్త**
ఏఎన్‌యు ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్-చైర్మన్ (వీ-సి) రేసులో ఉన్నట్లు సమాచారం. ఇప్పటి వరకు ఆ పదవిలో ఆచార్య ఉమామహేశ్వరి దేవి విధులు నిర్వహించారు. కొద్ది రోజుల క్రితం ఉమామహేశ్వరి దేవి రాజీనామా చేయడంతో ఆ పదవి ఖాళీ అయింది. ప్రస్తుతం ఆ పదవికి సీనియర్ ప్రొఫెసర్ కేటగిరిలో ఉన్న యూనివర్సిటీ అధ్యాపకుల పేర్లను పరిశీలిస్తున్నారు.ఇదే క్రమంలో ఏఎన్‌యు రెక్టార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆచార్య రత్నషీలామణికి ఆ పదవి పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నాయి. ప్రభుత్వం ఆదేశించడమే తరువాయని వర్సిటీ వర్గాలు పేర్కొంటున్నారు. మహిళా కేటగిరిలో ఆ పదవి రత్నషీలామణికి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలిసింది. రత్నషీలామణి ఆ పదవిలో నియమితులైతే వర్సిటీ పాలన పరమైన పదవుల్లో కీలక మార్పులు రానున్నాయి. వాటిల్లో కొన్ని పేర్లు ప్రస్తుతం క్యాంపస్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ప్రస్తుతం ఇన్‌చార్జి వీసిగా ఆచార్య కె.గంగాధరరావు కొనసాగుతున్నారు. ఆయనే రెగ్యులర్ వీసి అయితే సామాజిక సమీకరణలను పలువురు అధ్యాపకులు బేరీజు వేసుకుంటున్నారు. రెక్టార్‌గా ఆచార్య జి.సింహాచలం పదోన్నతి పొందుతారని ఒక అంచన. అలాగే రిజిస్ట్రార్‌గా ఎస్సీ/ఎస్టీ/ కాపు సామాజిక వర్గానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్‌ను నియమించే అవకాశాలున్నాయి. ఎస్సీ కేటగిరిలో ఆచార్య వై.అశోక్‌కుమార్,ఆచార్య బ్రహ్మాజీ రావు (నూటా అధ్యక్షుడు),ఆచార్య పి.రత్నాకర్,ఆచార్య సుమంత్‌కుమార్,ఆచార్య జగదీష్‌నాయక్, ఆచార్య ఏవివి.స్వామి,ఆచార్య ఎన్.వి.కృష్ణారావులలో ఒకరికి అవకాశం రావచ్చు. ఆచార్య సింహాచలం అయిష్టత చూపితే ఆయన స్థానంలో బిసి సామాజిక వర్గానికి చెందిన ఆచార్య ఎస్.మురళీమోహన్, ఆచార్య యం.త్రిమూర్తిరావుల పేర్లు పరిశీలనకు రావచ్చని వర్సిటీలో చర్చ మొదలైంది.

# నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ శిక్షణ ప్రారంభం

**గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 7,ప్రభాతవార్త**
దేశవ్యాప్తంగా ప్రభుత్వ,జిల్లా పరిషత్,మున్సిపల్ ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ కుటుంబ సంవత్సర ఆదాయం 3లక్షల 50వేల రూపాయల్లోపు ఉన్న విద్యార్థులందరూ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష రాయడానికి అర్హులని సెప్టెంబర్ 30వ తేదీ లోపు ఈ పరీక్షకు నమోదు చేసుకోవచ్చని డిసెంబర్ 7వ తేది పరీక్ష నిర్వహిస్తారని విజేతలకు 9,10,11,12 తరగతులకు ప్రతి ఏడాది రూ.12వేల మెరిట్ స్కాలర్‌షిప్ కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని,ఈ అవకాశాన్ని 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు వినియోగించుకోవాలని మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ కార్యదర్శి కొరటపాటి సతీష్ తెలిపారు.గత ఏడాది మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గుంటూరు నగరంలోని 350మంది విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పై శిక్షణ ఇవ్వగా 80మంది ఎంపికైయ్యారని,ఈనెల 7వ తేది నుండి స్థానిక చంద్రమౌళినగర్‌లో గల భాష్యం ఆడిటోరియంలో ఉచిత శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్నామని నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.సెప్టెంబర్ 7నుంచి ప్రతి ఆదివారం ఉదయం 9నుండి సాయంత్రం వరకు నవంబర్ చివరి ఆదివారం వరకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని,విద్యార్థులుఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.నగరంలోని ప్రభుత్వ, మున్సిపల్,జిల్లా పరిషత్,ఎయిడెడ్ విద్యాసంస్థ ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకొని సంబంధిత విద్యాసంస్థల నుండి 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని,విద్యార్థులను ఎంపిక చేసి ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణ కార్యక్రమానికి పంపాల్సిందిగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి కొరటపాటి సతీష్ తెలిపారు.

# పశ్చిమలో "సూపర్ సిక్స్-సూపర్ హిట్-స్త్రీ శక్తి" సభకు సర్వం సిద్ధం



**గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 7,ప్రభాతవార్త**
స్థానిక ఏటుకూరు రోడ్డులోని వివాహ కనె వ్షన్ హాల్లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో "సూపర్ సిక్స్-సూపర్ హిట్-స్త్రీ శక్తి" సభను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.సోమవారం సాయంత్రం 4 గంటలకు భారీ ర్యాలీగా కార్యకర్తలు,అభిమానులు,మహిళా శక్తి ఊరేగింపుగా సభాప్రాంగణానికి చేరుకోనున్నారు.ఈసందర్భంగా సభాప్రాంగణం పసుపు,జనసేన, కాషాయ పతాకాలతో అలరారనుంది.రాష్ట్రస్థాయి నాయకులు,కార్పొరేషన్ చైర్మన్లు,ప్రముఖ ప్రజా ప్రతినిధులు సభలో పాల్గొననున్నారు.పశ్చిమ నియోజకవర్గ ప్రజల అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలు,మహిళా సాధికారత గురించి సభలో నేతలు ప్రసంగించనున్నారు.ఈ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

# ఎముకల ఆరోగ్యాన్ని సాంద్రతను నిలుపుకోవడానికి సమతుల ఆహారం,వ్యాయామాలు ముఖ్యం

## - అవగాహన ఆరోగ్యసభలో డాక్టర్ కొల్లి జయ కిషన్




**గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 7,ప్రభాతవార్త**
ఎముకల ఆరోగ్యాన్ని,సాంద్రతను నిలుపుకోవడానికి మంచి సమతుల ఆహారం,తేలికపాటి వ్యాయామాలు ఉపయోగపడతాయని,ఎముకల్లో క్యాల్షియం పదిలంగా ఉండేలా చూసుకోవాలని అవగాహన ఆరోగ్యసభలో సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కొల్లి జయ కిషన్ మాట్లాడుతూ అన్నారు.ఆరోగ్యసభకు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు.డాక్టర్ కొల్లి జయకిషన్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ వృద్ధాప్యంలో చాలా మందిని ఇబ్బందిపెట్టే వ్యాధి ఆస్టియో ఫోరోసిస్ అని,దీంతో బోన్ మినరల్ డెన్సిటీ తగ్గిపోతుందని,దీంతోచిన్న దెబ్బలతే ఎముకలు విరిగిపోతాయన్నారు.తొంటి కీలు బాధాకరంగా మారితే హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయాలన్నారు.సభలో పాల్గొన్న వారి సందేహాలను డాక్టర్ జయకిషన్ నివృత్తిచేశారు.అనంతరం డాక్టర్ జయకిషన్‌ను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.సభకు ఆరోగ్యసభ కోఆర్డినేటర్ టి.వి.సాయిరాం సమన్వయం చేయగా సభలో విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఆర్.రామచంద్రరావు,అనవేమా ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి తదితరులు ప్రసంగించారు.

# ప్రశాంతంగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు

**గుంటూరు విద్య ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ మరియు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఆదివారం గుంటూరులోని వివిధ పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలను గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్ కే ఖాజావలి పరిశీలించారు. ఉదయం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఏసి కళాశాల, టీజేపీఎస్ కాలేజీ ,విజ్ఞాన్ నిరూల డిగ్రీ పీజీ కాలేజీలలోని పరీక్షా కేంద్రాల్లో జరిగిన స్క్రీనింగ్ పరీక్షలను జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్ కే,కఖాజావలి పరిశీలించారు.ఆయా పరీక్ష కేంద్రాల నిర్వహణ అధికారులను కలిసి పరీక్ష ఏర్పాట్లు తదితర అంశాలపై ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉదయం జరిగిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు 7, 655 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 5,988 మంది అభ్యర్థులు హాజరైనారని, 1, 667 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు మొత్తంగా 78.2 శాతం నమోదైనట్లు అలాగే మధ్యాహ్నం పుల్లడిగుంట లోని మలినేని లక్ష్మయ్య విమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పరీక్షకు 1,492 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 1,133 మంది అభ్యర్థులు హాజరైనారని, 359 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.ముందుగా ఆయా కాలేజీలలో అభ్యర్థుల కొరకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన ఫస్ట్‌ఎయిడ్ కిట్లనుజిల్లా రెవెన్యూ అధికారి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లైజను అధికారులు ,ఏపీపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

8_8.qxd 9/8/2025 12:54 AM Page 1



## రైతు సమస్యల పరిష్కారం కోసం అన్నదాత పోరు విజయవంతం చేయాలి - దద్దాల నారాయణ యాదవ్



**కనిగిరి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

రాష్ట్ర రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత, గిట్టుబాటు ధరల లేమి, ఎరువుల బ్లాక్ మార్కెట్ వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 9వ తేదీన జరగనున్న అన్నదాత పోరు విజయవంతం చేయాలని కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం స్థానిక పార్టీ కార్యాలయంలో అన్నదాత పోరు వాల్ పోస్టర్‌ను ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సమస్యల పట్ల నిర్లక్ష్యం చూపుతోందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ఎరువుల కొరత ప్రధాన సమస్యగా మారింది. రైతులకు దక్కాల్సిన యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వల్ల కృత్రిమ సంక్షోభం సృష్టించారు. రూ.270కి అమ్మాల్సిన యూరియా బస్తా రూ.300 నుంచి రూ.500ల వరకు రైతులు కొనాల్సిన దుస్థితి ఏర్పడింది. వ్యవసాయశాఖ మంత్రి ఈ పరిస్థితిని పట్టించుకోకుండా రైతులపై చులకనగా మాట్లాడడం సిగ్గుచేటు అని దద్దాల మండిపడ్డారు. అలాగే ఇన్‌ఫుట్ సబ్సిడీ, పంట ఇన్సూరెన్స్ ఇవ్వడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని, పొగాకు, వరి, మిర్చి పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నాని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల కొరతను తక్షణమే నివారించి, రైతులకు అవసరమైన సరఫరా చేయాలని, బ్లాక్ మార్కెట్ నియంత్రించి దోపిడి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఉచిత పంట భీమాను పునరుద్ధరించి అందరికి వర్తింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గఫార్, వైఎం ప్రసాద్‌రెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, ఒకే రెడ్డి, గంగసాని హుస్సేన్‌రెడ్డి, యక్కంటి శ్రీనివాసులురెడ్డి, గోపవరపు బొర్రారెడ్డి, పులి శాంతి, ఆవుల భాస్కర్‌రెడ్డి, రామనబోయిన శ్రీనివాస్, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, చింతకుంట్ల కిషోర్‌బాబు, శిరుప గోవర్ధన్‌రెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, అయిమల్ల నాగమణి, షేక్ షకీల్, ఇండ్ల ఫర్వీన్ భాను, లక్ష్మీ, సుస్మిత, మీనిగ రాధ తదితరులు పాల్గొన్నారు.


## బారసాల వేడుకకు హాజరైన టౌన్ టీడీపీ నాయకులు



**కనిగిరి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని 11వ వార్డు టీడీపీ నాయకులు కాశీం మనవడి బారసాల కార్యక్రమంలో ఆదివారం పార్టీ నాయకులు ఘనంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టౌన్ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, వార్డు అధ్యక్షులు ఇస్మాయిల్, మైనార్టీ టౌన్ ఉపాధ్యక్షులు షేక్ కాశీం పీర, బూత్ ఇన్‌ఛార్జ్ లాల్ భాషా, టీడీపీ నాయకులు నాగ, అంజి నాయుడు, తదితరులు హాజరై కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు.

## కొండా కృష్ణారెడ్డికి టీడీపీ కార్యకర్తల ఘన సన్మానం



**కనిగిరి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

కనిగిరి మండల టీడీపీ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొండా కృష్ణారెడ్డికి ఆదివారం అమరావతి మైదానంలో ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేసి, ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డికి మంచి పేరు తీసుకురావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ సీనియర్ నాయకులు బాలు ఓబుల్‌రెడ్డి, పిచ్చల శ్రీనివాసులురెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, చెంచిరెడ్డి, కమతం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కనిగిరి మండలానికి చెందిన 25 గ్రామాల టీడీపీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు కూడా హాజరై వేడుకను వైభవంగా నిర్వహించారు.

## టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్‌కి బీసీ సంఘం నేతలు శుభాకాంక్షలు




**కనిగిరి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ ఫిరోజ్‌ను ఆదివారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆశీస్సులతో టౌన్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఫిరోజ్‌ను బీసీ సంఘం నాయకులు కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఈర్ల విజయరామరాజు, సీనియర్ నాయకులు దేవరాజు, గట్టు శివకాశయ్య, గౌరవ అధ్యక్షులు బొప్పరాజు సుబ్బారావు, దోసపాటి బ్రహ్మగౌడ్, కండ్లకుంట గురుప్రసాద్, పాతూరు నాగ, బీసీ సంఘం మహిళా నాయకులు షేక్ పాతిమా, వీరదుర్గ, వీరలక్ష్మి, గుజ్జులనారాయణమ్మ, అనుమాటి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చెన్న కృష్ణారావు 20వ వర్ధంతి సందర్భంగా చిల్డ్రన్స్ హోమ్ నందు అన్నదాన కార్యక్రమం

**పామూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

పామూరులో ఆదివారం చిల్డ్రన్స్‌గృహం నందు పసుపులేటి చెన్న కృష్ణారావు 20వ వర్ధంతి సందర్భంగా చెన్న కృష్ణారావు కుమారులు జనసేన పార్టీ యువ నాయకులు పసుపులేటి మణికంఠ కేశవ, మోహన సాయి ప్రకాష్, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువజన నాయకులు నీరుకట్టు రసూల్, రామ్మూర్తి, సింగరాజు కోటేశ్వరరావు, రాగి ఏడుకొండలు, పలువురు పాల్గొన్నారు.



## అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ



**దర్శి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

దర్శి పార్టీ ఆఫీసులో యూరియా బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు మాట్లాడుతూ జిల్లా పార్టీ అధ్యక్షుడు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీ మంగళవారం కనిగిరి ఆర్డీఓ ఆఫీసుకు రైతులతో కలిసి ర్యాలీగా వెళ్లి ఆర్డీఓకి వినతిపత్రం ఇవ్వడం జరుగుతుంది అన్నారు. యూరియా కొరత వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు నిరసనగా రైతులతో కలిసి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కావున రైతు సోదరులు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న దర్శి మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, దర్శి పట్టణ అధ్యక్షులు ముత్తినీడి సాంబ, దొనకొండ మండల పార్టీ అధ్యక్షులు కాకర్ల కృష్ణారెడ్డి, కురిచేడు మండల పార్టీ అధ్యక్షులు యన్నబత్తుల సుబ్బయ్య యాదవ్, ముండ్లమూరు మండల పార్టీ అధ్యక్షులు చింతా శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ జాయింట్ సెక్రటరీ గుంటు పోలయ్య, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కేవీ రెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి సుబ్బయ్య యాదవ్, దర్శి నియోజకవర్గ యూత్ అధ్యక్షులు ఇరుగుల శ్రీనివాస్‌రెడ్డి, దర్శి నియోజకవర్గ మున్సిపల్ వింగ్ అధ్యక్షులు 5వ వార్డు కౌన్సిలర్ బాబురావు, దర్శి నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు మిల్లర్ బుజ్జి, దర్శి నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు రమణ, దర్శి మండల బీసీ సెల్ అధ్యక్షులు అంకాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కనిపించకుండాపోయిన కూతురు, మనువడు అప్పగింత




**ముండ్లమూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

ముండ్లమూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన కాకర్ల అంజమ్మ భర్త చిన్నకాశీం అను ఆమె 2024 సంవత్సరంలో తన కుమార్తె అయినటువంటి వేమూరి తిరుమల, ఆమె మనువడైన నాగూర్ వలి అను ఇద్దరు కనిపించడం లేదని ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో రిపోర్టు ఇవ్వగా దానిపై కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా మిస్సింగ్ అయిన వారి ఇద్దరిని ట్రేస్ చేసి ఫిర్యాది రాలైనటువంటి కాకర్ల అంజమ్మ ఆమె భర్త చిన్న కాశీంలకు అప్పగించారు.

## తుమ్మెదలపాడులో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ



**దర్శి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

దర్శి మండలంలోని తుమ్మెదలపాడులో దర్శి ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్ర మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కేవీ రెడ్డి, ఎంపీటీసీ బండి గోపాల్‌రెడ్డి, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు మిల్లర్ బుజ్జి, నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు బొమ్మిరెడ్డి లక్ష్మీరెడ్డి, నియోజకవర్గ మున్సిపల్ వింగ్ అధ్యక్షులు 5 వార్డు కౌన్సిలర్ బాబురావు, మండల బీసీ సెల్ అధ్యక్షులు అంకాల శ్రీను, జిల్లా యూత్ కమిటీ సభ్యులు నలదిమ్ము యోగిరెడ్డి, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## బొల్లా నరసింహారావుకు శుభాకాంక్షలు తెలిపిన ఆకుపాటి వెంకటేష్



**పామూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

పామూరు మండల నూతన అధ్యక్షుడిగా బొల్లా నరసింహారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆకుపాటి వెంకటేష్ మిత్ర బృందం బొల్లా నరసింహారావును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆశీస్సులతో మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా పార్టీని తండ్రికి తగ్గ తనయుడిగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నడుపుతారని, మండలంలోని కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తూ రాబోయే రోజుల్లో మరెన్నో పదవులు ఆవరోధించాలని కోరుకుంటూ ఆకుపాటి వెంకటేష్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్, 278 బూత్ కన్వీనర్ నీరుకట్టు రసూల్, రామ్మూర్తి, నక్క తిరుపతయ్య, ఇండ్ల నరసింహులు, షేక్ చాంద్ భాషా, ఆకుపాటి బృందం పాల్గొన్నారు.

## మామిడాల శ్రీనివాసరావుకు ఘన సన్మానం

**చీరాల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

చీరాల ఎన్ ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రౌండ్ నందు వాకింగ్ సభ్యుడు రోటరీ క్లబ్ ఎగ్జిక్యూటీవ్ సెక్రటరీ, జనసేన పార్టీ నాయకుడు మామిడాల శ్రీనివాసరావు, చీరాల వీరరాఘవస్వామి గుడి ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వారిని సత్కరించారు. మామిడాల మాట్లాడుతూ పదవి ఇచ్చినందుకు స్థానిక శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్యకి, పవన్ కళ్యాణ్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తూ నా శక్తి వంచన మేరకు గుడి అభివృద్ధికి విశేష కృషి చేసి, పదవి ఇచ్చిన వారికి మంచి పేరు ప్రఖ్యతలు తీసుకువస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురు ప్రసాద్, నారాయణమూర్తి, వలివేటి మురళీకృష్ణ, డీవీ సురేష్, దండా నారాయణరావు, అమరా వీరాంజనేయులు, చింతా రమేష్, నాగ వీరభద్రాచారి, గుద్దంటి రమేష్, కోటనారాయణ, పుల్లయ్యనాయుడు, పూర్ణచంద్రరావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.




## గణపతి నిమజ్జనంలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దులూరి



**చీరాల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

జనసేన పార్టీ ఆధ్వర్యంలో పందిళ్లపల్లిలో ఏర్పాటు చేసిన గణపతి నిమజ్జనం కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా చీరాల నియోజకవర్గ శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య పాల్గొని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినయ్ గౌడ్, పసుపులేటి సాయి ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. గణపతి కరుణా కటాక్షాలతో వర్షాలు సంవృద్ధిగా కురిసి రైతులు, ప్రజలందరూ సుభిక్షంగా సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే కొండయ్య ఆకాంక్షించారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో, శాంతియుతంగా జాగ్రత్తగా నిర్వహించాలని ఆయన యువతను కోరారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి లక్ష్మీనారాయణ, చిన్ని, నంద, భార్గవ్, బన్నీ, లోకేష్, శ్రీను, చెరుకూరి సుబ్బారావు, కోలా సత్యం, సుధాకర్, చీరాల, జనసేన, తెలుగుదేశం, బీజేపీ నియోజకవర్గ నాయకులు, ప్రజలు, అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## దొనకొండ మండలంలో మంచి నీటి ఇక్కట్లు

**దొనకొండ,సెప్టెంబర్ 7,ప్రభాతవార్త**

దొనకొండ మండలములో 3 మంచినీటి చెరువులు (రిజర్వాయర్లు )పడమర లక్షి      మ్రపురం. చందవరం 1.చందవరం 2. కలిగిఉండి. మనమండలం నుండి వేరే మండలములకు. వేరే నియోజకవర్గములకు సాగర్ నీళ్లు అనునిత్యం సరఫరా జరుగుచున్నవి. కానీ దొనకొండ మండలం నందు కొన్ని గ్రామ పంచాయతీలకు సాగర్ నీటి సరఫరా 10లేదా 20 లేదా ఎప్పుడు సరఫరా జరుగుతుందో చెప్పలేని పరిస్థితి. గత 40సంవత్సరాల క్రితము నిర్మాణం కలిగిన చెరువు. పైపులైన్ శిదిలవస్థ కలిగి. పైపులు నిత్యం పగలడం. లీకులు. మోటార్లు మోర ఇంచడం. ఇలా పలు రకాల సమస్యలు గత 24 సంవత్సరాలనుండి జరుగు చున్నవి. ఈ సమస్యలు నీటి సరఫరా విభాగం అధికారులు కూడ ఏమి చెయ్యలేని పరిస్థితి. ఈ సమస్య. నీటి కష్టాలు లేకుండా ఉన్నత అధికారులు. రాష్ట్రస్థాయి అధికారులు పరిస్కారము చేయవలసిఉన్నది


## దోమల బాధ ,రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలతో ప్రజల ఇబ్బందులు



**దొనకొండ,సెప్టెంబర్ 7,ప్రభాతవార్త**

దొనకొండ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో అన్ని వీధులు పిచ్చి మొక్కలతో నిండి పోయినవి.దోమలు, ఇతర కిటకాలు,విధులలో కలిగి ఉన్నవి. ఇటీవల వర్షాలకు ఇంకా ఎక్కువగా పెరిగినవి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్. ఫాగింగ్. పిచికారీ మందులతో గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టగలరని ప్రాధేయ మనవి .


## ఏ జి పి రామకోటయ్యకు పలువురు అభినందనలు



**అద్దంకి రూరల్ సెప్టెంబర్ 7 ,ప్రభాతవార్త**

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సిఫార్సుతో అద్దంకి జూనియర్ సీనియర్ సివిల్ కోర్టులకు ఏజీపీగా నియమితులైన బత్తుల రామకోటయ్యను ఆదివారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. సంతమాగులూరు మండల టిడిపి నాయకులు చేవూరు వాసిరెడ్డి, మండల సర్పంచ్ల సంఘ అధ్యక్షులు పుట్ట వారి పాలెం సర్పంచ్ సన్నెబోయిన గురుబ్రహ్మం, మాజీ ఎంపీపీ సన్నిబోయిన ఏడుకొండలు తదితరులు బత్తుల రామకోటయను దుశ్యాలవతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు.

## మెడికల్ సీటు సాధించిన కొమ్ము సమీక్షకు అభినందనలు - కార్యక్రమంలో పాల్గొన్న మాదాసి




**టంగుటూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త**

టంగుటూరు అంబేద్కర్ నగర్లోని కి.శే బొడ్డు నరసింహం మెమోరియల్ హాల్‌లో స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మెడికల్ సీటు సాధించిన కొమ్ము సమీక్షకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆదాయపు శాఖ విశ్రాంత అధికారి స్ఫూర్తి గౌరవ సలహాదారు బొడ్డు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా కొండపి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొని మాట్లాడారు. ఈనాటి యువతలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, ఉత్తమ ఆశయాలతో కష్టపడి మంచి భవిష్యత్తును ఏర్పరుచుకోవాలని, పది మందికి ఆదర్శంగా ఎదగాలని, నిరుపేదలకు సేవ చేయాలని, పేద కుటుంబంలో పుట్టి ప్రాథమిక విద్య నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ గురుకుల పాఠశాలలో కష్టపడి చదివి, డాక్టర్ గా చదవాలనే లక్ష్యంతో ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని విజేతగా నిలిసి కాకినాడ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన కొమ్ము సమీక్ష ఎందరికో ఆదర్శం అని అభినందించారు. అనంతరం కొమ్ము సమీక్షను పలువురు అతిథులుగా ఘనంగా సన్మానించారు.

8-9Pg5 9_8-9Pg5.qxd 9/7/2025 11:01 PM Page 1



# ప్రత్యామ్నాయ వ్యూహాలతో భారత్ రెడీ



## ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా పలు ప్రణాళికలు

### లక్షలాది ఉద్యోగులను కాపాడేందుకు వ్యూహం

### కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఔట్‌సోర్సింగ్‌పై కఠిన వైఖరి అవలంబించవచ్చనే భయాలు పెరుగుతున్న నేపథ్యంలో భారత్ ప్రభుత్వం అప్రమత్తమైంది. సుమారు 300 బిలియన్ డాలర్ల విలువైన దేశీయ టెక్నాలజీ పరిశ్రమను, దానిపై ఆధార పడిన లక్షలాది ఉద్యోగాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం పక్కా వ్యూహంతో ముందుకు వెళుతున్నట్లు కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ఐటీ ఉద్యోగుల భవిష్యత్తుకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన భరోసా ఇచ్చారు. అమెరికాలోని ట్రంప్ మద్దతుదారులు 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా)' నినాదంతో అవుట్‌సోర్సింగ్‌కు వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. దీనిపై కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ స్పందించారు. భారత్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు అంటే జీసీసీలు, భారీ సేవా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బహుళజాతి సంస్థలతో మేం నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. అదే సమయంలో అమెరికా, యూరప్, జపాన్, ఆగ్నేయాసియా దేశాల ప్రభుత్వాలతోనూ చర్చిస్తున్నాం. అత్యున్నత నాణ్యతతో కూడిన ఉపాధిని అందిస్తున్న ఈ కీలక పరిశ్రమ చెక్కుచెదరకుండా, మరింత వృద్ధి చెందేలా చూడటమే మా లక్ష్యమని ఆయన వివరించారు. ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో చేసిన వ్యాఖ్యలు ఈ ఆందోళనలకు మరింత ఆజ్యం పోశాయి.

విదేశీ రిమోట్ వర్కర్లపై టారిఫ్‌లు (పన్నులు) విధించాలని, అమెరికాకు రిమోట్‌గా సేవలు అందించే దేశాలు కూడా వస్తువుల మాదిరిగానే పన్నులు చెల్లించాలని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఇది నేరుగా భారతదేశ విదేశీ మారకద్రవ్య ఆర్జనపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. భారత ఐటీ సేవల రంగంలో ప్రస్తుతం 56 లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. దేశ ఎగుమతి ఆదాయంలో ఈ రంగం వాటా చాలా కీలకం. అయితే, కేవలం సేవల ఎగుమతులపైనే ఆధారపడకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను కూడా బలోపేతం చేస్తోందని మంత్రి వైష్ణవ్ తెలిపారు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని శక్తిమంతం చేస్తున్నాం. స్మార్ట్‌ఫోన్ల తయారీలో మన వాటా గణనీయంగా పెరిగింది. ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన అన్ని పరికరాలను ఒక్కొక్కటిగా దేశంలోనే తయారు చేసేలా సరఫరా గొలుసును స్థానికీకరిస్తున్నామని ఆయన అన్నారు. ప్రస్తుతం ఉన్న ఐటీ ఉద్యోగాలను కాపాడుకుంటూనే, దేశంలోని నైపుణ్యం కలిగిన యువతకు తయారీ రంగంలో కొత్త అవకాశాలు సృష్టించడమే తమ ద్వంద్వ వ్యూహమని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ ఐటీ పరిశ్రమల సంస్థ నాస్కామ్ అంచనాల ప్రకారం, ఈ ఆర్థిక సంవత్సరంలో భారత టెక్నాలజీ రంగం 5.1 శాతం వృద్ధితో 282.6 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించనుంది. 2026 ఆర్థిక సంవత్సరం నాటికి ఇది 300 బిలియన్ డాలర్ల మైలురాయిని దాటుతుందని అంచనా. ఈ రంగంలో కొత్తగా 1.26 లక్షల ఉద్యోగాలు కూడా రానున్నాయని నాస్కామ్ తన నివేదికలో పేర్కొంది.

# వెనెజులాపై యుద్ధానికి ట్రంప్ రెడీ..



## భారీగా యుద్ధనౌకలు, ఫైటర్ జెట్ల మోహరింపు

**వాషింగ్టన్, సెప్టెంబరు 7:** తాను ఏడు యుద్ధాలను ఆపానని పదేపదే చెప్పుకొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ఓ కొత్త యుద్ధానికి తెరతీశారు. ఆ మేరకు కరేబియన్ సముద్రంలో భారీ యుద్ధనౌకలు, జలాంతరాములు, అత్యాయుధునిక ఫైటర్ జెట్‌లను మోహరించారు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న వెనెజులా చుట్టూ ఇవి సమయం కోసం ఎదురుచూస్తూ కాచుకు కూర్చున్నాయి. దాంతో కరేబియన్ జలాలపై యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఏ క్షణమైనా అమెరికా దళాలు వెనెజులాలో చొరబడవచ్చని ప్రచారం జరుగుతోంది. వెనెజులా ముఠాల నుంచి మాదకద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ చాలాకాలంగా చెబుతూ వస్తున్నారు. ఇప్పుడు ఆ ముఠాలను అంతం చేసేందుకు సైనికదళాలను రంగంలోకి దింపారు. మాదకద్రవ్యాల ముఠాలతో వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం తీవ్ర ఆరోపణలు చేస్తోంది. అతడిని పట్టించే సమాచారం ఇస్తే ఏకంగా 50 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 430కోట్లు) బహుమతిగా ఇస్తామని ప్రకటించింది. అంతేగాక మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని ట్రంప్ స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు.

# ఆస్తి తగాదాలో మహిళను చెట్టుకు కట్టేసి దాడి



**కడలూరు, సెప్టెంబరు 7:** తమిళనాడులో సభ్యసమాజం తలదించుకునే దారుణ ఘటన చోటుచేసుకుంది. భూవివాదం కారణంగా ఓ మహిళను నలుగురు మహిళలు కలిసి చెట్టుకు కట్టేసి, విచక్షణా రహితంగా దాడి చేశారు. ఆమెను పాక్షికంగా వివస్త్రను చేసి తీవ్రంగా అవమానించారు. కడలూరు జిల్లా పన్రుటి సమీపంలో జరిగిన ఈ అమానుష ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధితురాలికి, నిందితులకు మధ్య కొంతకాలంగా భూవివాదం నడుస్తోంది. ఇదే కక్షతో నలుగురు మహిళలు ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితులలో ఒక మహిళను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్టు ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. ప్రాథమిక విచారణలో భూవివాదమే ఈ దాడికి కారణంగా తెలుస్తోంది. కులం కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన 2.13 నిమిషాల నిడివి గల వీడియోలో అత్యంత దారుణమైన దృశ్యాలు ఉన్నాయి. బాధితురాలిని ఆమె చీరతోనే చెట్టుకు కట్టేసి, నలుగురు మహిళలు చుట్టుముట్టారు. ఒకరు కర్రతో కొడుతుండగా, మరొకరు ఆమె జుట్టు పట్టుకుని లాగుతూ దూషించారు. నువ్వు ఓ కుక్కతో సమానం అంటూ దారుణంగా మాట్లాడారు. ఆమె బ్లౌజ్‌ను పాక్షికంగా తొలగించి అవమానించే ప్రయత్నం చేశారు. బాధితురాలు వారి నుంచి తప్పించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించడం వీడియోలో కనిపించింది. ఆశ్చర్యకరంగా, అక్కడే ఉన్న మరో మహిళ ఈ దాడినంతా వీడియో తీస్తుండగా, మీరంతా జైలుకు వెళ్తారని హెచ్చరించినా నిందితులు ఏమాత్రం లెక్కచేయలేదు. దాడి తీవ్రరూపం దాల్చడంతో మధ్యలో మరో మహిళ కల్పించుకుని వారిని ఆపేందుకు ప్రయత్నించడం కూడా వీడియోలో రికార్డయింది. ఈ ఘటనపై స్థానికంగా తీవ్ర కలకలం రేగగా, పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# పిఎంవో ఎంత బలహీనంగా ఉందో మన్మోహన్ ట్వీట్ నిదర్శనం

## బిజెపి ఐటి-ఛీఫ్ అమిత్ మాలవీయ ధ్వజం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** పన్నెండేళ్ల నాటి ఒక సోషల్ మీడియా పోస్ట్‌ను ఆధారంగా చేసుకుని బిజెపి కాంగ్రెస్ పార్టీపై ఆదివారం తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అధికారిక ఖాతా నుంచి వచ్చిన ఆ పోస్ట్, అప్పటి యూపీఏ ప్రభుత్వంలో ప్రధాని కార్యాలయం (పీఎంవో) ఎంత బలహీనంగా ఉండేదో చెప్పడానికి నిదర్శనమని బీజేపీ ఆరోపించింది. బిజెపి ఐటీ విభాగం అధిపతి అమిత్ మాలవీయ ఈ విషయంపై 'ఎక్స్' వేదికగా స్పందించారు. 2013 సెప్టెంబర్ 7న ప్రధాని కార్యాలయం చేసిన పోస్ట్‌ను ఆయన ట్యాగ్ చేశారు. అప్పటికి, ఇప్పటికీ ఇదే తేడా అంటూ తన విమర్శలకు పదును పెట్టారు. అప్పట్లో దేశ పరిస్థితి ఎలా ఉండేదంటే, స్వయంగా ప్రధాన మంత్రి కార్యాలయం కూడా కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ వైఫల్యాలను, గందరగోళాన్ని బయటపెట్టేలా పోస్టులు చేయాల్సి వచ్చిందని ఆయన అన్నారు. 2013లో మన్మోహన్ సింగ్ కార్యాలయం నుంచి వెలువడిన ఆ పోస్ట్‌లో, మిస్టర్ రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేయడానికి నేను సంతోషిస్తాను పీఎం అని ఉంది. ఈ పోస్ట్‌ను ఉటంకిస్తూ మాలవీయ, ఒక దేశ ప్రధాని కార్యాలయం అధికారిక ఖాతా నుంచి ఇలాంటి సందేశాలు పోస్ట్ చేయాల్సి వచ్చిందంటే, క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎంత దారుణంగా ఉండేవో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. యూపీఏ హయాంలో ప్రభుత్వ పాలనలో పార్టీ జోక్యం ఏ స్థాయిలో ఉండేదో, పీఎంవో వనరులను పార్టీ వ్యవహారాలకు ఎలా దుర్వినియోగం చేశారో దీని ద్వారా తెలుస్తోందని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పీఎంవో నిర్ణయాధికారంలో ఎంతో స్పష్టత, పటిష్టత ఉన్నాయని, యూపీఏ హయాంలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉండేవని మాలవీయ పోల్చి చెప్పారు. కాగా, ప్రధాని నరేంద్ర మోదీ సైతం పాల్గొన్న బిజెపి ఎంపీల వర్క్‌షాప్ పార్లమెంట్ ప్రాంగణంలో జరుగుతున్న తరుణంలో అమిత్ మాలవీయ ఈ విమర్శలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# 60 శాతం ఆయుధాలు మావే

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ



**కీవ్, సెప్టెంబరు 7:** మూడేళ్లుగా రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉపయోగిస్తున్న ఆయుధాల్లో 60శాతం తమ దేశంలో ఉత్పత్తి చేసినవేనని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. ఇతర దేశాల నుంచి ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్నప్పటికీ స్వదేశీ ఉత్పత్తులపైనే ఎక్కువగా దృష్టి పెట్టామన్నారు. ఓ వైపు సంఘర్షణలు కొనసాగుతున్నప్పటికీ కీవ్ బలమైన, అత్యాధునిక ఆయుధాలను తయారుచేసే స్థాయికి ఎదగడం గర్వకారణమని చెప్పారు. అయితే తాము సాధించాల్సిన లక్ష్యాలు ఇంకా ఉన్నాయని జెలెన్‌స్కీ అన్నారు. ప్రస్తుతం గగనతల రక్షణ వ్యవస్థల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఇటీవల గగనతల రక్షణ వ్యవస్థలతోపాటు రెండు కొత్త బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేసినట్లు కీవ్ వర్గాలు తెలిపాయి. విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 2025 బడ్జెట్‌లో ఉక్రెయిన్ సర్కారు భారీ కేటాయింపులు చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే చైనా పర్యటన తర్వాత రష్యా అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ యుద్ధం ముగింపుపై చర్చలు జరపడానికి మాస్కోకు రావాలని జెలెన్‌స్కీను ఆహ్వానించారు. దీనిపై జెలెన్‌స్కీ స్పందిస్తూ యుద్ధం ముగింపు కోసం ఓ నిర్ణయం తీసుకోవాలనే ఆలోచన పుతిన్‌కు ఉంటే ఆయనే కీవ్‌కు రావాలన్నారు.

# జపాన్ ప్రధానమంత్రి షిగెరు ఇషిబా రాజీనామా



**టోక్యో, సెప్టెంబరు 7:** జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలో అంతర్గత విభేదాలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జూలైలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి బాధ్యత వహించాలంటూ సొంతపార్టీ నేతల నుంచి ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఇషిబా నుంచి ఈ ప్రకటన వెలువడింది. అంతకుముందు దిగువ సభలోనూ మెజార్టీ కోల్పోయింది. దీంతో స్వపక్ష సభ్యుల నుంచి ప్రధానిపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వ మార్పు కోసం ముందస్తు ఎన్నికలు నిర్వహించాలా?వద్దా? అనే అంశంపై చర్చించేం దుకు లిబరల్ డెమోక్రటిక్ పార్టీ సెప్టెంబరు 8న నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైంది. దీనికి ఆమోదం పొందితే ప్రధానిపై వర్చువల్ అవిశ్వాసతీర్మానం పెట్టే అవకాశం ఉంది. ఈనేపథ్యంలోనే మీడియా సమావేశం నిర్వహించిన ఇషిబా రాజీనామా ప్రకటించారు.

# ఇంకెన్నాళ్లు బీహార్ ప్రజలను మోసం చేస్తారు రాహుల్!

## విపక్షనేత పై కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ ధ్వజం

**పాట్నా, సెప్టెంబరు 7:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జాతీయ చిహ్నమైన అశోక చక్రం ఉన్న ఫలకాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేసిన ఘటనపై స్పందిస్తూ దేశంలో అస్థిరతకు, అగౌరవానికి రాహుల్ గాంధీ కారణమవుతున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ చెప్పినట్టు దేశం నడిస్తే అది కుప్పకూలిపోతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ నుంచి కశ్మీర్ వరకు దేశాన్ని అగౌరవపరిచేలా రాహుల్ వ్యవహరిస్తున్నారని గిరిరాజ్ సింగ్ మండిపడ్డారు. పాత రాజకీయ వివాదాలను కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తేజస్వి యాదవ్, లాలూ యాదవ్‌లను అడుగుతున్నా, బీహార్‌ను ఇంకెన్నిసార్లు అవమానిస్తారు స్టాలిన్‌ను పిలిపించి తిట్టించారు. బీహార్ డీఎన్‌ఏను అవమానించిన రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఇప్పుడు కశ్మీర్‌లో ఏం జరిపించారు అని రాహుల్‌ను ఉద్దేశించి నిలదీశారు. శ్రీనగర్‌లోని హజరత్‌బల్ దర్గాలో జమ్మూకశ్మీర్ వక్ఫ్ బోర్డు చేపట్టిన పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ ఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో ఈ వివాదం చెలరేగింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో జమ్మూకశ్మీర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ అశోక స్తంభం కేవలం బీహార్‌కు చెందిన అశోక చక్రవర్తి స్తంభం మాత్రమే కాదు. దానిని మన రాజ్యాంగం స్వీకరించింది, యావత్ దేశం దాన్ని గౌరవిస్తోందని నొక్కిచెప్పారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి దేశాన్ని అవమానిస్తుంటే, ప్రధాని మోదీ మాత్రం పేదలు, మధ్యతరగతి ప్రజల గురించి ఆలోచిస్తున్నారని అన్నారు. 27 కోట్ల మంది పేదలను దారిద్ర్యరేఖ నుంచి పైకి తీసుకువచ్చారని, జీఎస్టీని సులభతరం చేసి పండుగ వేళ పేద కుటుంబాలకు మేలు చేశారని గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు.

# డ్రగ్స్‌కేసులో కటకటాలపాలయిన బ్రిటన్ లా విద్యార్థిని



**దుబాయి, సెప్టెంబరు 7:** ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన ఓ యువతి జీవితం ఒక్క పొరపాటుతో తలకిందులైంది. చట్టాలపై పట్టు సాధించాల్సిన లా విద్యార్థినే చట్టాలను ఉల్లంఘించి కటకటాలపాలైంది. డ్రగ్స్ కేసులో పట్టుబడిన 23 ఏళ్ల బ్రిటిష్ విద్యార్థిని మియా ఒబ్రెయిన్‌కు దుబాయ్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ప్రస్తుతం ఆమె దుబాయ్ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తోంది. లివర్‌పూల్‌కు చెందిన మియా ఒబ్రెయిన్ న్యాయశాస్త్రంలో విద్యనభ్యసిస్తోంది. గతేడాది అక్టోబర్‌లో ఆమె దుబాయ్‌లో అరెస్ట్ అయింది. అప్పటి నుంచి తన కుమార్తెను చూడలేదని ఆమె తల్లి డేనియల్ మెకెన్నా (46) కన్నీటిపర్యంతమవుతున్నారు. నా కుమార్తె తన జీవితంలో ఎప్పుడూ ఎలాంటి తప్పు చేయలేదు. దురదృష్టవశాత్తు కొందరు తప్పుడు స్నేహితులతో కలిసి ఓ తెలివి తక్కువ పని చేసింది. ఇప్పుడు దానికి భారీ మూల్యం చెల్లించుకుంటోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఆమె కుటుంబం నేరం వివరాలను వెల్లడించనప్పటికీ మియా వద్ద 50 గ్రాముల క్లాస్ ఏ డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు 2,500 పౌండ్లు (భారత కరెన్సీలో దాదాపు రూ. 3 లక్షలు)ఉంటుందని అంచనా. మియాకు సహాయం చేసేందుకు ఆమె తల్లి 'గోఫండ్‌మీ' ద్వారా నిధులసేకరణ ప్రారంభించినా, ఆ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో దాన్ని తొలగించారు. కొన్నిరకాల తీవ్రమైన నేరాలకు న్యాయ సహాయం కోసం నిధులు సేకరించడాన్ని తమ నిబంధనలు అంగీకరించవని గోఫండ్‌మీ ప్రతినిధి స్పష్టం చేశారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అమలయ్యే కఠినమైన చట్టాల ప్రకారం జీవిత ఖైదు అంటే 15 నుంచి 25 ఏళ్ల వరకు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. డ్రగ్స్ అక్రమ రవాణా, హత్య,మానవ అక్రమరవాణా, ఉగ్రవాద కార్యకలాపాలు వంటి తీవ్రమైన నేరాలకు అక్కడ ఇలాంటి కఠిన శిక్షలు విధిస్తారు.

# భారత్‌పై నవారో వ్యాఖ్యలకు 'ఎక్స్' ఫ్యాక్ట్ చెక్..

**వాషింగ్టన్, సెప్టెంబరు 7:** భారత్‌పై తరచూ తీవ్ర విమర్శలు చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సీనియర్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారోకు ఎలాన్‌మస్క్ సోషల్‌మీడియా ఎక్స్ గట్టి షాకిచ్చింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ భారత్ లాభాలు గడిస్తోందని నవారో చేసిన ఆరోపణలు ద్వంద్వ నీతికి నిదర్శనమని పేర్కొంటూ, ఆయన పోస్ట్‌కు ఒక ఫ్యాక్ట్ చెక్ నోట్‌ను జోడించింది. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి చేసుకోవడాన్ని తప్పు బడుతూ నవారో ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. భారత్ విధిస్తున్న అధిక సుంకాల వల్ల అమెరికా ఉద్యోగాలు కోల్పోతోంది. కేవలం లాభం కోసమే భారత్ రష్యా నుంచి చమురు కొంటోంది. ఆ డబ్బుతో రష్యా యుద్ధాన్ని ప్రోత్సహిస్తోంది. భారత్ నిజాలను జీర్ణించుకోలేకపోతోందని ఆయన ఆరోపించారు. అయితే, ఈ పోస్ట్‌కు ఎక్స్ సంస్థ కమ్యూనిటీ నోట్ రూపంలో ఒక ఫ్యాక్ట్ చెక్‌ను జతచేసింది. భారత్ తన ఇంధన భద్రత కోసమే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ఇది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడం కాదు. మరోవైపు, అమెరికా కూడా రష్యా నుంచి యురేనియంవంటి వస్తువులను దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో భారత్‌ను విమర్శించడం ద్వంద్వ నీతి అవుతుందని ఆ నోట్‌లో స్పష్టం చేసింది. ఈ అనూహ్య పరిణామంతో నవారో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఒక పనికిమాలిన నోట్‌అని, ప్రజల పోస్టుల్లో ఇలాంటి ప్రచారానికి ఎలాన్ మస్క్ ఎలా అనుమతిస్తున్నారని మండిపడ్డారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుండటంతో ప్రతీకారంగా ట్రంప్ సర్కార్ ఇటీవల భారత ఎగుమతులపై 50 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నవారో భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఇది మోదీ యుద్ధమని, భారత్ టారిఫ్‌ల మహారాజ్ అని వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. ఈ సుంకాల వివాదం కారణంగా భారత్-అమెరికా సంబంధాల్లో కొంత ఉద్రిక్తత నెలకొంది. అయితే, ప్రధాని మోదీతో తనకు మంచి స్నేహముందని, ఇరుదేశాల మధ్య ప్రత్యేక బంధముందని ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. దీనికి ప్రధాని మోదీ కూడా స్పందించడంతో సంబంధాలు తిరిగి గాడినపడతాయని అందరూ భావిస్తున్న తరుణంలో నవారో వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి.

# పదేళ్లుగా ఓట్ల చోరులను కాపాడుతున్న ఇసి: మల్లిఖార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** పదేళ్లుగా భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) ఓట్ల చోరులను పరిరక్షిస్తోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పదేళ్లుగా ఈసీ ఓట్ల చోరులను కాపాడుతూ వస్తోందని, కీలక సమాచారాన్ని దాచి పెట్టిందని ఆరోపించారు. 2023లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు జాబితా నుంచి ఓట్లను తొలగించడానికి చేసిన యత్నానికి సంబంధించిన కీలక డేటాను ఇప్పటికీ ఎన్నికల సంఘం బయటపెట్టలేదన్నారు. మే 2023 కర్ణాటక ఎన్నికలకు ముందు అలంద్ నియోజకవర్గంలో ఓటర్లను తొలగించాలని చేసిన ప్రయత్నాలను తమ పార్టీ బయటపెట్టిందని ఖర్గే చెప్పారు. అప్పట్లో దీనివల్ల వేలమంది ఓటర్లు తమ ఓటు హక్కులు కోల్పోయారన్నారు. ఓటర్లను మోసం చేయడానికి జరిగిన భారీ ప్రయత్నానికి స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నప్పటికీ కీలక విషయాలను దాచిపెట్టి, ఓట్ల చోరీ వెనక ఉన్న వారిని ఈసీ సమర్థంగా రక్షించిందన్నారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారిని కాపాడటమే లక్ష్యంగా ఈసీ పదేళ్లుగా పని చేస్తోందని ఖర్గే చెప్పారు. అందుకు చట్టాలను మార్చడానికి కూడా వెనకాడట్లేదని విమర్శించారు. నాడు కర్ణాటకలో చేసిన విధంగా ప్రస్తుతం బీహార్‌లోనూ ఓట్ల చోరీకి పాల్పడేందుకు కేంద్రం, ఈసీ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు.

# దక్షిణకొరియా వేదికగా ట్రంప్, జిన్‌పింగ్‌ల భేటీకి రంగం సిద్ధం



**సియోల, సెప్టెంబరు 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య మరో కీలక భేటీకి రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్‌లో దక్షిణ కొరియా లో జరగనున్న ఆసియాపసిఫిక్ ఆర్థిక సహకార (ఏపీఈసీ) సదస్సులో పాల్గొనేందుకు ట్రంప్, ఆయన ఉన్నతాధికారులు రహస్యంగా సన్నాహాలు చేస్తున్నారని అమెరికా అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటనలో భాగంగా జిన్‌పింగ్‌తో ట్రంప్ సమావేశమయ్యే అవకాశాలు న్నాయి. దక్షిణ కొరియాలోని గ్యాంగ్‌ఝూ నగరంలో అక్టోబర్ చివరి వారం నుంచి నవంబర్ మొదటి వారం మధ్య ఈ ఏపీఈసీ సదస్సు జరగనుంది. ఈ సదస్సు వేదికగా ఇరువురు నేతల మధ్య ద్వైపాక్షిక సమావేశంపై తీవ్రస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, అయితే ప్రణాళికలు ఇంకా ఖరారు కాలేదని ట్రంప్ పరిపాలన వర్గాలు తెలిపాయి. గత నెలలో జిన్‌పింగ్ ఫోన్‌లో ట్రంప్‌ను చైనా పర్యటనకు ఆహ్వానించగా, ట్రంప్ కూడా సానుకూలంగా స్పందించారు. అయితే పర్యటన తేదీలు ఖరారు కాలేదు. ఈ పర్యటనలో ట్రంప్ కేవలం జిన్‌పింగ్‌తోనే కాకుండా, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో కూడా సమావేశమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతవారం ట్రంప్‌తో సమావేశమైన దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్, ఏపీఈసీ సదస్సుకు హాజరు కావాలని ఆహ్వానించారు. కిమ్‌తో సమావేశానికి ఇది మంచి అవకాశమని కూడా ఆయన సూచించినట్లు సమాచారం. దీనిపై స్పందించిన ట్రంప్, కిమ్‌తో భేటీకి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఆయన నన్ను కలవాలనుకుంటున్నారు. మేం కలుస్తాం, సంబంధాలు మెరుగుపరుస్తాం అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇటీవల చైనా, రష్యా, భారత అధినేతలు బీజింగ్‌లో సమావేశమవడంపై ట్రంప్ తీవ్ర విమర్శలు గుప్పించిన నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. చైనా సైనిక పరేడ్ సందర్భంగా జిన్‌పింగ్, పుతిన్, మోదీ భేటీ కావడంపై ట్రంప్ సోషల్ మీడియాలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## సంక్షిప్తంగా..

### అమెరికా లోకల్ రైలులో మహిళ దారుణ హత్య



**వాషింగ్టన్, సెప్టెంబరు 7:** రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో భయాందోళనల మధ్య బతకలేక అమెరికాకు వలస వచ్చిందో మహిళ ప్రాణాలు కాపాడుకోవడానికి వలస వచ్చిన సదరు మహిళ అమెరికాలో దారుణ హత్యకు గురైంది. లోకల్ రైలులో ప్రయాణిస్తుండగా ఓ దుండగుడు కత్తితో దాడి చేయడంతో ప్రాణాలు కోల్పోయింది. ఈ హత్యకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. గత నెలాఖరులో జరిగిన ఈ దారుణం తాజాగా వెలుగులోకి వచ్చింది. రష్యా దాడుల నేపథ్యంలో నిత్యం భయంభయంగా గడపలేక ఉక్రెయిన్ మహిళ ఇరినా జరుత్స్కను అమెరికాకు వలస వచ్చింది. నార్త్ కరోలినాలో ప్రశాంతమైన జీవితం గడుపుతోంది. ఈ క్రమంలోనే గత నెల 22న షార్లెట్ లో లోకల్ రైలులో ప్రయాణిస్తుండగా ఓ దుండగుడు ఆమెపై దాడి చేశాడు. రైలులో ఇరినా వెనక సీటులో కూర్చున్న దుండగుడు. జేబులో నుంచి కత్తి తీసి ఒక్కసారిగా ఇరినాపై దాడికి పాల్పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు, రక్తస్రావంతో ఇరినా అక్కడికక్కడే చనిపోయింది.

### ఛాతీలో కత్తితో పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన స్కూలు విద్యార్థి


**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** దేశ రాజధాని ఢిల్లీలో దిగ్భ్రాంతికరమైన ఘటన చోటుచేసుకుంది. 15 ఏళ్ల పాఠశాల విద్యార్థి తన చాతీలో కత్తి దిగి ఉండగానే నడుచుకుంటూ పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడం తీవ్ర కలకలం రేపింది. పాత పగ నేపథ్యంలో అతడి స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులే ఈ దాడికి పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు. సెంట్రల్ ఢిల్లీలోని ఓ పాఠశాలలో చదువుతున్న 15 ఏళ్ల బాలుడు పహార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. అతడి చాతీలో కత్తి దిగి ఉండటం చూసి పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. పాఠశాల గేటు వద్ద తన ముగ్గురు స్నేహితులు తనపై దాడి చేసి కత్తితో పొడిచారని బాధితుడు పోలీసులకు తెలిపాడు. దీంతో పోలీసులు అతడిని వెంటనే తొలుత కళావతి శరణ్ ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు శస్త్రచికిత్స చేసి కత్తిని తొలగించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు దాడి జరిగిన మరుసటి రోజు సాయంత్రం ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

### గోశాలగా మారిన పోలీస్ స్టేషన్



**రాంచి, సెప్టెంబరు 7:** జార్ఖండ్‌లోని ఓ పోలీస్ స్టేషన్ రెండు రోజుల పాటు గోశాలగా మారిపోయింది. అక్రమ రవాణా ఆరోపణలతో పట్టుకున్న సుమారు 200 పశువులను ఉంచేందుకు మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో పోలీసులు వాటిని స్టేషన్ ఆవరణలోనే కట్టేశారు. ఈ అనూహ్య ఘటన గర్వా జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పశువులను అక్రమంగా తరలిస్తున్నారంటూ భజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షుడు సోను సింగ్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సుమారు 170 నుంచి 200 పశువులను స్వాధీనం చేసుకున్నారు. అయితే, వాటిని ఉంచడానికి తక్షణమే గోశాల అందుబాటులో లేకపోవడంతో వాటిని పోలీస్ స్టేషన్ ప్రాంగణానికే తరలించారు. శుక్రవారం రాత్రి వరకు ఆ పశువులు అక్కడే ఉన్నాయి. ఈ ఘటనపై భజరంగ్ దళ్ నేత సోను సింగ్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుంచి ఈ పశువులను వధశాలల కోసం అక్రమంగా తరలిస్తున్నారు. స్మగ్లర్లు మాపై, పోలీసులపై దాడి చేసేందుకు కూడా ప్రయత్నించారు. ఈ వ్యవహారం వెనుక పెద్ద వ్యక్తులు ఉన్నారని ఆరోపించారు.

### మధ్యప్రదేశ్ పిసిసి చీఫ్ ఇంట్లో చోరీ



**భోపాల్, సెప్టెంబరు 7:** మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు (పీసీసీ చీఫ్) జీతూ పట్వారీ ఇంట్లో జరిగిన చోరీ ఘటన రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టించింది. ఇండోర్ రాజేంద్ర నగర్‌లోని బిజల్‌పూర్ కాలనీలో ఉన్న ఆయన నివాసంలోకి ఆరుగురి కంటే ఎక్కువ మంది దొంగలు చొరబడి బీభత్సం సృష్టించారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరగడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చోరులు చాలా వ్యూహాత్మకంగా మొదటగా ఆ ఇంటికి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఆ తర్వాత బయట ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం ఇంట్లోఉన్న కార్యాలయంలోకి వెళ్లిఅక్కడి డ్రాలు, లాకర్లను పగలగొట్టారు. అయితే ఈ చోరీ వెనుక ఉన్న ఉద్దేశంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దొంగలు ఇంట్లో ఉన్న మొబైల్ ఫోన్లు, ఇతర విలువైన వస్తువులను వదిలి పెట్టి కొన్ని సాధారణ వసువులను మాత్రమే తీసుకువెళ్లారు. దీంతో కుటుంబ సభ్యులు సహా పోలీసులు అంతా షాక్ అవుతున్నారు.

# విజయవాడలో గాంధీ శిల్ప్ బజార్: లేపాక్షి హస్తకళల ప్రదర్శన



**విజయవాడ, సెప్టెంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ హస్తకళల వైభవాన్ని ప్రతిబింబించేలా గాంధీ శిల్ప్ బజార్, లేపాక్షి హస్తకళల డిజైన్ పోటీ ప్రదర్శన విజయవాడలో సెప్టెంబర్ 8 నుండి 14 వరకు అమ్మ కల్యాణ మండపంలో జరగనుంది. ఈ వారాంతపు మహోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, హస్తకళల అభివృద్ధి కమిషనర్ భారత ప్రభుత్వ వస్త్ర మంత్రిత్వ శాఖ, లేపాక్షి సంయిక్త సహకారంతో నిర్వహిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న దాదాపు నలభై మంది నిపుణ శిల్పులు, వృత్తిదారులు తమ హస్తకళలతో ఈ ప్రదర్శనలో పాల్గొననున్నారు. కలప చెక్క వస్తువులు, క్రోషే లేసు, తంజావూరు చిత్రాలు, తోలుబొమ్మలు, రగ్గులు, కృత్రిమ నగలు వంటి సంప్రదాయ కళావస్తువులు ఈ బజార్‌లో ఆకట్టుకోనున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కి చెందిన కళాకారులు తమ ప్రత్యేక హస్తకళలతో సందర్శకులను అలరించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా కళాకారులకు అమ్మకాలు పెరగడంతో పాటు యువతరానికి భారతీయ కళా వారసత్వం పరిచయం కానుంది. ఈ వేడుకలో భాగంగా లేపాక్షి హస్తకళల డిజైన్ పోటీ ప్రదర్శన కూడా జరుగుతుంది. ఇందులో కొండపల్లి బొమ్మలు, ఎటికొప్పాక బొమ్మలు, కలప చెక్క వస్తువులు, తోలుబొమ్మలు, కలంకారి ముద్రణ వంటి ఐదు విభాగాలలోని సృజనాత్మక కృతులు ప్రదర్శించబడతాయి. నిపుణుల కమిటీ ద్వారా ఉత్తమ కృతులను ఎంపిక చేసి బంగారు, వెండి, కాంస్య పతకాలు ప్రదానం చేస్తారు. అంతేకాకుండా, మొత్తం రూ. 2.5 లక్షల నగదు బహుమతులు కూడా విజేతలకు అందజేయబడతాయి.

సందర్శకులు తమకు నచ్చిన కృతులకు ప్రత్యేకంగా ఓటు వేసే అవకాశం ఉండటంతో పోటీ మరింత ఉత్సాహంగా సాగనుంది. ప్రదర్శన ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు, ఆదివారాలు, ప్రభుత్వ సెలవులు సహా అందరికీ అందుబాటులో ఉంటుంది. సెప్టెంబర్ 8వ తేదీ సాయంత్రం 5గంటలకు ప్రముఖుల సమక్షంలో దీపప్రజ్వలనతో ప్రారంభోత్సవం జరగనుండగా, సెప్టెంబర్ 12వ తేదీ సాయంత్రం 5గంటలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షులు మరియు మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్ మాట్లాడుతూ గాంధీ శిల్ప్ బజార్, లేపాక్షి హస్తకళల డిజైన్ పోటీలు మన సాంస్కృతిక గౌరవాన్ని ప్రతిబింబించే వేదికలు. ఇవి కళాకారుల ప్రతిభను ప్రజలకు చాటడమే కాకుండా మార్కెట్ అవకాశాలను కల్పిస్తాయి. విజయవాడ ప్రజలు తప్పక ఈ ప్రదర్శనకు హాజరై కళాకారులను ప్రోత్సహించి, ఆంధ్రప్రదేశ్ హస్తకళల సంపదను కొనసాగించాలి" అని తెలిపారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయానికి పోటెత్తిన భక్త జనం



**శ్రీకాళహస్తి,సెప్టెంబరు 8 ప్రభాతవార్త:** సాదారణంగా గ్రహణ సమయాల్లో దేవాలయాలను మూసివేయటం గ్రహణం వీడిన తరువాత శుద్ధి చేసి అభిషేకాలు, అలంకారాలు నిర్వహించటం ఆనవాయితి. అయితే నవగ్రహాలు, 27 నక్షత్రాలను తన అలంకారకవచంలో పొందుపరచుకున్న స్వయంభువు వాయులింగేశ్వరుని సన్నిధిలో 'గ్రహణ సమయంలో' శాంతి అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. అయితే ఈ అభిషేకాలకు అంచనాలకు మించిన రద్దీ ఏర్పడుతుంది. ఎన్ని సార్లు శాంతి అభిషేకాలు నిర్వహిస్తున్నా ఆలయాధికారుల్లో మార్పు లేదు. ముందు జాగ్రత్త లేదు. విఐపిల దర్శనాలకు ఇస్తున్న ప్రధాన్యత సామాన్య భక్తుల దర్శనాలకు ఇవ్వటం లేదు.

**విభిన్న సంప్రదాయం:** 'గ్రహణాల సందర్భంగా దేవాలయాలను మూసివేయటం గ్రహణం వీడిన తరువాత శుద్ధి చేయటం, పూజలు నిర్వహించటం ఆనవాయితి. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో భిన్న రీతిలో ఆచార వ్యవహారాలుంటాయి. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తులు, విఐపిలతో కిట కిట లాడింది. దాంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. అధికారులు ముందుగానే భక్తుల రద్దీని పరిగణలోకి తీసుకొని ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం ఆలయానికి భక్తుల తాకిడి పరిమితంగా ఉంటుంది. మధ్యాహ్నం రాహుకాల సమయంలో మాత్రం రద్దీ ఉంటుంది. అలాంటిది ఆదివారం గ్రహణం సందర్భంగా భక్తులు పోటేత్తారు. వేలాది మంది హాజరు కాగా పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. చంద్రగ్రహణం రాత్రి వేళల్లో రావటంతో మధ్యాహ్నం నుంచి జిల్లాలోని ఆలయాలన్ని మూసివేయటంతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి భక్తులు, విఐపిలు పోటేత్తారు. ఓ వైపు గ్రహణం మరో వైపు పవిత్రోత్సవాల ముగింపుతో ఆలయం కిట కిట లాడి ంది. ఉదయం నుంచి ఆలయంలో పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా ఆర్జిత సేవలు రద్దు చేసారు. వచ్చిన భక్తులు దర్శనానికి పోటెత్తారు. ఆలయం భక్తి భావంతో పునీతమైంది.

**గ్రహణ కాల శాంతాభిషేకం:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే గ్రహణ కాలాభిషేకను శాంతి అభిషేకంగా నిర్వహించిన్నట్లు అందుకు సంబంధించిన వివరాలను ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వివరించారు. సాధారణంగా గ్రహణం సందర్భంగా ఆలయాలను మూసివేసి గ్రహణం వీడిన తరువాత ఆలయాన్ని తీసి శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి తరువాత దర్శనాలకు అనుమతించటం జరుగుతుం దన్నారు. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాత్రి 9గంటల 39 నిముషాల నుంచి సోమవారం వేకువ జాము 1.20గంటల వరకు గ్రహణంలో స్వామి అమ్మవార్లను శాంతిపజేయుటకు అభిషేకాలను నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదు కాలాల్లో అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఆలయం రాత్రి 9.30 గంటలకు మూసి వేసి రాత్రి గ్రహణ కాలంలో అర్చకులు మాత్రమే అభిషేకాలను నిర్వహించారు. అయితే గ్రహణ కాలాభిషేకం సందర్భంగా దర్శనానికి ఇఒ పై వత్తిడి వచ్చినా అనుమతించలేదు.

# మెడికల్ కాలేజీలు ప్రైవేటు నిర్ణయం వెనక్కి తీసుకోండి

## వైద్య విద్యతో రాజకీయం చేస్తున్న కూటమి

## బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ ఆగ్రహం




**పుంగనూరు సెప్టెంబరు 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని కూటమి తీసుకున్న నిర్ణయంపై బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ భగ్గుమన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, కానీ నిధులు ఇవ్వకుండా జాప్యం చేసిందన్నారు. రాష్ట్రంలో తామే వైద్య విద్యను ప్రోత్సహిస్తున్నామని వైసిపి సొంత డబ్బా కొట్టుకుందే తప్ప నిధులను మంజూరు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ కు చిత్తశుద్ధి ఉండి ఉంటే అధికారంలో ఉన్నప్పుడే నిధులను మంజూరు చేసి మెడికల్ కాలేజీల నిర్మాణాలను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. జగన్ అధికారంలోకి రాకముందు 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉండగా ఆయన అధికారంలోకి వచ్చాక 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి పూనుకున్నారని, వాటి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే అవి పూర్తి కాలేదన్నారు. చివరకు జగన్ హయాంలో ఆరోగ్య శ్రీ బిల్లులు కూడా పెండింగ్ లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటు పరం చేయడంతో పాటు ప్రజారోగ్యాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. జగన్ హయాంలో నిర్మించతలపెట్టిన 17 మెడికల్ కాలేజీల్లో 10 మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. వైద్య విద్యను ప్రైవేటు పరం చేస్తే ఫీజులు గణనీయంగా పెరుగుతుయాన్నారు. ప్రైవేటు సంస్థలు లాభాపేక్షతో పనిచేస్తాయన్నారు. దీని వల్ల నిరుపేద విద్యార్థులకు అవకాశాలు తగ్గుతాయని హెచ్చరించారు. ఇప్పటికే రాష్ట్రం నుంచి చాలా మండి నిరుపేద విద్యార్థులు నీట్ లో సీట్లు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకప్పుడు 2,360 సీట్లు ఉంటే ఈ కొత్త కాలేజీల వల్ల ఆ సంఖ్య 4910 కి పెరుగుతుందని దానివల్ల మరో 2500 విద్యార్థులకు మేలు జరుగుతుందున్నారు. అయితే మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు ఇవ్వడం వల్ల చాలా మంది విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. రెండు ప్రభుత్వాలు కూడా వైద్యవిద్య, ప్రజారోగ్యంతో రాజకీయాలు చేశాయని ఆయన విమర్శించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటు పరం నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోకపోతే ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతామని ఆయన హెచ్చరించారు.

# వైభవంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ: జయజయ నాదాల నడుమ భక్తులను అనుగ్రహించిన స్వామి అమ్మవార్లు



గిరి ప్రదక్షణలో అనుగ్రహిస్తున్న స్వామి అమ్మవార్లు, హైకోర్టు న్యాయమూర్తికి, బెల్లంకొండ శ్రీనివాస్‌కి దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న ఇఓ,గ్రహణం సందర్భంగా కవాట బంధనం చేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వెలసిన పవిత్ర ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఘాట్‌రోడ్డు వద్ద వున్న శ్రీ కామధేను మాత ఆలయం వద్ద పూజాదికాలు నిర్వహించిన అనంతరం భక్తుల జయజయ ధ్వానాల నడుమ ప్రారంభమైన గిరి ప్రదక్షణ విద్యాధరపురం, కామకోటినగర్, సితార, పాలఫ్యాక్టరీ, కెబిఎన్ కాలేజ్, బ్రాహ్మణ వీధుల గుండాతిరిగి ఆలయానికి చేరుకుంది. ఆలయ పిఆర్ఓ గంగాధర్ భక్తి సంకీర్తనాలాపాలు, భక్తుల నృత్య విన్యాసాలు, కోలాటాలు, భజనలు, జయజయ నాదాల నడుమ శ్రీ స్వామి అమ్మవార్ల రథం నగర వీధులగుండా గిరి ప్రదక్షణ గావించి దుర్గమ్మ ఆలయానికి చేరుకున్నాక అక్కడ ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒ వికె శీనా నాయక్, వైదిక పండితులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**వేదోక్తంగా సూర్య ఆరాధన:** దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం సందర్భంగా సూర్యఉపాసన సేవను వేదోక్తంగా నిర్వహించారు.

**గ్రహణం సందర్భంగా ఆలయం మూసివేత:** దుర్గమ్మవారి ఆయం ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 3.30 గంటలకు మూసివేశారు. సోమ వారం ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ పూర్తయిన తరువాత ఉదయం 8.30గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు.

**దుర్గమ్మవారి సేవలో ఏపి హైకోర్టు జడ్జి:** దుర్గమ్మవారిని ఏపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికిదుర్గమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోను ఇవో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**దుర్గమ్మవారి సేవలో సినీనటుడు శ్రీనివాస్:** దుర్గమ్మవారిని ఆదివారం సినీనటుడు శ్రీనివాస్ దర్శించుకున్నారు.


**నిత్యాన్నదానానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరంకు చెందిన కె సతీష్‌కుమార్, కుటుంబీకులు రు.1లక్ష విరాళాన్ని ఆదివారం అందించారు. దాతలకు దుర్గమ్మ వారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించి, వేదార్శీ వచనాలు అందించారు. దసరా ఉత్సవాలకోసం సిద్దమవుతున్న కమాండ్ కంట్రోల్‌రూంను ఇఒ వికె శీనా నాయక్ పరిశీలించారు. అక్కడ ఇరిగేషన్ అధికారులతో చర్చించి ఆలయాదికారులకు సూచనలు చేశారు.



# గంగమ్మ ఆలయానికి భూమి కొనుగోలు

**తిరుపతి రవాణా, సెప్టెంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తాతయ్య గుంట గంగమ్మ తల్లి ఆలయంకు భూమిని దాతల సాయంతో కొనుగోలు చేశారు. ఆలయంలోని వినాయకుని గుడిని ఆనుకుని ఉన్న ముప్పయ్ ఒకటిన్నర అంకనాల ప్రైవేట్ భూమిని యాభై లక్షలకు కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన అగ్రిమెంట్ ను గంగమ్మ తల్లి వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఈఓ జయకుమార్ లు ఉంచి పూజలు నిర్వహించారు. మొత్తం యాభై లక్షలకు గాను 25 లక్షల రూపాయలను అడ్వాన్స్ గా ఇచ్చారు. అడ్వాన్స్ మొత్తాన్ని రాయలసీమ విద్యాసంస్థల అధినేత లావణ్య ఆనంద్ రెడ్డి, కవిత, మనోహర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలు తలా ఐదు లక్షల వంతున అందించారు. మిగిలిన 25లక్షలను ఇచ్చేందుకు దాతలు ముందుకు వచ్చారని త్వరలోనే నగదు మొత్తం చెల్లిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆలయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ భూమిని కొన్నట్లు ఆయన చెప్పారు. ఈ స్థలం కొనుగోలులో కీలకంగా వ్యవహరించిన ఈఓ జయకుమార్ ను అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మరోముప్పయ్ అంకనాల నివాస స్థలాన్ని ఆలయానికి ఇచ్చి సహకరించాలని స్థల యజమాన్యాన్ని ఆయన కోరారు. గంగమ్మ తల్లి ఆశిస్సులతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఆయన చెప్పారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక టిటిడి నిధులు మూడు కోట్ల తొంభై లక్షల రూపాయలు ఆలయ అభివృద్ధికి వెచ్చించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, శ్యాప్ ఛైర్మన్ రవి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు మబ్బుదేవ నారాయణ రెడ్డి, పులుగోరు మురళీ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, చింతా భరణీ యాదవ్, దొడ్డారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దొడ్డారెడ్డి రామకృష్ణా రెడ్డి, రాజా రెడ్డి, గంజి సుధాకర్ రెడ్డి, వెంకటేష్, పగడాల మురళీ, ఆముదాల వెంకటేష్, ఆళ్వార్ మురళీ, కోదండ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఉదయ్ ముదిరాజ్, జానకి రామ్ రెడ్డి, బుజ్జిబాబు, రుద్ర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# రావణబ్రహ్మ వాహనంపై విహరించిన విఘ్ననాధుడు



**కాణిపాకం, సెప్టెంబరు 7 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్దానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం ఉభయదేవేరులతో పార్వతీతనయుడు గణనాధుడు రావణబ్రహ్మ వాహనంపై కాణిపాకం పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయహస్త మిచ్చాడు. ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు స్వామివారికి రావణబ్రహ్మ వాహనసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి పుణ్యాసముద్రం, లక్ష్మాంబపురం, సంతపల్లె, ద్వారకాపురం, కుర ప్పల్లె, సిద్దంపల్లె గ్రామస్థులు ఉభయదారులుగా వ్యవహ రించారు. వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణ సంభవిస్తున్న నేపథ్యంలో రాత్రి జరిగాల్సిన రావణ బ్రహ్మ వాహనసేవను ఉదయం నిర్వహించారు. ఈమేరకు సిద్ధి, బుద్ధి సమేతుడైన గణనాథుని ఉత్సవమూర్తులను అన్వేటి మండపంలో వుంచి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ధూపదీపనైవేద్యాలను సమర్పించారు. అనంతరం రంగురంగుల విద్యుద్దీపాలు, వివిధ రకాల పరిమళ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన రావణబ్రహ్మ వాహనంపై ఉభయదేవేరులతో స్వామివారు అధిరోహించి మంగళవాయిద్యాల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయహస్తం అందించారు. ఈసందర్భంగా భక్తులు నారికేళ సమర్పణలతో మొక్కులను తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓలు రవీంద్రబాబు, ప్రసాద్, ధనపాల్, హరిమాధవరెడ్డి, ధనుంజయ, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ లీలా సుధీర్‌లతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న అలంకరణలు:** రావణ బ్రహ్మ వాహన సేవ సందర్భంగా ఉత్సవ ఉభయదారులచే చేపట్టిన ప్రత్యేక అలంకరణ ఎంతో ఆకట్టుకుండి. ఆలయ ఉభయదారులచే ప్రధాన ఆలయంతో పాటు గర్భాలయం, అంత్రాలయం, అర్దమండపం, అన్వేటి మండపంలతో పాటు బంగారు ధ్వజస్థంభాన్ని వివిధ రకాల దేశీయ, విదేశి జాతి పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈఅలంకరణలు ఎంతో ఆకట్టుకున్నాయి.



## పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు

**శ్రీకాళహస్తి,సెప్టెంబరు 7 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు ఆ దివారం పూర్ణాహుతితో ముగిసాయి. సాధారణంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏడాది పాటు నిర్వహించే పూజలు, సేవలు, అభిషేకాల్లో తెలిసి తెలియక ఏవైనా పొరబాట్లు జరిగిఉంటే నివృత్తి కోసం పవిత్రోత్సవాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది పవిత్రోత్సవాలు ఇఒ డి.బాపిరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు, పౌరోహితులతోచర్చించిన మీదట ఐదురోజుల పాటు పవిత్రోత్సవాలను నిర్వహించారు. శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షి పూజలతో ప్రారంభమైన పవిత్రోత్సవాలు ఆదివారం మధ్యాహ్నం యాగశాలలో పూర్ణాహుతితో ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి అమ్మవార్ల మూల విరాట్టులతో పాటు పరివార దేవతలకు కూడా పవిత్రాలు సమర్పించారు. కాగా పూజల అనంతరం యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. పవిత్రాలను ఇఒ డి.బాపిరెడ్డి, డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దంపతులకు పవిత్రాలు సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్ టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడులు పర్యవేక్షించారు.

## సూపర్ సిక్స్ బహిరంగ సభ ఏర్పాట్లపై సమీక్షించిన మంత్రుల బృందం



అనంతపురం రహదారుల భవనాల శాఖ అతిథి గృహంలో సీఎం సభ విజయవంతం గురించి ఆదివారం రాత్రి సమీక్ష నిర్వహించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

**అనంతపురం, సెప్టెంబరు 7 ప్రభాతవార్త బ్యూరో:** ఈ నెల 10న సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ నిర్వహణకు సంబంధించి ప్రస్తుతం జరుగుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రులు, కూటమి ప్రభుత్వ నాయకులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ మరియు ముఖ్య నాయకులు స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఆదివారం సాయంత్రం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక వాణిజ్య పనులు , శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంప్ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ ,రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే దేవినేని ఉమా, సి.ఎం. పర్యటనల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, రాయదుర్గం ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటివెంకటేశ్వర ప్రసాద్, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, కళ్యాణ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ జగదీష్ , జాయింట్ కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ, రాష్ట్రకార్మికసంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, అహుడా చైర్మన్ వరుణ్, బిజెపి నాయకులు తదితరులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొనే సూపర్ సిక్స్ సూపర్ హిట్ బహిరంగ సభను విజయవంతం చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని మంత్రులు ముఖ్య నాయకులకు సూచించారు. సభ నిర్వహణకు సంబంధించిన పనులపై ప్రత్యేక దృష్టిని సారించి కార్యక్రమాన్ని విజయ్నవతం చేయాలని మంత్రులు తెలిపారు. అనంతరం విజయోత్సవ సభకు జన సమీకరణ, వసతుల ఏర్పాట్లు, సభావేదిక పనులు ,పోలీసు భద్రతా చర్యలు, పార్కింగ్ స్థలాల కేటాయింపు, సీటింగ్ సౌకర్యాలు, నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగింపు, హెలిప్యాడ్ పనులు, భోజన వసతి ఏర్పాట్లు, త్రాగునీటి సరఫరా , ట్రాఫిక్ నియంత్రణ, మీడియా సమన్వయ సహకారాలు, బారికేడ్స్ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళిక బద్ధంగా అవసరమైన మేరకు చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. అనంతరం సభ నిర్వహణ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్ల పనులకు సంబంధించి పలు విషయాలపై సూచనలు చేశారు.

# పరిటాల స్వగ్రామానికి మంత్రులు, ఎమ్మెల్యేలు

**అనంతపురం, సెప్టెంబరు 7 ప్రభాతవార్త బ్యూరో :** రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, టిడిపి రాష్ట్ర నాయకులు రాకతో పరిటాల స్వగ్రామం రామగిరి మండలం వెంకటాపురంలో సందడి వాతావరణం కనిపించింది. సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ కోసం జిల్లాకు వచ్చిన మంత్రులు.. ఆదివారం వెంకటాపురంలో పర్యటించారు. రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, రవాణా శాఖా మంత్రి మండ్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివ రావు, ఉగ్ర నరసింహా రెడ్డి, ఆనంద్ రావు, రాష్ట్ర మారీ టైం బోర్డు ఛైర్మెన్ దామాచర్ల సత్యతో పలువురు రాష్ట్ర నాయకులు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టిడిపి ఇన్చార్జి శ్రీరామ్ ఆహ్వానం మేరకు వెంకటాపురం వచ్చారు. ముందుగా వారు పరిటాల ఘాట్ వద్ద నివాళులర్పించారు. ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలను పరిశీలించారు. అనంతరం పరిటాల సునీత, శ్రీరామ్‌తో కలసి మహాలయ పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఆ తర్వాత అనంతపురం జిల్లా కేంద్రంలో ఈ నెల 10న జరగనున్న "సూపర్ సిక్స్-సూపర్ హిట్" భారీ బహిరంగ సభ విజయవంతం చేయడం గురించి సమీక్షించడంతో పాటు జిల్లా రాష్ట్ర రాజకీయాల గురించి చర్చించుకున్నారు. పరిటాల రవితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ రోజుల్లో ఆయన చేసిన రాజకీయం రాష్ట్రంలో ఎంతో మందికి ధైర్యాన్ని ఇచ్చిందని సీనియర్ నాయకులు అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు రావడంతో వెంకటాపురంలో సందడి వాతావరణం నెలకొంది. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల నుంచి నాయకులు తరలివచ్చి మంత్రులు ఎమ్మెల్యేలను కలిశారు.



రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు

8-9P□g7exHMNWJQE 11_8-9P□g7exHMNWJQE.qxd 9/7/2025 11:53 PM Page 1



# ఫేస్‌రికగ్నిషన్ యాప్‌తో పింఛన్‌దారుల సమస్యలకు చెక్

**హైదరాబాద్, సెప్టెంబరు 7, ప్రభావార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకం కింద 11 రకాల పింఛన్లు అందజేస్తోంది. అయితే చాలా మంది లబ్ధిదారులకు ఫింగర్ ప్రింట్ సరిగా పడకపోవడంతో పింఛన్లు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, కూలీలు, రైతుల వేలిముద్రలు చెరిగిపోవడంతో ధ్రువీకరణ విఫలమవుతోంది. దీంతో పింఛన్ ఆగిపోవడం వంటి సమస్యలు ఉత్పన్న మవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో కొందరు అక్రమదారులు ఇతర మార్గాల్లో పింఛన్‌దారులు సొమ్మును కాజేస్తున్న సంఘటనలు కూడా అనేకం వెలుగులోకి వచ్చాయి. ఇటువంటి సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం ఇటీవల ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను ప్రవేశపెట్టింది. అదనంగా.. కొత్తగా పోస్టుమాస్టర్లకు ఆధునిక ఫింగర్ ప్రింట్ పరికరాలు, 5జీ స్మార్ట్‌ఫోన్లను పంపిణీ చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రజల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని తెలంగాణ ప్రభుత్వం చేయూత సామాజిక భద్రతా పింఛన్ల పథకంను అమలు చేస్తోంది. ఈ పథకం లక్ష్యం ఆర్థికంగా బలహీన వర్గాలకు భరోసా ఇవ్వడం. ఒంటరి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, హెచ్ఐవీ బాధితులు, డయాలసిస్ రోగులు, గీత కార్మికులు, బీడీ కార్మికులు వంటి అనేక వర్గాలకు ఈ పింఛన్లు ఒక ఆశ్రయం లాంటివి. ప్రస్తుతం మొత్తం పదకొండు రకాల పింఛన్లు ఈ పథకం కింద అందజేస్తున్నారు.అయితే పింఛన్ దారులు డబ్బులు అందజేసే క్రమంలో వారి ఫింగర్ ప్రింట్ తీసుకునేందుకు ఇప్పటి వరకు 2జీ ఆధారిత ఫింగర్ ప్రింట్లను వాడేవారు. దీంతో అటు సిగ్నల్ రాక.. ఇటు ఫింగర్ ప్రింట్ సరిగ్గా పడక.. కూలి పనులు చేసే వారు, శారీరకంగా బలహీనులు, రోగులు వంటి వారికి పింఛన్ పొందడంలో అనేక సమస్యలు ఎదురయ్యేవి. ఈ ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిష్కారాన్ని ప్రవేశపెట్టింది. ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్ ద్వారా ఇప్పుడు ధృవీకరణ జరగనుంది. దీని వలన సరైన వ్యక్తికి – సరైన పింఛన్ – సరైన సమయంల్లో అందేలా ఒక పారదర్శక విధానం అమల్లోకి వస్తోంది.ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం రూ.15.50 కోట్ల బడ్జెట్ కేటాయించి.. 5బి ఆధారిత ఎల్1 ఫింగర్ ప్రింట్ పరికరాలు, స్మార్ట్ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 6,300 బ్రాంచ్ పోస్టుమాస్టర్లకు పరికరాలు పంపిణీ చేయనున్నారు. ములుగు జిల్లా పస్రా కేంద్రంలో మంత్రి సీతక్క , కలెక్టర్ టీఎస్ దివాకర్ కలిసి ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పోస్టుమాస్టర్లకు పరికరాలు చేరనున్నాయి. ఫేస్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి బాధ్యతను TG Online చేపట్టింది. నూతన టెక్నాలజీ వల్ల ధృవీకరణ ప్రక్రియ కేవలం మూడు సెకన్లలో పూర్తవుతుంది. ఇక లబ్ధిదారులు పొడవాటి క్యూల్లో గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా.. తక్షణమే పింఛన్లు పొందగలుగుతారు.



తెలంగాణ కంటిజెంట్ జట్టు సభ్యులకు క్రీడా కిట్లను అందిస్తున్న రాష్ట్ర జైళ్లు, సవరణ శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా

## రేపటి నుంచి అఖిలభారత జైల్ డ్యూటీమీట్ 2025

### రాష్ట్ర జైళ్లు, సవరణ శాఖ డిజి సౌమ్యమిశ్రా

**హైదరాబాద్, సెప్టెంబరు 7, ప్రభావార్త:** తెలంగాణ జైళ్లు, సవరణాశాఖ ఆధ్వర్యంలో 7వ అఖిల భారత జైలు డ్యూటీ మీట్–2025 ఈ నెల 9 నుండి 11 వరకు హైదరాబాదులోని ఆర్బీవీఆర్ఆర్ (తెలంగాణ పోలీస్ అకాడమీ)లో జరగనున్నట్లు రాష్ట్ర జైళ్లు, సవరణ శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా తెలిపారు. దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు 3 కేంద్రపాలిత ప్రాంతాల నుండి వచ్చిన 1300 మందికి పైగా జైలు సిబ్బంది (ఇందులో 184 మంది మహిళలు) పాల్గొని 36 విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తారన్నారు. వీటిలో ప్రథమ చికిత్స, వెల్ఫేర్ పథకాలు, క్విజ్, కంప్యూటర్ నైపుణ్యం వంటి వృత్తి సంబంధిత పోటీలు, అలాగే అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, కరాటే, క్రావ్ మాగా, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి క్రీడలు, సాంస్కృతిక పోటీలు ఉంటాయని వివరించారు. ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రం రెండవసారి ఆతిథ్యం ఇస్తోంది. 2015లో తొలిసారి నిర్వహించగా, 2022లో అహ్మదాబాద్‌లో జరిగిన 6వ జైలు డ్యూటీ మీట్‌లో తెలంగాణ రాష్ట్రం ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. ఈసారి తొలిసారిగా ఆల్ ఇండియా టెక్నో ఎక్స్‌పో, జైలు ఉత్పత్తుల ప్రదర్శన స్టాళ్లు కూడా ఏర్పాటు చేయబడ్డాయని తెలిపారు. సన్నాహక కార్యక్రమంలో భాగంగా డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా తెలంగాణ కాంటిజెంట్ జట్టు సభ్యులైన 84 మందికి క్రీడా కిట్లను పంపిణీ చేసి, జాతీయ స్థాయిలో క్రమశిక్షణతో ఆత్మవిశ్వాసంగా రాణించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి శాఖ, బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ డెవలప్‌మెంట్, న్యూఢిల్లీ కేంద్ర హోంమంత్రిత్వశాఖతో సమన్వయం చేసుకుంటూ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 9వ తేదీన మంగళవారం ఉదయం 9:30 గంటలకు హిమాయత్ సాగర్‌లోని పోలీస్ అకాడమిలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని జైలు డ్యూటీ మీట్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామక్రిష్ణారావు, రాష్ట్ర హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా, రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

## 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం 10 లక్షల ఎకరాల్లో సాగవుతోందని చెప్పారు. అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని ఆదివారం తనిఖీ చేశారు. ఫ్యాక్టరీ తరచూ బ్రేక్ డౌన్ కావడంపై గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పామాయిల్ గెలలు నిల్వ ఉండకుండా క్రషింగ్ చేయాలని సూచించారు. ఎక్కువగా వచ్చిన పామాయిల్ గెలలు అప్పారావుపేట ఫ్యాక్టరీకి తరలించాలన్నారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో ఇరవై లక్షల ఎకరాలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూల వాతావరణం ఉందని తెలిపారు. ఒక్కో ఉమ్మడి జిల్లాకు లక్ష ఎకరాల చొప్పున పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. సిద్దిపేట పామాయిల్ రిఫైనరీని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. పామాయిల్ గెలలు టన్ను రూ.25 వేలు ఉండేలా ప్రోత్సహించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి స్వయంగా కలిసి వివరించానని వెల్లడించారు. అన్నదాతలు ఆత్మగౌరవంతో, ఆరోగ్యంగా ఉండేది ఒక్క వ్యవసాయ రంగమేనని చెప్పారు. రానున్న రోజుల్లో రైతులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ దేశానికి హబ్‌గా మారనుందని తెలిపారు. ఆయిల్ ఫెడ్‌తో పాటు ప్రైవేట్ రంగంలో పామాయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీల ఏర్పాటుతో ఆయిల్ పామ్ రైతులకు దీర్ఘకాలిక మేలు జరుగుతోందని పేర్కొన్నారు.

## పత్తిలో తేమ 12 శాతం కంటే ఎక్కువైతే కొనుగోలు చేయం

### కాటన్ కార్పొరేషన్ మార్గదర్శకాలు విడుదల

**హైదరాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే నెల నుంచి పత్తి అమ్మకాలు ప్రారంభం కానున్నాయి. ఈక్రమంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ( సీసీఐ ) పత్తి రైతులకు మార్గదర్శకాలను జారీ చేసింది. ఈసారి పత్తి కొనుగోలుకు సంబంధించి నియమాలను కఠినతరం చేసింది. పత్తిలో తేమ 12 కన్నా ఎక్కువ శాతం ఉంటే కొనుగోళ్లకు అనుమతించబోమని తెలిపింది. ఇదే సమయంలో తేమ శాతం 8 శాతం కన్నా తక్కువ ఉంటే ప్రోత్సాహకాలు అందిస్తామని స్పష్టం చేసింది. అదే తేమ శాతం 8 నుండి 12 మధ్య ఉంటే ధర నిష్పత్తి ప్రకారం తగ్గుతుందని తెలిపింది. కనుక రైతులు పత్తి అమ్మే ముందు తగు జాగ్రత్తలు తీసుకుని సీసీఐ నియమాలు పాటించలని తెలిపింది. పోయిన సంవత్సరం ఇలానే తేమ శాతం అంశంలో మధ్యలో మార్పులు చేయడం వల్ల చాలా రాష్ట్రాల్లో ఈ అంశం వివాదాస్పదం అయ్యింది. అందుకే ఈ సంవత్సరం పత్తి అమ్మకాలు ప్రారంభం కావడానికి నెల రోజుల ముందే మార్గదర్శాలు జారీ చేసింది. అలానే ఈ సంవత్సరం పత్తి ధరకు సంబంధించి కూడా సీసీఐ వెల్లడించింది. పొడవాటి దూదికి క్వింటాలుకు రూ.8,110ను ధరగా నిర్ణయించారు. అలానే మధ్యస్థ దూదికి రూ.7,710గా సీసీఐ మద్దతు ధర ప్రకటించింది. కాగా ఈసారి దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి.

## ఖాళీగా ఉన్న 30వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అన్ని క్యాటగిరీల్లోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో 30వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వం తక్షణం స్పందించి భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆదివారం టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికు ఆర్.కృష్ణయ్య లేఖ రాసి దానిని ఆదివారం విడుదల చేశారు. గతేడాది టీచర్ పోస్టులను భర్తీ చేసినా వివిధ కారణాలతో అన్ని పోస్టులు భర్తీ కాలేదని, ఇంకా పెద్ద ఎత్తున ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. మరోవైపు బిఇడి, డిఇడి చేసి, అన్నీ అర్హతలున్న 16 లక్షల మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. 12 వేల పాఠశాలల్లో ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్ పాఠాలను చెప్పేవారే లేరని, విద్యార్థులు చదువుల్లో వెనుకబడి పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.'ఇటీవల ముఖ్యమంత్రి వివిధ సభలలో ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ పాఠశాలలో విద్యాప్రమాణాలు పెంచడానికి టీచర్ పోస్టులను భర్తీ చేయవలసిన అవసరం ఉందన్నారు. ఇటీవల జూన్‌లో 6వేల మంది రిటైర్డు అయ్యారని, గత ఆగస్టులో 4,500 మంది టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చారు. అలాగే గత డిఎస్సీలో సెలక్టయిన వారిలో సుమారు రెండువేల మంది జాయిన్ కాలేదు. ఇలా మొత్తం 12వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఎయిడెడ్ పాఠశాలలో గత 20ఏళ్ళుగా నోటిఫికేషన్ జారీ కాలేదు. ఆదర్శ, కస్తూర్బా పాఠశాలలకు పార్టుటైమ్ టీచర్లతో నెట్టుకొస్తున్నారు. ఖాళీగా ఉన్న 30వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు.

# 45 శాతం తగ్గిన విద్యుత్ ధరలు

### యూనిట్ రూ.3.63 నుండి రూ.2.01 పడిపోయిన రేటు

### 5,029 మిలియన్ యూనిట్లకు చేరుకున్న ట్రేడింగ్ వాల్యూ

**హైదరాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :** భారతదేశ విద్యుత్ స్పాట్ మార్కెట్ ఈ నెలలో 45 వరకు గణనీయమైన ధర తగ్గుదలను చూసింది. భారీ వర్షాలు డిమాండ్‌ను తగ్గించడం మరియు జల, పవన మరియు సౌర వంటి పునరుత్పాదక వనరుల నుండి ఉత్పత్తిని పెంచడం వల్ల ఇది సాధ్యపడింది. ప్రధానంగా భారీ వర్షాలు భారతదేశ విద్యుత్ ధరలు తగ్గడానికి కారణమమై మార్కెట్ అస్థిరతకు దారితీసింది. ఈ నెల మొదటి వారంలో స్పాట్ మార్కెట్‌లో విద్యుత్ ధరలు 45 శాతం వరకు తగ్గాయని ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ (ఐఈఎక్స్) స్పష్టం చేసింది. ఇదే సమయంలో అమ్మకపు బిడ్‌లు పెరిగాయి. రియల్‌టైమ్ మార్కెట్ (అర్‌టీఎమ్)లో సగటు ధర ఈ నెల తొలి వారం మధ్య యూనిట్‌కు 45 శాతం తగ్గి రూ.2.01కి చేరుకుంది. గత సంవత్సరం ఇదే కాలంలో యూనిట్‌కు రూ.3.63గా ఉంది. మరో పక్క ట్రేడింగ్ వాల్యూమ్‌లు 83 శాతం పెరిగి 825 మిలియన్ యూనిట్లకు చేరుకున్నాయి. కాగా ఇటీవలి నెలల్లో విద్యుత్ మార్పిడి ధరలు తగ్గుతూ వస్తున్నాయి. దీనికి మితమైన ఉష్ణోగ్రతలు మరియు పవన, జల మరియు సౌర వనరుల నుండి అధిక ఉత్పత్తి సహాయపడుతుంది. గత నెలలో దేశంలో విద్యుత్ వినియోగం 150.47 బిలియన్ యూనిట్లుగా ఉంది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 4 శాతం కంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేసింది. గత నెల 7న దేశంలో గరిష్ట డిమాండ్ 229 గిగావాట్లకు చేరుకుంది. ఇది 2024లో నమోదైన మునుపటి ఆగస్టు రికార్డు 216 గిగావాట్లను అధిగమించింది. ఇక ఈ నెలలో ఐఈఎక్స్‌లో డే-అహెడ్ మార్కెట్ (డిఎఎమ్)లో అమ్మకాల వైపు ద్రవ్యత సంవత్సరానికి 40 శాతం పెరిగింది. దీనికి కారణం గాలి, జల మరియు సౌర ఉత్పత్తి పెరగడం. ఇంధనం యొక్క ఈ మిగులు లభ్యత ఎక్స్ఛేంజ్‌లో విద్యుత్ ధరలను పోటీగా ఉంచిందని ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ బజాజ్ అన్నారు. గత నెలలో సగటు డే-అహెడ్ మార్కెట్ ధర యూనిట్‌కు రూ.4 వద్ద ఉంది, ఇది గత సంవత్సరంతో పోలిస్తే దాదాపు 7 శాతం తక్కువ. అయితే రియల్‌టైమ్ మార్కెట్ సగటున యూనిట్‌కు రూ.3.38 చొప్పున 6 శాతం తగ్గింది. అలాగే అర్‌టిఎమ్ ట్రేడింగ్ వాల్యూమ్‌లు కూడా పెరిగాయి, ఆగస్టు 2024లో 3,485 మిలియన్ యూనిట్ల నుండి గత సంవత్సరంతో పోలిస్తే 44 శాతం పెరిగి 5,029 మిలియన్ యూనిట్లకు చేరుకున్నాయి. గత నెలలో మొత్తం ట్రేడ్ చేయబడిన వాల్యూమ్‌లలో ఈ విభాగం 36శాతం వాటా కలిగి ఉంది. గత నెల 25న, భారీ వర్షాలు సరఫరాను మరింత పెంచడంతో సగటు అర్‌టీఎమ్ ధరలు దాదాపు సున్నాకి చేరుకున్నాయి. ఒకే ట్రేడింగ్ బ్లాక్‌లో (ఉదయం 7:45-8:00) ధర కేవలం రూ.0.01/ కిలోవాట్ పర్ అవర్‌కు పడిపోయిందని ఐఈఎక్స్ డేటా వెల్లడించింది. కాగా ఈ సంవత్సరం గరిష్ట విద్యుత్ డిమాండ్ 270 గిగావాట్ల కంటే ఎక్కువగా ఉంటుందని కేంద్రఇంధన మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. అయితే, దేశవ్యాప్తంగా నిరంతర వర్షాల కారణంగా, ఇప్పటివరకు గరిష్ట డిమాండ్ 242 గిగావాట్లకు మాత్రమే చేరుకుంది గత యేడాది నమోదైన 250 గిగావాట్ల కంటే తక్కువ.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

## ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్యం, రాజ్యాంగం

### హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయని, వాటిని పరిరక్షించుకోవల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులతోపాటు ప్రజలందరిపైనా ఉందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఆదివారం ఆదివారం సికింద్రాబాద్‌లోని నాలెడ్జ్ సెంటర్‌లో ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా న్యాయవాదులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఉపరాష్ట్రపతి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అయిన బి.సుదర్శన్‌రెడ్డి నక్సలిజానికి మద్దతు ఇస్తూ తీర్పు ఇచ్చారని ఆరోపించటం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డిఏ అభ్యర్థి రాధాకృష్ణన్ గురించి చెప్పుకోదగ్గ విషయాలు ఏమీ లేకపోవటంతో సుదర్శన్‌రెడ్డిపై అమిత్‌షా నిస్సత్తువ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టించటానికి అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని, దీనికి నిలువెత్తు నిదర్శనం 58వ స్థానంలో ఉన్న పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విపుల్ మనుభాయ్ పంచోలిని భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించటమేనని గుర్తు చేశారు. తెలంగాణ బార్‌కౌన్సిల్ సభ్యులు బన్నూరు కొండారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ రెహ్మాన్, ఏపీసీఎల్పీ నేత సురేష్, నల్సార్ యూనియవర్సిటీ ఆఫ్ లా ప్రొఫెసర్ వాగేష్, గోవర్ధన్, సీనియర్ అడ్వకేట్ ప్రసాద్‌బాబు, బీవి శేషగిరి, డాక్టర్ అశోక్‌కుమార్, ఏఎంఏసీఎస్ డైరెక్టర్లు తొర్నాల గిరి, అర్మూల మహేశ్వర్, హయత్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మోడెం ప్రభాకర్‌గౌడ్, న్యాయవాదులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావుకు బాలాపూర్ లడ్డూ ప్రసాదం

**హైదరాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** బాలాపూర్ గణేష్ ఉత్సవాల్లో భాగంగా జరిగిన లడ్డూ వేలంలో రూ.35 లక్షల రూపాయల విలువైన లడ్డూను దక్కించుకున్న కర్మన్‌ఘాట్ ప్రాంతానికి చెందిన లింగాల దశరథ్ గౌడ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసారు. ఆదివారం పార్టీ కార్యాలయానికి వచ్చిన దశరథ్ మర్యాద పూర్వకంగా కలిసి లడ్డూ ప్రసాదాన్ని అందజేసి ఆనందం వ్యక్తం చేశారు.

## పంట పొలాల్లో ఇసుకు మేటల తొలగింపు

### రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో పంట పొలాల్లో ఇసుక మేటలు వేసి రైతులు భారీగా నష్టపోయారు. ఈ క్రమంలో రాష్ట్రంలో దెబ్బ తిన్న వ్యవసాయ భూములను పునరుద్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరదలు, వర్షాల వల్ల దెబ్బతిన్న వ్యవసాయ భూములను బాగు చేయడానికి ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. పొలంలో ఇసుక మేటల తొలగింపు పనులకు ఉపాధి హామీని అనుసంధానం చేసేందుకు అనుమతిచ్చింది. దీని ద్వారా ఉపాధిహామీ కార్మికులు రైతుల పొలాల్లో పేరుకుపోయిన ఇసుకను తొలగించి భూమిని తిరిగి సాగుకు అనుకూలంగా మారుస్తారు. ఈ నిర్ణయం వల్ల రైతులకు ఒకింత ఆర్థిక వెసులుబాటు కలుగనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కాగా గత కొన్ని రోజులుగా తెలంగాణలో కురిసిన భారీ వర్షాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 29 జిల్లాల్లో 60 వేల ఎకరాల పంట పొలాలు దెబ్బ తిన్నాయి. ఈ భూముల్లో ఇసుక మేటలు వేయడంతో సాగుకు వీల్లేకుండా తయారయ్యాయి. దీంతో ఆ భూముల్లో మేట వేసిన ఇసుక, మట్టిని తొలగించి, తిరిగి దాన్ని సాగుకు అనుకూలంగా మార్చి రైతుల జీవనోపాధికి నష్టం వాటిల్లకుండా చూడాలని వ్యవసాయ శాఖ ప్రభుత్వాన్ని కోరింది. దీంతో సర్కార్ ఈ అంశాన్ని పరిశీలించి ఈ ఉపాధి హామీ పథకం కింద ఇసుక మేటల తొలగింపు కార్యక్రమం చేపట్టేందుకు అంగీకారం తెలిపింది. ఉపాధిహామీ పథకం నియమాల ప్రకారం.. భారీ వర్షాల వల్ల పంట పొలాలు దెబ్బ తింటే. వాటిని తిరిగి సాగుకు అనుకూలంగా పునరుద్ధరించడం, నిరుపయోగ భూములను మరమత్తు చేసి సాగుకు అనుకూలంగా మార్చేలా చేసేందుకు అవకాశం ఉంది. దీని ప్రకారమే ప్రభుత్వం వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలు, వ్యవసాయ భూముల్లో ఉపాధిహామీ పనులను చేపట్టేందుకు అంగీకారం తెలిపింది.

# బిసి గురుకుల పాఠశాలలో మంత్రుల ఆకస్మిక పర్యటన

### తనిఖీలు నిర్వహించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం జంగంపల్లిలో మహాత్మ జ్యోతిరావు ఫూలే గురుకుల పాఠశాలలో మంత్రులు ఆకస్మిక తనిఖీలు చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ఆదివారం జంగంపల్లిలోని బిసి గురుకుల పాఠశలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రులు విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, విధిగా మెనూ పాటించాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో చెత్త చెదారం లేకుండా శుభ్రం చేయాలని, పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. సిలబస్ ఎక్కడి వరకు పూర్తయిందని విద్యార్థులను అడిగి మంత్రులు తెలుసుకున్నారు.

ప్రతి ఒక్కరు లక్ష్యాన్ని నిర్దేశించుకోనీ విజయం దిశగా సాగాలని మంత్రులు విద్యార్థులకు సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థునులు అన్ని రంగాల్లో నైపుణ్యాలు నేర్చుకోవాలని, క్రీడల్లో రాణించాలని సూచించారు. విద్యార్థులకు విధిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రులు విద్యార్థులను, టీచర్లను సత్కరించారు. ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంకు సాధించిన జి. సంధ్య రాణి, విద్యాదాన్ స్కాలర్ షిప్ అందుకున్న ఎస్. శ్రావణి, రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలకు ఎంపికైన ఎస్. మాధవి, అనితలను మంత్రులు సత్కరించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపాల్ జె. శ్రీలత, విధుల్లో ఉన్న ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు.

ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను ఉపయోగించుకుని విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షి ంచారు.

మంత్రి తాను స్వయంగా డ్రాయింగ్ వేసి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. విద్యతో పాటు క్రీడలో, కళల్లో రాణించాలని మంత్రి విద్యార్థులకు సూచించారు.

# ఉపరాష్ట్రపతిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలి

### ఎంపిలు, వివిధ పార్టీ నేతలకు ప్రజాస్వామికవాదుల విజ్ఞప్తి

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** ఈ నెల 9న జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికలు 'రాజ్యాంగం అమలుకు–రాజ్యాంగ విధ్వాసానికి' మధ్య జరుగుతున్న ఎన్నికలని పార్లమెంట్ సభ్యులు ఆలోచించి ఓట్లు వేయాలని పలువురు మేధావులు, ప్రజాస్వామిక వాదులు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు న్యాయం జరగాలన్న, రాజ్యాం గాన్ని కాపా డుకోవాలన్న విశ్రాంత న్యాయమూర్తి తెలంగాణ బిడ్డ, ప్రతిపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థి జసీస్ బి.సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సంఘీ భావంగా ఆదివారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పౌర హకు ్కల నాయకుడు ప్రొఫెసర్ జి.హరగోపాల్, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, ప్రముఖ సీనీయర్ సంపా దకులు కె.రామచంద్రమూర్తి, కె.శ్రీనివాస్, విద్యా కమిషన్ సభ్యుడు ప్రొ. పి.ఎల్.విశ్వేశ్వరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సుద ర్శన్‌రెడ్డి విజయానికి టిడిపి అధినేత ఎన్.చంద్రబాబు , జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, వైఎస్ ఆర్‌సిపి అధినేత వై.ఎస్. జగన్‌మో హన్‌రెడ్డి, బి ఆర్ఎస్ నేత కెసిఆర్ పూర్తిగా సహకరిం చాలని విజ్ఞప్తి చేశారు. మన తెలుగువారైనా సుద ర్శన్‌రెడ్డి గెలుపు తెలుగు జాతి వికాసానికి మరింతగా దోహద పడు తుందన్నారు. ఇప్పటికే 67 శాతం మంది ప్రతి పక్ష పార్ల మెంట్ సభ్యులు మద్దతు తెలప డంతో పాటు, ప్రాంతీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా మద్దతు తెలిపారని వివరించారు. ఉప రాష్ట్రపతిగా సుద ర్శన్‌రెడ్డి విజయం సాధిస్తే లౌకిక, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాగాన్ని రక్షించగలరని, చరిత్ర, న్యాయ శాస్త్రంపై ఆయనకు పూర్తిగా అవగాహన ఉందని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. జి.హరగోపాల్, చిత్రంలో విశ్వేశ్వరరావు, ప్రొ. కోదండరామ్, కె.శ్రీనివాస్‌రెడ్డి

# టెట్‌పై సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాలి

### సీనియర్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి

### టిఎస్ యుటిఎఫ్ డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 7, ప్రభావార్త:** టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)పై సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించాలని టిఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసింది. సీనియర్ టీచర్లకు రక్షణ కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకట్ డిమాండ్ చేశారు. ఐదేళ్ళ పైబడి సర్వీసున్న ఇన్ సర్వీస్ టీచర్లందరూ రెండేళ్ళలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణులు కావాలని .. లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఈ నెల 1న ఇచ్చిన తీర్పును పునః సమీక్షిం చాలని వారు డిమాండ్ చేశారు. సర్వీసులో ఉన్న సీనియర్ టీచర్ల ప్రయోజనాల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ నియామకానికి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణత తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టు 23న ఎన్‌సిటిఈ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. అయితే అప్పటికే నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత నుండి మిన హాయింపు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పదోన్నతి పొందాలంటే టెట్ అవసరమా లేదా అనే వివాదంపై వివిధ కోర్టుల్లో కేసులు నడుస్తు న్నాయన్నారు.

మైనారిటీ విద్యా సంస్థల్లో నియామకాలకు టెట్ తప్పనిసరా కాదా అనే అంశంపై మహారాష్ట్రకు సంబంధించిన కేసుతో పాటు, ప్రమోషన్ల విషయంలో తమిళనాడు ఉపాధ్యాయుల కేసులను కలిపి విచారించిన సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్.. సెప్టెంబర్ 1న వెలు వరించిన తీర్పు సీనియర్ ఉపాధ్యాయులకు అశనిపాతంగా మారిందన్నారు. ఉపాధ్యాయుల భవిష్యత్తు పట్ల సందిగ్ధత నెలకొందన్నారు. మైనారిటీ విద్యాసంస్థల కేసును రాజ్యాంగ ధర్మాస నానికి బదలీ చేసిన న్యాయమూర్తులు.. మైనారిటీయేతర విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులకు సంబం ధించి ఇంతటి కఠినమైన తీర్పును ఇవ్వడం విచారకరమన్నారు. ఇరవై, పాతికేళ్ళుగా సర్వీసు చేస్తున్న ఉపాధ్యాయులు ఇప్పుడు కేవలం రెం డేళ్లలో టెట్ ఉత్తీర్ణులు కావాలనడం భావ్యం కాద న్నారు. 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోనూ, తెలంగాణ ఏర్పాటు అనంతరం 2015లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిబంధనలు రూపొందించిన ఉత్తర్వుల్లో ఆగస్టు 23,2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత మినహాయించినట్లు స్పషంగా పేర్కొన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే గత 15 సంవత్సరాలుగా ఉపాధ్యాయులు టెట్ రాయాలనే ఆలోచన చేయలేదన్నారు. ఇప్పుడు హఠాత్తుగా రెండేళ్లలో టెట్ పాస్ కావాలంటే దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయులందరూ తీవ్ర భయాందోళనలకు లోనవుతున్నారని అన్నారు. కనుక ఎన్‌సిటిఇ నోటిఫికేషన్ (23.08.2010) తర్వాత నియామకమైన టీచర్లకు మాత్రమే టెట్ తప్పనిసరి చేయాలని, అంతకుముందు నియామకమైన వారికి మినహాయింపు ఇవ్వాలని చావ రవి, ఎ వెంకట్ డిమాండ్ చేశారు.

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి దక్షిణాది ఎంపిలు మద్దతు ఇవ్వాలి

### ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడు జిలుకర రవికుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** దక్షి ణాది రాష్ట్రాల ఎంపీలు రాజకీ యాల కతీతంగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి ఓటు వేసి ఉపరాష్ట్రపతిగా గెలిపించాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ విజ్ఞప్తి చేశారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తక్షణమే జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు తెలుపుతూ స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.జస్టిస్ బి సుదర్శన్ రెడ్డికి మద్దతు తెలిపిన ఎంఐఎం అధినేత ఎంపీ అసదుద్దీన్‌ఓవైసీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు దక్షి ణాది రాష్ట్రాలకు చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు. కర్ణాటక, కేరళ, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరితో పాటు మహారాష్ట్ర, గోవా రాష్ట్రాలకు చెందిన ఎంపీలు జస్టిస్ బి సుదర్శన్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాం గాన్ని పరిరక్షి ంచడానికి, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఆయన చేస్తున్న కృషి మరువలేనిదని, ఉపరాష్ట్రపతిగా గెలిస్తే ఆ పదవికి వన్నె తెస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు దాసరి శ్యామ్‌రావు. గరుగుల నర్సింలు, ఆర్తిగారి సుధాకర్, ఉదయ్‌కుమార్, సీమోను సిలారి తదితరులు

08-09pg10 12 ONG_08-09pg10.qxd 9/7/2025 11:07 PM Page 1



### వుషు వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో..

# అపర్ణ, కరీనా, శివానీలకు రజతాలు

## దహియాకు కాంస్యం




**న్యూఢిల్లీ:** వుషు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ అథ్లెట్లు అపర్ణ, కరీనా, శివానీలు రజత పతకాలు సాధించారు. పురుషుల 56 కేజీల సందా విభాగంలో సాగర్ దహియా కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. బ్రెజిల్‌లోని బ్రసిలియాలో జరిగిన 2025 ప్రపంచ వుషు ఛాంపియన్‌షిప్‌లో సాండా వర్గం నుండి భారత్ అద్భుతమైన ప్రదర్శనను కనబరిచి, నాలుగు పతకాలను గెలుచుకుంది. తొలిసారిగా, భారత్‌లో ముగ్గురు మహిళా సందా అథ్లెట్లు అపర్ణ (52 కిలోలు), కరీనా కౌశిక్ (60 కిలోలు), మరియు శివాని (75 కిలోలు) ఫైనల్స్‌కు చేరుకున్నారు. కానీ ఎవరూ బంగారు పతకాన్ని సాధించలేకపోయారు. అపర్ణ బంగారు పతక పోరులో వియత్నాంకు చెందిన న్గో థి ఫువాంగ్ న్గా చేతిలో ఓడిపోగా, కరీనా ఆసియా క్రీడల ఛాంపియన్ చైనాకు చెందిన జియావోయ్ వు చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపోయింది. చివరి బంగారు పతక మ్యాచ్‌లో, ఇరాన్‌కు చెందిన షర్బానో మన్సౌరియన్ షెమిరోమిపై శివానీకి ఎటువంటి అవకాశం రాలేదు. మన్సౌరియన్ మొత్తం బౌట్‌లో ఆధిపత్యం చెలాయించగా, శివానీ ఒక్క కిక్ కూడా వదలలేదు. అలాగే పురుషుల విభాగంలోపతక పోటీలకు చేరుకున్న ఏకైక అథ్లెట్ భారత్‌కు చెందిన సాగర్ దహియా (56 కిలోలు) విక్రాంత్ బలియాన్ (75 కిలోలు) తన క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో చైనా అథ్లెట్ చేతిలో ఓడిపోయాడు. క్రిగిజ్, దక్షిణ కొరియా అథ్లెట్లపై వరుసగా రెండు విజయాలు సాధించిన తర్వాత సాగర్ తన పతకాన్ని నిర్ధారించుకున్నాడు. కానీ తన పరుగును పొడిగించలేక ఫిలిప్పీన్స్‌కు చెందిన కార్లోస్ బేలోస్ జూనియర్ చేతిలో 0–2 తేడాతో ఓడిపోయి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు.

### ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్..

# భారత్‌కు తొలిసారి స్వర్ణం

**న్యూఢిల్లీ:** ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత్ తొలిసారిగా పురుషుల కాంపౌండ్ టీమ్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. అయితే మిక్స్‌డ్ కాంపౌండ్ జట్టు ఫైనల్‌లో ఓటమిని ఎదుర్కొని, రజత పతకంతో సరిపెట్టుకుంది. దక్షిణ కొరియాలోని గ్వాంగ్జులో ఆదివారం జరిగిన ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల కాంపౌండ్ జట్టు తొలి బంగారు పతకాన్ని సాధించింది. రిషబ్ యాదవ్, అమన్ సైని మరియు ప్రథమేష్ ఫుగే త్రయం చివరి సెట్‌లో ఫ్రెంచ్ జట్టును ఓడించి 235–233 తేడాతో బంగారు పతక పోరును గెలుచుకుంది. మూడు సెట్ల ముగింపులో రెండు జట్లు 176–176తో సమంగా ఉన్నాయి. కానీ భారత్ నుండి వచ్చిన 59 పరుగుల అద్భుతమైన సెట్ ఫ్రెంచ్ జట్టుపై ఒత్తిడిని పెంచింది. చివరికి వారు 57 పరుగులు చేసి, టోర్నమెంట్‌లో భారత్‌కు మొదటి స్వర్ణాన్ని అందించారు. కాగా మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్ ఫైనల్ తర్వాత ఈ రోజు భారతదేశం బంగారు పతకం సాధించిన రెండవ మ్యాచ్ ఇది. ఈ మ్యాచ్‌లో రిషబ్ యాదవ్ మరియు జ్యోతి సురేఖ వెన్నం జోడీ నెదర్లాండ్స్ చేతిలో ఓడిపోయింది.



ఈ జంట తొలి సెట్‌లో ఆధిక్యంతో మ్యాచ్‌ను ప్రారంభించారు, కానీ తర్వాత 37 పాయింట్ల సబ్‌పార్ సెట్ నెదర్లాండ్స్‌కు మ్యాచ్‌లో ఆధిక్యాన్ని ఇచ్చి రజతంతో సరిపెట్టుకుంది.



# యుఎస్ ఓపెన్ క్వీన్‌గా సబలెంకా

## అమండాను ఓడించి టైటిల్ కైవసం

**న్యూఢిల్లీ:** యుఎస్ ఓపెన్ క్వీన్‌గా అరినా సబలెంకా కిరీటాన్ని దక్కించుకుంది. అమండా అనిసిమోవాను 6–3, 7–6(3) తేడాతో ఓడించి వరుసగా రెండో యుఎస్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకుంది. ప్రపంచ టాప్ ప్లేయర్‌గా తన హోదాను పదిలం చేసుకుంది. ఈ విజయంతో, 2014లో సెరెనా విలియమ్స్ తర్వాత ఫ్లషింగ్ మెడోస్‌లో తన సింగిల్స్ కిరీటాన్ని నిలబెట్టుకున్న మొదటి మహిళగా సబలెంకా నిలిచింది. టాప్ సీడ్, డిఫెండింగ్ ఛాంపియన్ అయిన ఈమె ఎనిమిదో సీడ్ అమెరికన్ క్రీడాకారిణిపై శక్తివంతమైన ప్రదర్శన ఇచ్చింది. 2025 సీజన్‌లో ఆమె మొదటి గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను, ఆమె కెరీర్‌లో నాల్గవ ప్రధాన ట్రోఫీని గెలుచుకుంది. ఇది ఆమె కెరీర్‌లో 100వ గ్రాండ్ స్లామ్ మెయిన్ డ్రా విజయాన్ని, సీజన్‌లో 56వ విజయాన్ని కూడా నమోదు చేసింది. కాగా ఈ ఏడాది ప్రారంభంలో ఆస్ట్రేలియన్ ఓపెన్, రోలాండ్ గారోస్ రెండింటిలోనూ సబలెంకా ఫైనల్స్‌కు చేరుకుంది. కానీ రెండు సందర్భాలలోనూ విఫలమైంది. ఆమె తన రెండవ వరుస గ్రాండ్ స్లామ్ ఫైనల్‌కు చేరుకున్న అనిసిమోవాను అద్భుత ప్రదర్శనతో అధిగమించి టైటిల్ సాధించింది. తొలి సెట్‌లో ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఐదు సర్వీస్ బ్రేక్‌లు జరిగాయి, చివరికి సబలెంకా పైచేయి సాధించింది. ఆమె అనిసిమోవాను మూడోసారి బ్రేక్ చేసి 5–3తో ఆధిక్యంలోకి వెళ్ళింది. తర్వాత అనిసిమోవా ఫోర్‌హ్యాండ్ వైడ్‌ను కోల్పోవడంతో సెట్‌ను ముగించింది. రెండవ సెట్‌లో, సబలెంకా 5–4తో సర్వ్ చేస్తూ మ్యాచ్‌ను ముగించే స్థితిలో ఉన్నట్లు కనిపించింది. కానీ 30 ఆల్ వద్ద ఓవర్‌హెడ్ మిస్ అవ్వడంతో అనిసిమోవా తిరిగి బ్రేక్ అప్ అయ్యి సెట్‌ను ట్రైబ్రేక్‌కు నెట్టింది. అయితే, సబలెంకా ప్రారంభం నుండే ట్రైబ్రేక్‌ను నియంత్రించి, తన మూడవ ఛాంపియన్‌షిప్ పాయింట్‌పై విజయాన్ని నమోదు చేసుకుంది.







# ఆసియా కప్ మూడోసారి టి20 ఫార్మాట్

## ఫస్ట్‌టైమ్ భారత్ విక్టరీ.. రెండో టోర్నీ శ్రీలంక కైవసం

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025కు కౌంటౌన్ స్టార్ట్ అయింది. యూఏఈ వేదికగా మరో 24 గంటల్లో ఈ నెల 9 నుంచి ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్‌లో ఎనిమిది జట్లు కప్పు కోసం పోటీపడనున్నాయి. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనుండడంతో ఈ సారి ఆసియా కప్‌ను టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. ఇక్కడ ఆసక్తికర విషయం ఏంటంటే టీ20 ఫార్మాట్‌లో ఆసియా కప్‌ను నిర్వహించడం ఇది మూడోసారి మాత్రమే. ఇప్పటి వరకూ టీ20 ఫార్మాట్‌లో 2016, 2022లో ఆసియా కప్‌ను నిర్వహించారు. ఆసియా కప్ 2016కు బంగ్లాదేశ్ ఆతిథ్యం ఇవ్వగా, ఆసియా కప్ 2022కు యూఏఈ ఆతిథ్యం ఇచ్చింది. ఈ సారి కూడా యూఏఈనే ఆతిథ్యం ఇస్తోంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు రెండు సార్లు టీ20 ఫార్మాట్‌లో జరిగిన ఆసియాకప్ టోర్నీని టీమిండియా, శ్రీలంక కైవసం చేసుకున్నాయి. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని నాయకత్వంలో భారత్ ఆసియాకప్ 2016లో బరిలోకి దిగింది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్‌ను ఓడించింది. ఆ తరువాత పాకిస్థాన్‌పై విజయం సాధించింది. అనంతరం శ్రీలంక, యూఏఈ లపై విజయాలు సాధించి ఫైనల్‌కు చేరుకుంది. భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను 15 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 5 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసింది. ఆ తరువాత శిఖర్ ధావన్ (60), విరాట్ కోహ్లీ (41 నాటౌట్), ఎంఎస్ ధోని (20 నాటౌట్) లు రాణించడంతో లక్ష్యాన్ని 13.5 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి అందుకుంది. చివరిసారి టీ20 ఫార్మాట్‌లో నిర్వహించిన ఆసియా కప్ 2022ను శ్రీలంక జట్టు గెలుచుకుంది. ఈ మెగా టోర్నీలో శ్రీలంక అసాధారణంగా ఆడింది. సూపర్ ఫోర్‌లో భారత్‌ను ఓడించిన లంక జట్టు ఫైనల్‌లో పాక్‌తో తలపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన లంక జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. 171 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 147 పరుగులకే పరిమితమైంది. దీంతో లంక జట్టు 23 పరుగుల తేడాతో గెలుపొందింది. మరి తాజాగా ముచ్చటగా మూడోసారి టీ20 ఫార్మాట్‌లో జరుగుతున్న ఆసియా కప్‌ను ఏ జట్టు కైవసం చేసుకుంటుందనేది ఆసక్తికరమైంది.

# గ్రాండ్ స్విస్‌లో వైశాలి మూడో విక్టరీ

**ఆట**

**న్యూఢిల్లీ:** గ్రాండ్ స్విస్ 2025లో భారత్ గ్రాండ్ మాస్టర్ ఆర్ వైశాలి దూసుకెళుతూ ఏకైక ఆధిక్యంలో ఉంది. ఇక డి గుకేశ్, ఆర్ ప్రజ్ఞానంద, ఎరిగైసి అర్జున్ ఓపెన్ కేటగిరీలో మూడో రౌండ్ గెలిచిన తర్వాత రెండో స్థానంలో నిలిచారు. ఉజ్బెకిస్తాన్‌లోని సమర్కండ్‌లో జరిగిన ఈ టోర్నీలో వరుసగా మూడో విజయంతో డిఫెండింగ్ ఛాంపియన్, గ్రాండ్ మాస్టర్ రమేష్‌బాబు వైశాలి 2025 గ్రాండ్ స్విస్ టోర్నమెంట్‌లో తన ఘన విజయాన్ని కొనసాగిం చింది. వైశాలి 37మూవ్‌ల గేమ్‌లో ఆస్ట్రియాకు చెందిన ఓల్గా బాడెల్కాను ఓడించింది. ఇక ఓపెన్ కేటగిరీలో గుకేష్, ప్రజ్ఞానంద, అర్జున్ టోర్నమెంట్‌లో 2.5 పాయింట్లతో సంయుక్తంగా 2వ స్థానానికి చేరుకున్నారు. వారు ప్రస్తుత నాయకుడు పర్హామ్ మాగ్సూద్లూ కంటే కేవలం అర పాయింట్ వెనుకబడి ఉన్నారు. ప్రజ్ఞానంద, గుకేష్ ఇద్దరూ ఇజ్రాయెల్‌కు చెందిన బోరిస్ గెల్ఫాండ్, స్పెయిన్‌కు చెందిన డేనియల్ యుఫాపై వరుసగా బ్లాక్ పావులతో విజయం సాధించారు. అలాగే అర్జున్ స్లోవేనియన్ గ్రాండ్‌మాస్టర్ ఆంటోన్ డెమ్‌చెంకో యొక్క పెట్రోవ్ డిఫెన్స్‌ను అధిగమించి తెల్లటి పావులతో 65మూవ్‌ల మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ విదిత్, నిహాల్ సరిన్ మూడవ రౌండ్‌లో డ్రాగా ఆడి, మూడు ఆటలలో 2 పాయింట్లతో టాప్ 30 వెలుపల స్థానాల్లో మరింత దిగజారారు. మహిళల విభాగంలో, హారిక ద్రోణవల్లి వరుసగా మూడో డ్రా ఆడగా, వంతిక అగర్వాల్ మూడో రౌండ్‌లో టోర్నమెంట్‌లో తొలి ఓటమిని ఎదుర్కొంది.



## వాణిజ్యం

# రూ.1.08 లక్షలకు చేరిన తులం బంగారం

## వెండికూడా అదే దారి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6:** బంగారం ధరలు రోజురోజుకూ దూసుకుపోతున్నాయి. ఇప్పటికే లక్ష రూపాయల పైకి చేరుకున్న పుత్తడి రోజుకొక గరిష్ఠ స్థాయిని తాకుతున్నది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ ఉండటంతోపాటు దేశీయంగా పండుగ సీజన్ కూడా తోడవడంతో పుత్తడి పరుగు పందెంలో విజేతగా నిలుస్తున్నది. ప్రస్తుతం రూ.1.08 లక్షల స్థాయిలో కదలాడుతున్న గోల్డ్ ధర త్వరలో రూ.1.10 లక్షలు అధిగమించే అవకాశాలున్నాయని బులియన్ వర్తకులు చెబుతున్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ తులం ధర రూ.850 అధికమై రూ.1,08,620కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.800 పెరిగి రూ.99,600 పలికింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ పదిగ్రాముల బంగారం ధర రూ.870 అధికమై రూ.1,08,490 పలికింది. అంతకుముందు ఇది రూ.1,07,620గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ తులం ధర రూ.800 ఎగబాకి రూ.98,650 నుంచి రూ.99,450 పలికింది. మొత్తం మీద గడిచిన నెల రోజుల్లో గోల్డ్ ధర రూ.7,500 ఎగబాకినట్టు అయింది. వచ్చే రెండువారాల్లో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించడంతో వీటి ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. బంగారంతోపాటు వెండి పరుగులుతీస్తోంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి మరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నది. ఇదే క్రమంలో వారాంతంలో కిలో ధర మరో రూ.2 వేలు ఎగబాకి రూ.1,38,000కి చేరుకున్నది. రిటైల్ మార్కెట్‌తోపాటు ఎంసీఎక్స్ ఫ్యూచర్ మార్కెట్లోనూ పుత్తడి రాకెట్ వేగంతో దూసుకుపోతున్నది. ఈ నెల మొదటి నుంచి ఇప్పటివరకు ఎంసీఎక్స్ ఫ్యూచర్ మార్కెట్లో తులం ధర రూ.3 వేలు ఎగబాకి రూ.1,06,856కి చేరుకున్నది. ప్రస్తుతం స్వల్పంగా తగ్గినప్పటికీ ధరలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావచ్చునని వర్తకులు హెచ్చరిస్తున్నారు.



## విదేశీ కరెన్సీ ఖజానా కళకళ

**ముంబయి, సెప్టెంబరు 7:** గతమాసాంతంలో డాలరుతో రూపాయి మారకం విలువలు 88.36కు చేరుకోవడంతో ఫోరెక్స్ నిల్వలు అనుకోకుండా 3.51 బిలియన్ డాలర్లుపెరిగి మొత్తం 694.2 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఆర్బీఐ ప్రకటించింది. అంతకుముందువారంలో అంటే ఆగస్టు 22వ తేదీ వారంలో అయితే 4.38 బిలియన్ డాలర్లు తగ్గి 690.72 బిలియన్ డాలర్లకు మాత్రమే ఉన్నాయి. గడచిన వారంలో పెరుగుదలకు కారణం విదేశీ కరెన్సీ ఆస్తుల పెరుగుదలేనని చెప్పాలి. అంతేకాకుండా బంగారం నిల్వలు, స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ వంటివి కీలకమని ఆర్బీఐ అంచనావేసింది. దలాల్‌స్ట్రీట్ ఇటీవలిపరిణామాలతో ఇప్పటికీ స్థిరపడలేదనే అంచనా. దీనికితోడు డాలరుతో రూపాయి మారకం విలువలుకూడా 11 పైసలు క్షీణించి 88.32గానే నిలిచింది. దీనితో ఆర్బీఐ జోక్యంచేసుకుని రూపాయి క్షీణతను కొంతమేర కట్టడిచేసింది. ఇక ఆగస్టు 29 నాటికి విదేశీ కరెన్సీ ఆస్తులు 1.68 బిలియన్ డాలర్లుపెరిగి 583.94 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలరేతర కరెన్సీలు యూరో, పౌండ్, యెన్ వంటి వాటి మారకం విలువలు కూడా ఈ రిజర్వుల్లో చేరతాయి. ఇక బంగారం నిల్వలవరకూ వస్తే 1.76 బిలియన్ డాలర్లు పెరిగి మొత్తం 86.76 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇక ఎస్‌డిఆర్‌లు అయితే గతవారంలో 40 మిలియన్ డాలర్లుపెరిగి మొత్తంగా 18.77 బిలియన్ డాలర్లకు చేరాయి. దీనితో భారత్‌లోని విదేశీ కరెన్సీ నిల్వల స్థితి చెప్పుకోదగినంతగా మారింది.

# ఈ స్మాల్‌క్యాప్‌ఫండ్‌లో భారీ రిటర్నులే!



**ముంబయి, సెప్టెంబరు 7:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో హైరిటర్న్స్ వస్తాయన్న వాదనను చాలా ఫండ్స్ నిరూపించాయి. లాంగ్ టర్మ్‌లో కొన్ని మంచి రాబడులు అందిస్తుంటే కొన్ని మాత్రం చాలా తక్కువ సమయంలోనే ఊహించనిదాని కంటే ఎక్కువ రాబడులు ఇస్తుంటాయి. అలాంటి 202 ఫండ్స్‌ను పరిశీలించి హైరిటర్న్స్ ఇచ్చిన 6 మ్యూచువల్ ఫండ్స్ ఈకేటగిరీలో ఉన్నాయి. గడిచిన 5 సంవత్సరాల కాలంలో ఈ స్కీమ్స్ లంప్‌సమ్ పెట్టుబడులపై సగటున వార్షిక రాబడి 30 శాతం మేర అందించాయి. మొత్తం ఆరు పథకాల్లో 5 స్కీమ్స్ స్మాల్ క్యాప్ ఫండ్స్‌కి సంబంధించినవే. ఇక అసెట్ మేనేజ్మెంట్ కంపెనీల విషయానికి వస్తే ఆరు వేరు వేరు ఏఎంసీల నుంచి మార్కెట్లోకి లాంచ్ అయ్యాయి. ఈ ఆరింట్లో అత్యధిక రాబడులు ఇచ్చిన స్కీమ్‌గా క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్ నిలిచింది. ఈ స్కీమ్ గత 5 సంవత్సరాల కాలంలో వార్షిక రాబడి రేటు 34.98 శాతంగా ఉంది. దీని ప్రకారం లక్ష రూపాయలు లంప్ సమ్ పెట్టుబడి పెట్టి ఉంటే ఇప్పుడు ఆ విలువ రూ.4.48 లక్షలు అవుతుంది. ఆ తర్వాతి స్థానంలో మోతీలాల్ ఓస్వాల్ మిడ్ క్యాప్ ఫండ్ నిలిచింది. ఈ స్కీమ్ గత 5 సంవత్సరాల కాలంలో లంప్‌సమ్ పెట్టుబడి రాబడి 33.6 శాతం చొప్పున అందించింది. ఇందులో ఐదేళ్ల క్రితం లక్ష పెట్టి ఉంటే ఇప్పుడు ఆ విలువ రూ.4.25 లక్షలు అవుతుంది. ఇక మూడో స్థానంలో నిప్పాన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ ఉంది. ఈ స్కీమ్ లంప్ సమ్ రాబడి 5 ఏళ్లలో సీఏజీ ఆర్ రేటు 32.5 శాతంగా ఉంది. లక్ష రూపాయల పెట్టుబడిని 5 ఏళ్లలో రూ.4.08 లక్షలు చేసింది. ఇక బంధన్ స్మాల్ క్యాప్ ఫండ్ గత 5 ఏళ్లలో లంప్ సమ్ రాబడులు 30.68 శాతంగా అందించింది. ఇందులో లక్ష రూపాయలు పెట్టి ఇప్పటి వరకు కొనసాగితే ఆ విలువ రూ.3.81 లక్షలు అయ్యేది. హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ తీసుకొచ్చిన ప్రముఖ ఈక్విటీ స్కీమ్ హెచ్‌డీఎఫ్‌సీ స్మాల్ క్యాప్ ఫండ్ సైతం అదరగొట్టింది. గడిచిన 5 సంవత్సరాల రాబడి చూస్తే లంప్ సమ్ పెట్టుబడులై సగటున వార్షిక రాబడి రేటు 30.41 శాతంగా అందించింది. లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి ఉంటే ఇప్పుడు ఆ విలువ రూ.3.77 లక్షల వరకు అవుతుంది. పెట్టుబడి లక్షకు రూ.2.77 లక్షలు వడ్డీ రూపంలోనే లభించినట్లయింది. ఆ తర్వాత హెచ్‌ఎస్‌బీసీ స్మాల్ క్యాప్ ఫండ్ సగటు వార్షిక రాబడి 30.06 శాతంగా ఉంది.లక్ష రూపాయల లంప్ సమ్ పెట్టుబడి రూ.3.72 లక్షలు అవుతుంది.

# ఈ వారంలో మార్కెట్‌కు పదికంపెనీల ఐపిఓలు

**ముంబయి, సెప్టెంబరు 7:** స్టాక్ మార్కెట్లో పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగుతోంది. లిస్టింగ్ గెయిన్స్ కోసం చూస్తున్న మార్కెట్ ఇన్వెస్టర్లకు దసరా ముందే వచ్చినట్లుగా ఉంది. ఈ వారంలో ఏకంగా 10 కంపెనీల ఐపీఓలు సబ్‌స్క్రిప్షన్ కోసం వస్తున్నాయి. ఇందులో మూడు మెయిన్ బోర్డ్ కంపెనీలు ఉండగా, ఏడు ఎస్‌ఎంఈ సెగ్మెంట్ నుంచి వస్తున్నాయి. మెయిన్ బోర్డు విభాగంలో చూసుకుంటే శ్రింగర్ హౌస్ ఆఫ్ మగళసూత్ర ఐపీఓ, దేవ్ యాక్సిలరేటర్ ఐపీఓ, అర్బన్ కంపెనీ ఐపీఓలు ఉన్నాయి. ఈ కంపెనీలపై ఇన్వెస్టర్లు ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొత్త ఐపీఓలతో పాటు మరో 8 కంపెనీల ఐపీఓలు సబ్‌స్క్రిప్షన్ ముగించుకుని ఈ వారమే మార్కెట్లలోలిస్టవుతున్నాయి. మెయిన్ బోర్డ్ ఐపీఓల్లో శ్రీంగర్ హౌస్ ఆప్ మంగళసూత్ర కంపెనీ మెయిన్ బోర్డు నుంచి వస్తోన్న ఐపీఓ. ఈ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 10వ తేదీన మొదలవుతోంది. సెప్టెంబర్ 12వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ఐపీఓ ధరల శ్రేణి రూ.155 నుంచి రూ.165 మధ్య నిర్ణయించారు. దేవ్ యాక్సిలరేటర్ కంపెనీ ఐపీ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 10 నుంచి 12వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ ఐపీఓలో షేర్ల ధర ఒక్కొక్కటి రూ.56 రూ.61గా నిర్ణయించారు. అర్బన్ కంపెనీ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ సైతం సెప్టెంబర్ 10వ తేదీన మొదలై 12వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఒక్కో షేరుకు రూ.98 నుంచి రూ.103 మధ్య ధర నిర్ణయించారు. స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సెగ్మెంట్ నుంచి 7 కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. ఈ జాబితాలో కృపాలు మెటల్స్, నిలాచల్ కార్బో మెటాలిక్స్ కంపెనీల సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 8వ తేదీన మొదలవుతోంది. అలాగే కార్బన్ స్టీల్ ఇంజినీరింగ్, తౌరియాన్ ఎంపీఎస్ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 9వ తేదీతో మొదలవుతోంది. జయ్ అంబే సూపర్ మార్కెట్స్, ఎయిర్ ఫ్లో రైల్ టెక్నాలజీ, ఎల్ టీ ఎలివేటర్ కంపెనీల సబ్‌స్క్రిప్షన్ 10వ తేదీ నుంచి మొదలవుతుంది. మెయిన్ బోర్డు పబ్లిక్ ఇష్యూలో అమంత హెల్త్ కేర్ ఐపీఓ సెప్టెంబర్ 9వ తేదీన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్టింగ్ కానుంది.







### ఫండ్స్, మార్కెట్ సంస్థలపై

# సెబీ ఫోకస్

## 12న బోర్డు డైరెక్టర్ల సమావేశంలో సమీక్ష

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7:** మూచువల్‌ఫండ్స్, మార్కెట్ మౌలికవసరుల సంస్థలకు సంబంధించి సెబీ కీలక మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఈనెల 12వ తేదీ జరిగే బోర్డు సమావేశంలోనే ఈకీలక ప్రతిపాదనలపై చర్చలుజరిపి ఆమోదిస్తారని అంచనా. సుదీర్ఘకాలంగా మార్కెట్‌మౌలికసదుపాయాల సంస్థల పనితీరును మరింతపటిష్టంచేయాలన్న ఆలోచన ఉంది. కీలకమైన విభాగాలకు నేతృత్వం వహించేందుకు పాలకబోర్డులోపనిచేసేందుకు ఇద్దరు స్వతంత్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు తప్పనిసరి నియామకం ఉంటుంది. ఇక జాతీయ సంక్లిష్ట సమాచార మౌలికవసరులపరిరక్షణ కేంద్రాలు (ఎన్‌సిఐఐపిసి) మార్గదర్శకాలకు అనుగుణంగా మార్కెట్ మౌలికవసరుల కేంద్రాల్లో ఎండిలు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కీలక సాంకేతిక అధికారుల పాత్రలు బాధ్యతలకు కొన్ని కఠిన నిబంధనలు అమలులోకి తీసుకురావాలని సెబీ యోచిస్తోంది. ఇందుకు సంబంధించి నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌షిప్‌లకు కొన్ని పరిమిత మినహాయింపులు అనుమతించబడతాయని అంచనా. ఎంఐఐలనుంచి ఎఎంసిలవరకూ సవరణలతోపాటు కొన్ని సడలింపులతో కూడిన నిబంధనలు అమలుకు తీసుకురావాలని చెపుతున్నారు. కొన్ని స్పష్టమైన క్లయింట్‌లకు ఒకే పాన్‌కు లింక్‌చేసిన బహుళ క్లయింట్‌కోడ్‌లను కూడా అనుమతించాలన్న ప్రతిపాదనలు కూడా బోర్డులో చర్చించనున్నారు.

# స్టాక్ విభజించిన స్మాల్‌క్యాప్ సెక్టార్ రోలెక్స్ రింగ్స్

**ముంబయి, సెప్టెంబరు 7:** స్మాల్ క్యాప్ కేటగిరిలోని ఆటో యాన్సిలరీస్ సెక్టార్ స్టాక్ రోలెక్స్ రింగ్స్ లిమిటెడ్ కొన్న వారికి బంపర్ ఆఫర్ వచ్చింది. తమ షేర్ హోల్డర్లకు రోలెక్స్ రింగ్స్ కంపెనీ బోర్డు ఇటీవలే సమావేశమై స్టాక్ స్ప్లిట్ చేపట్టేందుకు ఆమోదం తెలిపింది. దీంతో 1 షేరు కొనుగోలు చేసి ఉంటే వారికి 10 షేర్లు ఖాతాలోకి వస్తాయి. ఈ స్టాక్ స్ప్లిట్ తర్వాత స్టాక్ ధర ప్రస్తుతం రూ. 1390 నుంచి రూ. 139 స్థాయికి పడిపోనుంది. కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల భేటీలో 1:10 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేపట్టేందుకు ఆమోదం లభించింది. అంటే ప్రస్తుతం రూ. 10 ఫేస్ వ్యాల్యూ ఉన్న ఒక షేరుని రూ. 1 ఫేస్ వ్యాల్యూ ఉండేలా 10 షేర్లుగా విభజిస్తారు. ఈ స్టాక్ స్ప్లిట్‌లో అర్హత సాధించేందుకు షేర్ హోల్డర్లను నిర్ణయించే రికార్డు డేట్ త్వరలోనే వెల్లడిస్తామని కంపెనీ తెలిపింది. ఆలోపు షేర్లు కొన్న వారికి అర్హత లభిస్తుంది. 1 షేరు ఉంటే 10, 10 షేర్లు ఉంటే 100 షేర్లు ఖాతాలో జమ చేస్తారు. అయితే, అదే స్థాయిలో స్టాక్ ధర తగ్గుతుంది. ప్రస్తుతం రు.1390 వద్ద ఉండగా స్టాక్ స్ప్లిట్ అనతరం రూ.139 స్థాయికి తగ్గుతుంది. అయితే, పెట్టుబడి విలువ మాత్రం తగ్గదు. శుక్రవారంతో ముగిసిన స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్లో రోలెక్స్ రింగ్స్ షేరు సుమారు 0.007 శాతం నష్టపోయి రూ. 1390 వద్ద స్థిరపడింది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 2794, కనిష్ఠ ధర రూ. 1210.40 వద్ద ఉన్నాయి. గత వారంలో ఈ షేరు 4 శాతం నష్టపోయింది. గత నెల రోజుల్లో ఈ షేరు సుమారు 1 శాతం లాభాన్ని ఇచ్చింది గత ఆరు నెలల్లో 3 శాతం పడిపోయింది. గత ఏడాది కాలంలో 44 శాతం నష్టాన్ని మిగిల్చింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps